www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 199 | మంగళవారం 09-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థే మేలు

- అమెరికాది ఫెయిల్యూర్ విధానం
- కార్మిక చట్టాల్లో సంస్కరణలు నష్టదాయకం
- ఉద్యోగాల కల్పనలో కేంద్రం వైఫల్యం
- మీట్ ది ప్రెస్‌లో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్



మీట్‌ద ప్రెస్‌లో మాట్లాడుతున్న అమర్‌జిత్ కౌర్. పక్కన చలసాని రామారావు, ఎస్‌కె.బాబు, కోటేశ్వరరావు, ఓబులేసు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థతోనే దేశం మరింత అభివృద్ధి చెందటంతోపాటు అన్ని రంగాల్లోనూ వృద్ధిని సాధించే అవకాశం ఉంటుందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా తరహా ఆర్థిక వ్యవస్థ కోసం వెంపర్లాడుతోందని, కాని ఆ వ్యవస్థ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అమెరికాలో ఇప్పటికే రుజువు అయిందన్నారు. దేశంలో 67 శాతం మంది వ్యవసాయ రంగంలో ఉంటూ ప్రజలకు అవసరమైన అన్ని రకాల ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇస్రో అనేక విజయాలు సాధిస్తుండగా, సాఫ్ట్‌వేర్ నిపుణులు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అమర్‌జిత్ కౌర్ మీట్ ది ప్రెస్ కార్యక్రమం సోమవారం జరిగింది. కౌర్ మాట్లాడుతూ పాలకులు ఢిల్లీలో కూర్చుని మేక్ ఇన్ ఇండియా

- మిగతా 2 లో

విస్తృత ధర్మాసనానికి హోమోసెక్సువాలిటీ తీర్పు 9లో

కాషాయ పార్టీని గద్దె దింపుదాం

ఇదే తక్షణ రాజకీయ కర్తవ్యం!

- లౌకికవాద పరిరక్షణకు విశాల ఐక్యవేదిక ఆవశ్యకత
- నల్లధనాన్ని వెలికితీయడంలో మోదీ వైఫల్యం
- నిరుద్యోగంతో యువతలో తీవ్ర అసంతృప్తి
- సీపీఐ జాతీయ సమితి సమావేశంలో సురవరం



సీపీఐ జాతీయ సమితి సమావేశంలో ప్రసంగిస్తున్న సురవరం. వేదికపైన రామేంద్రకుమార్, నారాయణ, షమీమ్ ఫైజీ, రామకృష్ణ, రాజా, అతుల్‌కుమార్ అంజాన్, పన్నీర్ రవీంద్రన్, నాగేంద్రనాథ్ ఓఝూ

పక్క చిత్రంలో సమావేశానికి హాజరైన పార్టీ నేతలు →



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : భారతీయ జనాతాపార్టీని అధికారం నుంచి తప్పించడమే తక్షణ రాజకీయ కర్తవ్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. హిందూత్వశక్తుల దాడులను ప్రతిఘటించడం చాలా అవసరమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని, రాజ్యాంగవిలువలను కాపాడాలనుకునే రాజకీయ, రాజకీయేతర శక్తులతో కలసి విశాల ఐక్య వేదికను ఏర్పాటు చేయాలని, అందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలని ఆయన ఉద్ఘాటించారు. దాసరిభవన్‌లో సీపీఐ జాతీయ సమితి సమావేశాలను పురస్కరించుకుని సోమవారం ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బీజేపీలో అవినీతి బాగా పెరిగిపోయిందన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో మోడీ పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. పనామా పేపర్లు, ప్యారడైజ్ ఎక్స్‌పోజర్స్ వల్ల వెల్లడైన జాబితాలో ఉన్న వారిపై విచారణ జరిపి విదేశాల్లోని నల్లధానాన్ని తీసుకొచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేదన్నారు. స్వయంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జేషా అవినీతి బయటపడినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. జర్నలిస్టులు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు, ఉద్యమాలు నిర్వహించే దళితులపై కేసులు నమోదు చేసి ఒత్తిళ్లకు గురిచేస్తోందన్నారు. పాలన, న్యాయవ్యవస్థలను సైతం తమ గుప్పిట్లోకి తీసుకొని నియంత్రించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. హిందూత్వశక్తుల పేరుతో జరుగుతున్న దాడులు మైనార్టీల్లో

- మిగతా 2 లో

ఎర్ర జెండా సాక్షిగా...
పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన షమీమ్ ఫైజీ
12లో
మరిన్ని చిత్రాలు జిల్లా టాబ్లాయిడ్‌లో

బార్‌లో అగ్నిప్రమాదం ఐదుగురి సజీవదహనం



బెంగళూరు : బెంగళూరులోని కేఆర్ మార్కెట్ సమీపంలోని కైలాష్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సోమవారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు సజీవదహనమయ్యారు. మృతులను తుమకూర్‌కు చెందిన స్వామి (23), ప్రసాద్ (20), మహేష్ (35); హస్సన్‌కు చెందిన మంజునాథ్ (45); మాండ్యాకు చెందిన కీర్తి (24)గా గుర్తించినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన కర్ణాటక మంత్రి కేజే జార్జి మృతుల కుటుంబాలకు రూ. 5లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు. కుంబారా సంఘా భవనగంలోని మొదటి అంతస్తులో ఉన్న కైలాష్ బార్ అండ్ రెస్టారెంట్‌లో మంటలు చెలరేగినట్టు గమనించిన స్థానికులు, అగ్నిమాపక దళానికి సమాచారం అందించారని అధికారి

- మిగతా 2 లో

సెట్స్ షెడ్యూల్ ఇదే..

- ఏప్రిల్ 22 నుంచి ఎంసెట్ ▸ ఎంసెట్ ఇంజినీరింగ్ ఏప్రిల్ 22 నుంచి 25 వరకు
- ఎంసెట్ బైపీసీ 26న ▸ ఏప్రిల్ 19న ఏపీ ఎడ్‌సెట్, లాసెట్
- మే 2న ఐసెట్ - మే 3న ఈసెట్ - మే 4న పీఈసెట్
- మే 10 నుండి 12 వరకు ఏపీ పీజీ ఈసెట్ ▸ ఆన్‌లైన్‌లోనే అన్ని పరీక్షలు
- అన్ని పరీక్షల ఫలితాలు వారంలోపే.. ▸ వర్సిటీల్లో ఖాళీల భర్తీకి చర్యలు



విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రంలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ల షెడ్యూలును మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. తాడేపల్లిలోని ఉన్నత విద్యామండలిలో ఆయన పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఏప్రిల్ 19న ఏపీ ఎడ్‌సెట్, లాసెట్ పరీక్షలు జరుగుతాయని, ఎడ్‌సెట్ పరీక్షలు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, లాసెట్ పరీక్షలు 3 నుండి 4.30 వరకు జరుగుతాయన్నారు. ఎడ్‌సెట్ కన్వీనర్‌గా వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ టీ.కుమారస్వామి, లాసెట్ కన్వీనర్‌గా అనంతపురం ఎస్‌కే విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జ్యోతి విజయ్‌కుమార్‌లు వ్యవహరిస్తారన్నారు.

ఏపీ ఎంసెట్ (ఇంజనీరింగ్) పరీక్ష ఏప్రిల్ 22 నుండి

- మిగతా 2 లో

సీఎంల ట్వీట్ల యుద్ధం
▸ రెచ్చిపోతున్న కర్నాటక, యూపీ సీఎంలు
▸ ప్రజల ఆకలి తీర్చడం నేర్చుకోండి : సిద్ద
▸ రైతు ఆత్మహత్యలకు అంతేలేదు : యోగి
9 లో

దేశంలో గంటకో విద్యార్థి మృతి
▸ స్కూళ్లు, కళాశాలల్లో ఒత్తిళ్లు
▸ పెరుగుతున్న ఆత్మహత్యలు
9 లో



ప్రకృతి వనరులతో సంపద

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు : రాష్ట్రంలో రైతులకు సమృద్ధిగా సేద్యపునీరు అందించడాకి 89 నీటిప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చామని, త్వరలోనే వాటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతి

- సాగు నీరే లక్ష్యంగా 89 ప్రాజెక్టులు
- పోలవరం సందర్శన, తాళ్లపూడి జన్మభూమిలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

తీరును పరిశీలించడానికి సోమవారం చంద్ర బాబు పోలవరం ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో జన్మభూమి సభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వనరుల ద్వారా సంపదను సృష్టించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతా నన్నారు. రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటివరకూ 16 వేల కోట్ల రూపాయలు ఖర్చుచేశామని, ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి అందజేశామన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టడానికి చర్చలు జరుపుతున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన పోలవరం ప్రాజెక్టును నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి తీరతామని ఆయన స్పష్టం చేసారు. కొంతమంది సృష్టించే రాజకీయాలవల్లే పోలవరం పనులకు ఆటం కాలు ఏర్పడ్డాయని, అలాంటి శక్తులను నిరోధిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అభివృద్ధికి అడ్డుపడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని, ఈ విషయంలో తానేమి మాట్లాడబోనని చంద్ర బాబు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ పాదయాత్ర చేస్తున్నదని, ఎవరెన్ని యాత్రలు చేసినా తాను కష్టపడి 7 మండలాలను పోలవరం పరిధిలోకి తీసుకువచ్చి ప్రాజెక్టు పనులు చురుకుగా చేపడతానన్నారు. ఆ మండలాలే లేకపోతే జాతీయ ప్రాజెక్టుగా చేపట్టిన పోలవరంకు సరైన ప్రగతి ఉండేది కాదని చంద్రబాబు స్పష్టం చేసారు. కరవురహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. పోలవరం ప్రాజెక్టునకు సంబం ధించి సాంకేతిక అనుమతులన్ని పొందామని, ఢిల్లీలోని సాంకేతిక విభాగంతో చర్చించి, డిజైన్ అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్ పనులను కూడా చేపడతామని ఆయన చెప్పారు. ర్యాక్ ఫిల్డ్



తాళ్లపూడి జన్మభూమి కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న చంద్రబాబు. మంత్రులు తదితరులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఊరింతల బడ్జెట్

- ప్రత్యేక లక్షణంతో రూపకల్పన
- ప్రజారంజకతకు మోడీ విముఖత
- రేపు ఆర్థిక వేత్తలతో ప్రధాని భేటీ
- విద్య, వైద్యంపై ప్రధాన దృష్టి
- నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్
- మీడియాకు అందని అంచనాలు



న్యూఢిల్లీ : 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రజారంజకంగా ఉండబోదని అనేక మంది భావిస్తున్నారని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ సోమవారం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్(ఎన్‌డీఏ) ప్రభుత్వ చివరి పూర్తి సంవత్సర బడ్జెట్ ఇది. ఓట్ల కోసం ఈ బడ్జెట్‌ను ఎలా రూపొందించబోతు న్నారనే విషయమై మీడియాలో అనేక కథనాలు వస్తు న్నాయి. అయితే ఈ బడ్జెట్ సామాన్యుడి సంక్షేమం మెరుంగుపై ప్రధానంగా దృష్టిసారిస్తుందని రాజీవ్ కుమార్ అభి ప్రాయపడ్డారు. 'ఈ ప్రభుత్వానికి ప్రత్యేక లక్షణం ఉందని నేను గొప్ప నమ్మకంతో చెప్పగలను. ఒక ప్రజారంజక బడ్జెట్ కసరత్తుకు ప్రధాన మంత్రి ఎప్పుడూ అనుమతిం చలేదు' అని కుమార్ తెలిపారు. 'ఓట్లు వంటి ఇతర అంశాల కోసం మోడీ ప్రభుత్వం బడ్జెట్‌ను సమర్పించడం లేదు. మీరు ఈసారి ఏమి ఆశిస్తారో. బడ్జెట్ ప్రజా సంక్షే మాన్ని మెరుగుపరిచే రంగాలపై బడ్జెట్ దృష్టిసారిస్తుందని భావిస్తున్నా' అని ఆయన పేర్కొన్నారు. అధిక వృద్ధి పథాన్ని తీసుకుని ఆర్థిక వ్యవస్థకు చెందిన ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరింప చేయడం, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్య సదుపాయాలపై బడ్జెట్ దృష్టి ఉంటుందని కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. బడ్జెట్ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జనవరి 10వ తేదీన దేశానికి చెందిన 30 మంది ప్రముఖ ఆర్థిక వేత్తలతో ఒక సమావేశాన్ని నిర్వహించే అవకాశాలున్నాయి. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్, ప్రధాన మంత్రి

- మిగతా 2 లో

• కోడి పందేలు
హైకోర్టు తీర్పుపై నేడో, రేపో సుప్రీం నిర్ణయం



న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందేలను నిలిపివేయాలన్న హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీం కోర్టు మంగళ, బుధవారల్లో నిర్ణయం తీసుకోనున్నంది. హైకోర్టు తీప్పుపై బీజేపీ నేత, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పారిశ్రామిక వేత్త రఘురామకృష్ణం రాజు సోమవారం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ఒకవైపు కోడిపందాలు ఆడవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ సర్కారు ఇప్పటికే పోలీస్ శాఖను అప్రమత్తం చేసింది. ఎక్కడా కోడి పందాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీజీపీ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ కాగానే బీజేపీ నేతలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించటం విశేషం. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో ఇప్పటికే కోడి పందేల నిర్వహణకు భారీగా ఏర్పాటు జరిగిపోయాయి. దీనిపై సుప్రీంకోర్టు న్యాయవాది సతీష్ గల్లా మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించవద్దని హైకోర్టు 2016 డిసెంబరులోనే ఉత్తర్వులను ఇచ్చిందన్నారు. ఈ ఉత్తర్వులను తాము సుప్రీంకోర్టులో

- మిగతా 2 లో

అమెరికా వల్లే ప్రపంచం భద్రంగా ఉందట

ఐరాసలో రాయబారి నిక్కీహేలీ ఉవాచ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అణుబటన్ తన వద్దనే ఉన్నదని, అది శక్తివంతమైందని తెలియజేస్తూ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్‌ను ఒక ట్వీట్ ద్వారా హెచ్చరించారని దీంతో కిమ్ బొటనవేళ్లపై నుంచొని ఉన్నాడని ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీహేలీ అన్నారు. అమెరికాకుగల అణుశక్తి ప్రపంచ భద్రతకు సహాయపడుతున్నదని ఆమె చెప్పుకున్నారు. కిమ్‌ను ఆయన దేశాన్ని ధ్వంసం చేయగలమని ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. ట్రంప్ చేసిన హెచ్చరిక తీవ్రమైంది. జాగ్రత్తగా ఉండాలి. మీ మాటల జాగ్రత్తగా వాడాలి. మీరేం చేయగలరు? అంటూ కిమ్‌పైన హేలీ రుసరుసలాడారని ఎబిసి వార్తాసంస్థ తెలిపింది. ఆయన అక్కడ ఉండలేరు. అమెరికా తలుచుకుంటే ధ్వంసమైపోతాడు. అణ్వస్త్రాన్ని ఉపయోగించాలనుకుంటే మేముకాదు.. మీరే ధ్వంసమైపోతారు అని హేలీ మాట్లాడినట్టు ఎబిసి తెలియజేసింది. అయితే ట్రంప్ హెచ్చరికలు ప్రపంచ నాయకులకు ఆయనేమిటో తెలియజేస్తున్నాయని, అంచనా వేయలేని వ్యక్తి ట్రంప్ అన్న భావనపోతుందని నిక్కీ హేలీ చెప్పుకొచ్చారు.

హోండురస్‌లో భారీ ర్యాలీ



శాన్‌పెడ్రొసుల : హోండురస్‌లో ప్రతిపక్షనేత సాల్వడార్ నస్రల్లా నాయకత్వంలో భారీ ప్రదర్శన జరిగింది. దేశంలోని అతిపెద్ద రెండవ నగరం శాన్‌పెడ్రొసులలో ఆదివారం ఈ ర్యాలీ నిర్వహించారు. గత నవంబరులో జరిగిన వివాదాస్పద ఎన్నికల ఫలితాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ ప్రదర్శన జరిగింది. ఎన్నికల ట్రిబ్యునల్ తనను మోసగించిందని ప్రతిపక్ష సంఘటన నాయకుడు నస్రల్లా ఇచ్చిన పిలుపుమేరకు ప్రజలు భారీగా స్పందించారు. టిఎస్‌ఇ పార్టీ నాయకుడు నస్రల్లాపైన అధ్యక్ష పదవిలోవున్న జాన్‌ఆర్లండొ హెర్నాడెజ్ ఎన్నికలలో విజయం పొందారు. అతి తక్కువ మెజార్టీతో ఆయన గెలిచారు. హెర్నాండెజ్ పదవినుంచి దిగిపోవాలని ఎన్నికలలో జరిపిన అక్రమాలపై ధ్వజమెత్తుతూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. రాజకీయ హత్యలు చెల్లవని రాజకీయ ఖైదీలకు స్వేచ్ఛ ఇవ్వాలని వారు నినదించారు.

ఆర్థిక అంతరాల వల్లే

ఇరాన్‌లో ప్రదర్శనలు



టెహ్రాన్ : దేశంలో ఆర్థిక అంతరాలు ఊహించలేనంతగా పెరిగిపోయినందునే ఇటీవల ప్రజలు ప్రభుత్వంపైన దండెత్తారు. వరుసగా అనేక రోజులు ప్రదర్శనలు జరిపి తమ ఆగ్రహాన్ని ప్రకటించారు. ఆర్థిక పరిస్థితే ఇందుకు ప్రధాన కారణమని పార్టీ ఫర్ సోషలిజం & లిబరేషన్ పత్రిక ఒక వ్యాసాన్ని ప్రచురించింది. అందులో ప్రజల నిరసనపైన విశ్లేషణ జరిపింది. దేశంలో కార్మికులు, ఇతర అణగారిన వర్గాల ప్రజలు ఈ ప్రదర్శనల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. మధ్యతరగతి ప్రజలు కూడా పాల్గొన్నారు. ధనికులు విలాసవంతమైన జీవనం గడుపుతూ పేదలను మరింత పేదలుగా తయారుచేస్తున్న నేపథ్యంలోనే ప్రజాగ్రహం పెల్లుబికింది. పరాన్నభుక్కులుగా తయారైన సంపన్నులు ప్రభుత్వంపైన అజమాయిషీ చెలాయిస్తున్నారు. ఈనేపథ్యంలోనే కొన్ని పురోగామి సామాజిక భద్రత విధానాలను అమలు జరుపుతామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. ప్రభుత్వంలోవున్న వర్గాలు, వారిని ఆశ్రయించిన వర్గాలు మాత్రమే అత్యధిక సంపదలను కూడబెట్టుకున్నారని ఆ పత్రిక పేర్కొంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూసిన ప్రజలు మరింత ఆగ్రహంతో ఉన్నారు. ఇదిలావుండగా వచ్చే సంవత్సరం బడ్జెట్‌లో గాసోలిన్ ధరలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. ఇరాన్‌లో ఇంధన ధరలు కార్మికులు, దిగువ తరగతి ప్రజల వీపులను మోగిస్తున్నాయి. గాసోలిన్‌పైన భారీగా సబ్సిడీ ఇస్తున్నారు. అందువల్ల గాసోలిన్ ధరలు అన్ని దేశాలలోకంటే తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఇంధనం, బ్రెడ్డు, పంచదార, బియ్యం, ఖాద్యతైలాలు మందులపైన ప్రభుత్వం ఏడాదికి వంద బిలియన్ డాలర్ల సబ్సిడీని ఇస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న నగదు సబ్సిడీలను గణనీయంగా తగ్గించివేయడం ద్వారా ప్రజా ప్రదర్శనలకు మరొక కారణం. 90 శాతం మంది ప్రజలకు నగదురూపంలో సబ్సిడీలు అందిస్తున్నారు. ఈ సబ్సిడీ మొత్తాలను ప్రజల బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమచేస్తారు. ఈ విధంగా ఏడాదికి ప్రభుత్వం 30 బిలియన్ డాలర్లను అందిస్తున్నది. ప్రజా నిరసన కార్యక్రమాలలో విదేశీ జోక్యం కూడా ఉండవచ్చునని ఆ పత్రిక పేర్కొంది. విదేశీ జోక్యం ఇరాన్‌లో చాలాకాలంగా ఉంటోంది. ఇరాన్ శత్రువుగా పరిగణిస్తున్న అమెరికా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా దేశాలు జోక్యానికి పాల్పడిన సందర్భాలున్నాయి.

ట్రంప్ పాలనలో పెరిగిన దిగుమతులు

వాణిజ్యలోటు 48.7 బిలియన్ డాలర్లు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనాకాలంలో ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగిపోయాయి. 2017 అక్టోబర్‌లో అంతర్జాతీయ వాణిజ్యంపైన బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ విశ్లేషణ ప్రకారం అమెరికా 244.6 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను, సేవలను దిగుమతి చేసుకోగా 195.9 బిలియన్ డాలర్ల ఎగుమతులు మాత్రమే జరిగింది. ఫలితంగా వాణిజ్యలోటు 48.8 బిలియన్ డాలర్లు నమోదయ్యింది. ఈ గణాంకాలు 2017 జనవరి, అక్టోబర్ మధ్యకాలంలో జరిగిన వాణిజ్యానికి సంబంధించినవి. ట్రంప్ అధికారానికి వచ్చిన నాటినుంచి నార్త్ అమెరికా ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ (ఎన్‌ఎఎఫ్‌పిఎ-ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం) నుంచి అలాగే ట్రాన్స్-పసిఫిక్ పార్టనర్‌షిప్ (టిపిపి-పసిఫిక్ సముద్ర తీరప్రాంత దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం) నుంచి వైదొలగుతామని పదేపదే ప్రకటించారు. ఎన్‌ఎఎఫ్‌టిఎలో అమెరికా, మెక్సికో, కెనడా ఉన్నాయి. అలాగే టిపిపిలో అమెరికాతోపాటు పసిఫిక్ మహాసముద్రతీర ప్రాంతంలోని 11 దేశాలున్నాయి. ఇతర దేశాలతో వాణిజ్యంలో తాము లోటును ఎదుర్కొంటున్నామని ట్రంప్ పలుమార్లు చెప్పారు. ఏ దేశంతోనూ వాణిజ్యంలో తాము ఆధిక్యంలో లేమని, లోటును ఎదుర్కొంటున్నామని గత నెలలో కూడా ట్రంప్ వాపోయారు. బహుశ ఈ నేపథ్యంలోనే హెచ్1బి వీసాలో మార్పులు చేయాలని భావించినట్టుగా అంచనా వేస్తున్నారు. జపాన్, జర్మనీ, వియత్నాం దేశాలతో జరిగే వాణిజ్యంలోను అమెరికా లోటును ఎదుర్కొంటున్నది. గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నప్పటికి పలు దేశాలతో తాము వాణిజ్య మిగులును కలిగివున్నామని ట్రంప్ గొప్పలు చెప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. అయితే సేవల వాణిజ్యంలో అమెరికా మిగులువాణిజ్యాన్ని కలిగివుంది.

పాక్ వైఖరికి అమెరికాలో నిరసన



వాషింగ్టన్ : భారత అధికారి కుల్‌భూషణ్ జాదవ్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాడంటూ పాకిస్తాన్ ప్రభుత్వం ఆయనపై విచారణతంతు జరిపి జైలులో పెట్టిన విషయం తెలిసిందే. జైలులోవున్న ఆయనను చూసేందుకు ఇటీవల ఆయన తల్లి, భార్య వెళ్లారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ప్రభుత్వం అమానుషంగా అవమానించింది. ఈ వ్యవహారాలపైన పాకిస్తాన్ వైఖరి నిరసిస్తూ అమెరికాలోని పాకిస్తాన్ రాయబార కార్యాలయం ఎదుట ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనలో భారత్, ఆఫ్ఘనిస్తాన్, బెలూచిస్తాన్‌లకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. పాకిస్తాన్ ప్రభుత్వం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి జాదవ్‌పైన నేరం మోపి విచారణ జరిపింది. జాధవ్ తల్లి, భార్య జైలువద్దకు వెళ్లినపుడు చెప్పులు, మంగళసూత్రాలు తీసివేసి లోపలికి రావాలని అధికారులు ఆదేశించడం ద్వారా వారిని అవమానించారు. అలాగే వీరు నేరుగా కలుసుకోకుండా జాదవ్, వీరికి మధ్య గ్లాస్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. దగ్గరకు వెళ్లి జాదవ్‌తో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. కేవలం ఫోన్ ఇంటర్‌కం ద్వారా మాత్రమే 40 నిముషాలు మాట్లాడేందుకు అనుమతించినట్టుగా ఆ తరువాత విడుదలైన వీడియో దృశ్యాలు తెలియజేస్తున్నాయి.

ట్రంప్, మాక్రాన్ ఫోన్ సంభాషణ



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్‌లు ఫోన్ ద్వారా కొరియా ద్వీపకల్పం, ఇరాన్ అంశాలపైన మాట్లాడుకున్నారు. కొరియా ద్వీపకల్పంలో జరుగుతున్న తాజా పరిణామాలపైన ట్రంప్ మాక్రాన్‌కి వివరించారు. ఉత్తరకొరియాను పూర్తిగా అణ్వస్త్రరహితం చేసేందుకు ప్రపంచమంతా పూనుకోవాలని ట్రంప్ కోరినట్టుగా వైట్‌హౌస్ తెలిపింది. అలాగే ఇరాన్‌లో జరుగుతున్న ప్రదర్శనలపైన కూడా ఇరువురు మాట్లాడుకున్నారు. తమ దేశంలో జరుగుతున్న ప్రదర్శనలపై ట్రంప్ జోక్యం చేసుకోవడమెందుకని ఇరాన్ తీవ్రంగా విమర్శించింది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి గొల మలిఖొమ్రా మాట్లాడుతూ ఇరాన్ అంతరంగిక వ్యవహారాలలో అమెరికా జోక్యాన్ని అంగీకరించబోమని చెప్పినట్టుగా తాస్‌నిమ్ వార్తాసంస్థ తెలియజేసింది. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాన్‌ఉన్‌తో తాను మాట్లాడదలుచుకున్నట్టుగా ట్రంప్ చెప్పినట్టు వార్తలందాయి. అలాగే రెండు కొరియాల మధ్య చర్చలు జరగాలని అభిలషించినట్టు తెలుస్తోంది.

పోటీ నుంచి వైదొలగిన షఫీక్



కైరో : ఈజిప్టులో త్వరలో జరగనున్న అధ్యక్ష ఎన్నికలలో తాను పోటీచేయబోవడంలేదని ఆదేశ మాజీ ప్రధానమంత్రి అహమ్మద్ షఫీక్ ప్రకటించారు. రానున్నకాలంలో తాను ప్రభుత్వ వ్యవహారాలలో పాల్గొనేందుకు సరైన వ్యక్తినికాదని భావిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. అందువల్లనే తాను ఈ ఏడాది జరగనున్న అధ్యక్ష ఎన్నికలకు పోటీ చేయడంలేదని ఒక ట్వీట్‌లో తెలియజేశారు. 2012లో షఫీక్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి అతి తక్కువ మార్జిన్‌తో మహమ్మద్ మోర్సీచేతిలో ఓడిపోయారు. ఓటమి తరువాత ఆయన దేశంవిడిచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లిపోయి తిరిగి గత నవంబర్‌లో ఈజిప్టుకు చేరుకున్నారు. ఆ తరువాత పోటీ చేయనున్నట్టుగా ప్రకటించారు. దాదాపు 5 సంవత్సరాలు దేశంలో లేకపోవడంవల్లనే ఇక్కడ జరుగుతున్న పరిణామాలు అవగాహనలేక ఎన్నికలలో పోటీ చేయరాదని షఫీక్ నిర్ణయించుకున్నట్టు ఆయన ప్రకటన తెలియజేస్తోంది. ఈజిప్టు ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్‌ఫతాహ్‌అల్-సిసి ఈ ఏడాది జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అంశాన్ని ఇంకా ప్రకటించలేదు.

ఆర్థిక వ్యవస్థే మేలు

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో నినాదాలు చేస్తున్నారేగానీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన చేయటం లేదన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయటం వల్ల యువతకు ఉద్యోగవకాశాలు లభించటంతోపాటు ఆర్థిక వ్యవస్థ కూడా వృద్ధి చెందుతుందని చెప్పారు. దేశంలోని కార్మిక సంఘాలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నాయని, కానీ పాలకులు చట్టాల్లో తెస్తున్న మార్పుల వల్ల కార్మికుల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలలో ఇప్పటికే కార్మిక చట్టాల సంస్కరణల బిల్లులను ఆయా ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయన్నారు. దీనిని నిరసిస్తూ గత ఏడాది నవంబర్‌లో అన్ని జాతీయ కార్మిక సంఘాలు సమ్మె నిర్వహించినట్లు చెప్పారు.

17న ఢిల్లీలో స్కీమ్ వర్కర్ల సమ్మె

అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా పథకాలలో పని చేస్తున్న వారికి (స్కీమ్ వర్కర్స్) కనీస వేతనాలు ఇవ్వాలని ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించేందుకు ఈ నెల 17న న్యూఢిల్లీలో దేశవ్యాప్త సమ్మె చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు అన్ని ట్రేడ్ యూనియన్లు మద్దతునిస్తున్నట్లు తెలిపారు. అలాగే పెరుగుతున్న ధరలను తగ్గించాలన్న డిమాండుతో ఈ నెల 23న ఆంధ్రప్రదేశ్‌లో సత్యాగ్రహం చేయనున్నట్లు తెలిపారు. కనీస వేతనాలు చెల్లించకపోగా విద్యా, వైద్యాన్ని వ్యాపారంగా మార్చేయటంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలతోపాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండు చేశారు. దేశంలో 2.5 లక్షల చిన్న తరహా పరిశ్రమలు మూత వల్ల 17 లక్షల మంది ఉపాధిని కోల్పోయారని, ఆరు కోట్ల కుటుంబాలు జీవనోపాధికి దూరమైనట్లు చెప్పారు. ఏటా రెండు కోట్ల కొత్త ఉద్యోగాలిస్తున్న కేంద్ర ప్రభుత్వం 2015-16లో కేవలం 1.5 లక్షల మందికే ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ధరల పెరుగుదలపై మరోసారి సమ్మె

ధరలను అదుపు చేయటంలో కేంద్రం వైఫల్యం చెందిందని, దీనిపై అన్ని కార్మిక సంఘాలు మళ్లీ సమ్మెబాట పట్టనున్నట్లు కౌర్ వెల్లడించారు. భవిష్యత్ కార్యాచరణపై త్వరలోనే జాతీయ కార్మిక సంఘాలన్నీ సమావేశమై ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధర తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకపోవటం శోచనీయమన్నారు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగటంతో రవాణా, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినట్లు చెప్పారు. పౌరసరఫరాల వ్యవస్థను క్రమబద్ధీకరించాలని, పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు తక్షణమే ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని అమర్‌జిత్ కౌర్ డిమాండు చేశారు. మీట్ ది ప్రెస్‌లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బి.విలియం పాల్, ఉపాధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌కే బాబూ అమర్‌జిత్ కౌర్‌ను పరిచయం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు కూడా పాల్గొన్నారు.

ప్రకృతి వనరులతో సంపద

(మొదటిపేజీ తరువాయి)

డ్యామ్ 4.9 లక్షల క్యూబిక్ మీటర్ల మేరా పూర్తయిందని, మిగిలిన 2.3 కిలోమీటర్ల పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. గోదావరితో పాటు పెన్నా, కృష్ణా, నాగావళి, వంశధార నదులను కూడా అనుసంధానం చేసి 5 దశల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించామని ఆయన చెప్పారు. నదుల అనుసంధానంలో భాగంగా కృష్ణా జిల్లా వైకుంఠపురం వద్ద బ్యారేజీ నిర్మాణం, గొల్లాపల్లిలో రిజర్వాయరు నిర్మాణం పనులు పూర్తి చేసి రాష్ట్రంలోని నదులతోపాటు సముద్ర తీర ప్రాంతాల్లో కూడా టూరిజం ప్రాజెక్టులను ఏర్పాటు చేసి, ఆంధ్రప్రదేశ్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతా మనని చంద్రబాబు చెప్పారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు (ఉమ), పితాని సత్యనారాయణ, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్, ఎంపీలు తోట సీతా రామలక్ష్మి, మాగంటి వెంకటేశ్వరరావు (బాబు), జిల్లా కలెక్టరు కాటంనేని భాస్కర్, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పాలి ప్రసాద్, పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, డీసీసీబీ ఛైర్మన్ ముత్యాల రత్నం, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ జడ్‌పీ ఛైర్మన్ కొక్కిరిగడ్డ జయ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురి సజీవదహనం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. మంటలను అదుపుచేసేందుకు అగ్నిమాపక దళానికి రెండున్నర గంటలు పట్టినట్టు చెప్పారు. ప్రమాదానికిగల కారణాలు తెలియరాలేదన్నారు. బార్ లైసెన్సు వీఆర్ దయాశంకర్ పేరుమీద ఉందని, దీని నిర్వహణను ఎవరు చూసుకుంటున్నారో తేలలేదని, బార్ వరణలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేవని అధికారి వివరించారు. బార్ యజమాని దయాశంకర్ పరారీలో ఉన్నట్టు తెలిపారు.

ఊరింతల బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ వివేక్ దెబ్రాయ్, ఆర్థిక సలహా మండలి ఇతర సభ్యులు కూడా హాజరవుతారు. సమావేశ అజెండాను కూడా కుమార్ వెల్లడించారు. నీతి ఆయోగ్ ఏర్పడినప్పటి నుంచి సంప్రదాయంగా ఈ సమావేశం జరుగుతుందన్నారు. 'దేశ ఆర్థిక కార్యకలాపాల ప్రభావం, బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి మేము వీలైనంత మంది అభిప్రాయాలను సేకరించాలనుకుంటున్నాం' అని కుమార్ తెలిపారు. కాగా షెడ్యూల్ ప్రకారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరగనున్నాయి.

సెట్స్ షెడ్యూల్ ఇదే..

(మొదటిపేజీ తరువాయి)

25 వరకు, ఉదయం 9 గంటల నుండి 11.30, మధ్యాహ్నం 12 నుండి 1.30 వరకు, 2.30 నుండి 4 గంటల వరకు మూడు రోజులపాటు జరుగుతాయని, ఏపీ ఎంసెట్ (బైపీసీ) పరీక్షలు 26వ తేదీ ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు మూడు పూటల పై సమయాల్లో తెలిపినట్లుగా జరుగుతాయని ఆయన వివరించారు. వీటికి కాకినాడ జేఎన్‌టీయూకి చెందిన ప్రొఫెసర్ సాయిబాబును కన్వీనర్‌గా నియమించామన్నారు.

ఐసెట్ పరీక్షలు మే 2న ఉదయం 10.30 నుండి 12.50 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు జరుగుతాయని, వీటికి ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.సుధీర్ కన్వీనర్ అని, 3వ తేదీన ఏపీ ఈసెట్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందని, దీనికి అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ పి.ఆర్.భానుమూర్తి కన్వీనర్ అని మంత్రి తెలిపారు.

ఏపీ పీఈసెట్ పరీక్షలు మే 4న ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని దీనికి నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ పి.ఎస్.ఎస్.పాల్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు.

ఏపీ పీజీ ఈసెట్ పరీక్షలు మే 10 నుండి 12వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు జరుగుతాయని వీటికి ఆంధ్రా వర్సిటీ ప్రొఫెసర్ పి.ఎస్.అవధాని కన్వీనర్‌గా ఉంటారని మంత్రి తెలిపారు.

2017-18 సంవత్సరాల్లో ఎంసెట్ పరీక్షలు 115 నుంచి 150 కేంద్రాలలో జరుగుతాయన్నారు. పరీక్షలు జరిగిన వారం, 10 రోజుల్లోనే పై ఫలితాలు వెల్లడించటం జరుగుతుందని మంత్రి గంటా చెప్పారు. పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామన్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రం వర్సిటీగా మార్పు

రాష్ట్రంలో ఇంధన, లాజిస్టిక్స్, ఆతిథ్య వర్సిటీలను త్వరలోనే ఏర్పాటు చేయను న్నామని, విశాఖలో ఉన్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని వర్సిటీగా మార్పు చేయనున్నట్లు మంత్రి గంటా ప్రకటిస్తూ, వచ్చే విద్యా సంవత్సరానికి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ వర్సిటీ ప్రారంభించే అవకాశం ఉందని, అన్ని వర్సిటీల్లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

నోటిఫికేషన్లు ఇవ్వాలని అన్ని వర్సిటీలకు ఆదేశాలిచ్చామని, 2016-18 బీఈడీ, డీఈడీ విద్యార్థులకు టెట్ రాసేందుకు అర్హత కల్పిస్తున్నట్లు వివరించారు. నాలుగేళ్ల ఉపాధ్యాయ శిక్షణపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, రాష్ట్రంలో నాలుగేళ్ల సమీకృత విద్యార్థి శిక్షణ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాక్-ఎ గ్రేడ్ సాధించిన వంద కళాశాలల్లో ఈ కోర్సును ప్రారంభిస్తామని మంత్రి గంటా చెప్పారు.

ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి పాండాదాస్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ విజయ్‌రాజ్, వైస్ ఛైర్మన్ నరసింహారావు, కార్యదర్శి వరదరాజన్ ఉన్నారు.

గద్దె దింపుదాం

(మొదటిపేజీ తరువాయి)

అభద్రతాభావాన్ని కలిగిస్తోందన్నారు. కేంద్ర అధికారాలు విస్తృతం అవుతున్నాయని ఆయన తెలిపారు. ఈ విధానం చాలా తీవ్రమైన ప్రమాదాన్ని తెచ్చిపెడుతోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, ఫాసిస్టు ధోరణులు పెరుగుతున్న నేపథ్యంతో తమ పార్టీ తీవ్రంగా ఆందోళన చెందుతోందన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగే పరిస్థితి నెలకొనదంతో విమానయానంలోనే 13 శాతం చార్జీలు పెంచబోతున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. అలాగే రైళ్లు, బస్సులపై కూడా డీజిల్ ధరల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంటగ్యాస్‌పై అసాధారణమైన రీతిలో సబ్సిడీలను రద్దు చేసే పేరుతో ప్రతి నెల రూ. 10లు గ్యాస్‌సిలెండర్లపై పెంచుకుంటూ పోతున్నారని ఆయన తెలిపారు. ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని చోట్లా నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. యువత తీవ్రమైన అసంతృప్తికి లోనవుతోందన్నారు. మరోవైపు ప్రజలపై పన్నుల భారం కూడా పెరుగుతోందన్నారు. ఇక అంతర్జాతీయ విషయాలను ప్రస్తావిస్తూ.. అగ్రరాజ్యం అమెరికా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తన పెత్తనాన్ని చలాయించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఆ దేశంలో విపరీతమైన నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో స్థానికత సమస్యను రెచ్చగొట్టి మధ్యతరగతి ప్రజలిచ్చిన తీర్పుతోనే డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చారన్నారు. ఇక అమెరికా-ఉత్తర కొరియా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సహా ఆయా దేశాల్లో నెలకొన్న ఆర్థిక సంక్షోభాలు, రాజకీయ పరిణామాలను వివరించారు. వాతావరణ కాలుష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రకృతికి వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు.

మంచుతుపాన్లు, హరికేన్లు, భూతాపం వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు తీవ్రంగా జరుగుతున్నాయని తెలిపారు. కేరళలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి 29 వరకూ జరిగే సీపీఐ 23వ మహాసభలో ఆమోదించాల్సిన రాజకీయ తీర్మానం గురించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సుధాకరరెడ్డి వివరించారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షత వహించగా పార్టీ కేంద్ర కార్యదర్శివర్గసభ్యులు షమీమ్ ఫైజీ, డి రాజా, కె నారాయణ, రామేంద్రకుమార్, అతుల్‌కుమార్ అంజన్, పన్నీర్ రవీంద్రన్, నాగేంద్రనాథ్ ఓఝా, అమర్‌జిత్‌కౌర్ వేదికపై ఆసీనులయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన రాష్ట్ర సమితి ప్రతినిధులు కౌన్సిల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుప్రీం నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

సవాలు చేయటం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు మాత్రం కోళ్ళను అరెస్ట్ చేయవద్దని చెబుతూనే మిగతా కేసును యథా విధిగా విచారణ చేస్తూ వాయిదా వేసిందన్నారు. ఈ ఏడాది మళ్లీ కోడిపందేలపై హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలైందన్నారు. ఈ నేపథ్యంలోనే హైకోర్టు గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులనే కఠినంగా అమలు పరిచి వాటిని అతిక్రమించిన వారిని తమ ఎదుట హాజరు పర్చాలని తాజాగా ఆదేశించిందన్నారు. అయితే పాత ఉత్తర్వులను అమలు పరచమని హైకోర్టు చెప్పటం కొంత వివాదాస్పదమైందన్నారు. పాత ఉత్తర్వులు అమలు పర్చటం అంటే ఇంతకు ముందే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుపై కొత్త మధ్యంతర ఉత్తర్వులు ఎలా ఇస్తారంటూ సుప్రీంకోర్టును రఘురామకృష్ణం రాజు ఆశ్రయించారని చెప్పారు. ఈ కేసు పూర్తి విచారణ సుప్రీంకోర్టులో పూర్తి అయ్యే వరకు ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను నిలుపుద చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలో మంగళ, బుధవారాల్లో విచారణ కొనసాగనున్నదని న్యాయవాది సతీష్ చెప్పారు. అయితే గత ఏడాది కూడా ఇదే మాదిరిగా సుప్రీంకోర్టులో కోడిపందాలపై కేసు విచారణ జరగటం, పండగ చివరి రోజు వరకు కోడి పందాల రాయుళ్ళు పట్టు విడవకుండా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన నేపథ్యంలోనే ఆ రోజు హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మరి మరో మారు కోడి పందాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వటంతో ఇటు న్యాయవాదుల్లోనూ, పందాల రాయుళ్లలోనూ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీనిపై న్యాయవాదులు కూడా సర్వోన్నత న్యాయస్థానంపై పిటీషన్లు దాఖలు చేయటం జరిగింది.

విజయ్‌కుమార్‌ను విచారించిన పోలీసులు

విశాలాంధ్ర-గుంటూరుబ్యూరో/నరసరావుపేట : రాష్ట్రంలో సంచలనం కల్గించిన కిడ్నీ ముఠా రాకెట్‌లో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకుడు కపిలవాయి విజయ్‌కుమార్‌ను నరసరావుపేట పోలీసులు సోమవారం రాత్రి విచారించారు. కిడ్నీమార్పిడికి అనుమతి పత్రాలు ఇవ్వాలని తహసీల్దార్‌పై ఎందుకు ఒత్తిడి తీసుకొచ్చారనే కోణంలో విచారించినట్లు సమాచారం. పైగా కిడ్నీమార్పిడి వ్యవహారంలో జోక్యం ఎందుకు చేసుకోవాల్సివచ్చింది వంటి అనేక కోణాల్లో విచారించినట్లు తెలిసింది. అలాగే కిడ్నీ రాకెట్ కేసు విచారణలో పోలీసులు రెవెన్యూ అధికారుల వ్యవహారశైలి పలు అనుమానాలకు దారితీస్తోంది. ఆధార్ కార్డును మార్ఫింగ్ చేసి ఒకరిపేరుతో మరొకరి కిడ్నీలను అమ్మకాలు నిర్వహించేందుకు సహకరిస్తున్న తహశీల్దార్ కార్యాలయ సిబ్బందితో పాటు దీనికి సూత్రధారులైన ఐదుగురుపై కేసులు నమోదు చేసిన పోలీసులు వారిని విచారించటంలో తాత్సారం చేస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం కిడ్నీ రాకెట్‌పై వివిధ వార్తలు ప్రసారం కావటంతో అప్రమత్తమైన పోలీస్, రెవెన్యూ అధికారులలో కదలిక మొదలైంది. ఈ కేసుకు సంబంధించి నరసరావుపేటకు చెందిన టీడీపీ నాయకుడు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్‌తో సహా మరి కొందరిని సోమవారం విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ విచారణకు పెద్ద ఎత్తున మద్దతు దారులతో విజయ్‌కుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు సాయంత్రం 4 గంటలకు వెళ్ళి తిరిగి 7 గంటలకు బయటకు వచ్చారు. పోలీస్ విచారణకు తాను సహకరిస్తున్నానని విజయ్‌కుమార్ విలేఖర్లకు తెలిపి వెళ్ళిపోయారు. అయితే విచారణ ఏమి జరిగిందో పోలీసులు వెల్లడించలేదు. అయితే కిడ్నీ రాకెట్ కేసు విషయంలో రెవెన్యూ అధికారులు జారీ చేసిన సర్టిఫికెట్లు, ఇందుకు సహకరించిన వారిపై పోలీసులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకవటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐ శివప్రసాద్ బృందం ఇప్పటివరకు నరసరావుపేట పరిసర ప్రాంతాల నుండి ఎంతమందికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగాయనే అంశంపై గుంటూరు గవర్నమెంట్

విచారణ వివరాలను వెల్లడించని పోలీసులు

కిడ్నీరాకెట్ ముఠాపై అనుమానాలు

జనరల్ ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కాగా గతేడాది నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి అనుమతులు పొంది నలుగురు కిడ్నీలను ఇతరులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. వీరిలో ముగ్గురికి అనుమతులు ఇప్పించేందుకు గుంటూరుకు చెందిన నాగమల్లేశ్వరరావు అనే డ్రైవర్ కీలకంగా వ్యవహరించినట్లు విశ్వాసనీయ సమాచారం. సర్టిఫికెట్లు పొందిన వారిలో కొప్పిశెట్టి శశాంక్‌కు కోట శ్రీనివాసరావు అనే వ్యక్తి నాగమల్లేశ్వరరావు ద్వారా ఆగస్టు నెలలో తహశీల్దార్ కార్యాలయం నుండి ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్‌ను ఇప్పించినట్లు తెలిసింది. అలాగే తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రావిపూడి నరేష్‌కు కిడ్నీ మార్పిడికి అక్టోబర్ నెలలో మధ్యవర్తిగా ఈయనే వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం రావూరి రవిచౌదరి పేరుతో దరఖాస్తు చేసిన విషయంలో కూడా నాగమల్లేశ్వరరావుయే మధ్యవర్తిగా వ్యవహరించి తహశీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందేందుకు ప్రయత్నించారనే అభియోగం కూడా వినిపిస్తుంది.

కోర్టు ధిక్కరణ పిటిషన్ల విచారణ

రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు



న్యూఢిల్లీ- విశాలాంధ్రబ్యూరో : ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కోర్టు తీర్పును అమలు చేయలేదంటూ సుప్రీం కోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. పదవీ విరమణ పెంపునకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ కార్పొరేషన్ సంస్థలు, సొసైటీలు, గిరిజన, సాంఘిక, గురుకుల విద్యా సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వయోపరిమితి పెంపును అమలు చేయలేదని ఆయా సంస్థలకు చెందిన ఉద్యోగులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించి,ఆగస్టు 9న ఉద్యోగులకు అనుకూల తీర్పుతో ఉత్తర్వులు జారీ చేసింది. 58 ఏళ్లకే పదవీ విరమణ పొంది, ఇంకా పదవీ విరమణ వయస్సు దాటనిపక్షంలో వారిని ఉద్యోగంలో కొనసాగనివ్వాలని, పదవీ విరమణ వయస్సు దాటిన పక్షంలో వారు ఉద్యోగం నుంచి వైదొలగిన సమయం నుంచి 60 ఏళ్ల వయస్సు వచ్చిన నాటికి గలకాలానికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని ధర్మాసనం పేర్కొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వులను అమలు చేయలేదని, అమలుకు షరతులు పెడుతున్నదని పేర్కొంటూ విద్యుత్ సంస్థల ఉద్యోగులు ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలంటూ ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కోలకు జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం నోటీసు జారీ చేసింది.

సచివాలయంలో సంక్రాంతి ఘుమఘుమలు

పర్యాటక శాఖ నేతృత్వంలో ప్రత్యేక వంటకాలు

విశాలాంధ్ర - అమరావతి : ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ నేతృత్వంలో సంక్రాంతి వేడుకల శుభవేళ సచివాలయ ఉద్యోగుల కోసం ప్రత్యేక తెలుగు వంటకాలను అందిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్‌మీనా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయ ఉద్యోగుల సహకార సంఘం సహకారంతో నాలుగు రోజుల పాటు సచివాలయ ఫలహారశాలలో ఆహార పండుగ జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఒక విశేష వంటకాన్ని పర్యాటక శాఖ తరుపున భోజనంతో పాటు అందిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం రాగిసంకటి, వేరుశనగ పచ్చడి, బుధవారం దంపుడు బియ్యం పలావ్, కుర్మా, గురువారం మెంతికూర టమాటా అన్నం, కుర్మా, శుక్రవారం బెల్లం పొంగలి,మసాలా వడ అందిస్తున్నట్లు చెప్పారు. పర్యాటక శాఖ అందించే ఈ వంటకాలకు అదనపు చెల్లింపుల అవసరం లేదని, రాష్ట్రం ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు ఆదేశాల మేరకు తొలిసారి ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ముఖేష్ కుమార్ మీనా వివరించారు.

'ఉపాధి'లో తాటి, ఈత చెట్ల పెంపకం

- గీత కార్మికుల జీవనోపాధి, భద్రతకు ప్రాధాన్యం
- ప్రాజెక్టులు, నది ఒడ్డున, చెరువు, కాల్వ కట్టలు ఎంపిక
- నూతన గీతవృత్తి విధానం మార్గదర్శకాలు విడుదల



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : బీసీ మంత్రాన్ని జపిస్తున్న ప్రభుత్వం గీతవృత్తిదారుల జీవనోపాధిని మెరుగు పరచటంతోపాటు వృత్తిని పరిరక్షించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టుల వద్ద, నదుల ఒడ్డున, చెరువు, కాల్వ కట్టలపైనా తాటి, ఈత చెట్లను పెంచేందుకు చర్యలు చేపట్టనుంది. అందులో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద తాటి, ఈత చెట్లను పెంచేందుకు వీలుగా గీతవృత్తి 2017-22 విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. గీత కార్మికుల జీవనోపాధిని మెరుగుపరచటంతోపాటు వృత్తిదారులకు భద్రత కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు గీతవృత్తి విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీ సాంబశివరావు సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. అలాగే గీతవృత్తి లైసెన్స్‌ల జారీ, తాడిచెట్ల కేటాయింపునకు సంబంధించిన ఏపీ ఎక్సైజ్ 2007 రూల్స్‌ను సవరిస్తూ మరో ఉత్తర్వును కూడా ప్రభుత్వం జారీ చేసింది. దీని ప్రకారం ఇప్పటి వరకు 50 కిలో మీటర్ల పరిధిలోని తాటి చెట్ల నుంచి కల్లు తీయటాన్ని 100 కిలో మీటర్లకు విస్తరించి నిబంధనలను సవరించింది. ప్రాజెక్టు ప్రాంతాలు, నది ఒడ్డు, చెరువులు, కాల్వ కట్టలపై ఉపాధి కింద చెట్లను పెంచి గీతవృత్తి సహకార సంఘాలకు అప్పగించేందుకు ప్రణాళికను రూపొందించింది. వన మహోత్సవంలో భాగంగా అటవీ, ఉద్యానశాఖలు ఈ చెట్లన పెంచేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం జిల్లాలోని ఖాళీ భూములు, ప్రాజెక్టుల భూములు, ఇతర భూములను పరిరక్షించేందుకు కలెక్టర్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కూడా ప్రభుత్వం సూచించింది.

మార్గదర్శకాలు

నూతన గీతవృత్తి విధానం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రూ.25, పట్టణ ప్రాంతాల్లో రూ.50గా ఉన్న తాటి చెట్ల అద్దెను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుతం తాటి చెట్ల నుంచి కార్మికులు కల్లును తీసేందుకు తాటి చెట్లను వృత్తిదారులకు, ఎస్టీలకు మంజూరు చేయటాన్ని కొనసాగించాలని ఆ విధానంలో ప్రభుత్వం పేర్కొంది. గీత కార్మికులకు జారీ చేసే లైసెన్స్‌లు ఐదు సంవత్సరాల కాలంపాటు అమలులో ఉంటాయి. గీతవృత్తిదారుల సహకార సంఘాల పరిధిలో వంద కిలో మీటర్ల పరిధిలో ఉన్న తాటి చెట్లు, అవసరాన్ని బట్టి ఎన్ని షాపులకు అనుమతి ఇవ్వాలనే విషయాన్ని ఎక్సైజ్‌శాఖ నిర్ణయిస్తుంది. అంగవైకల్యం ఉన్న వారికి పింఛన్ సౌకర్యాన్ని కొనసాగిస్తూ, ప్రమాదంలో మరణించిన వారికి చెల్లించే నష్టపరిహారాన్ని ఇక మీదట చంద్రన్న బీమా ద్వారా చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వృత్తిదారులు ప్రమాద బీమా, ఆమ్ ఆద్మీ బీమా యోజనా కింద నమోదు చేసుకోవాలని సూచించింది.

'మద్యం' నిబంధనల ఉల్లంఘిస్తే భారీ జరిమానా

రాష్ట్రంలోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడితే భారీగా అపరాధ రుసుం వసూలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం 1968, సెక్షన్ 47(1) సవరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీ సాంబశివరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం వ్యాపారానికి లైసెన్స్ పొందిన వారు మొదటిసారిగా తప్పు చేస్తే రూ.లక్ష నుంచి రూ.2 లక్షలలోపు అపరాధ రుసుం వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రెండోసారి కూడా నేరానికి పాల్పడితే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, మూడోసారి అదే నేరం పునరావృతమైతే ఏకంగా లైసెన్స్‌ను రద్దు చేయాలని నిర్ణయించింది. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో పన్ను చెల్లించని మద్యం (ఎన్‌డీపీ), కల్తీ మద్యం, నకిలీ మద్యం విక్రయిస్తే ఎలాంటి అపరాధ రుసుం వసూలు చేయకుండానే లైసెన్స్‌ను జారీ చేసేలా చట్టంలో మార్పులు తెచ్చింది. సవరించిన ఎక్సైజ్ చట్టం తక్షణమే రాష్ట్రంలో అమలులోకి వస్తున్నట్లుగా సాంబశివరావు పేర్కొన్నారు.

కేసీలో ఇద్దరు గల్లంతు - ఒకరు సురక్షితం

విశాలాంధ్ర - శిరివెళ్ల (కర్నూలు) : మండల పరిధిలోని కోటపాడు గ్రామ పరిధిలోని కేసీ కెనాల్ 17వ లాక్ పరిధిలో ప్రమాదవశాత్తు సోమవారం ఇద్దరు యువకులు గల్లంతుకాగా ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరినట్లు ఎస్సై సుధాకర్ రెడ్డి తెలిపారు. కోటపాడు గ్రామానికి చెందిన నరసింహా, లక్ష్మీకాంత్ అనే ఇద్దరు మంగళవారం నరసింహా మాల ధరించాలని కేసీ కెనాల్ గట్టుకు తిరిగి వస్తుండగా మోటారు సైకిల్ అదుపుతప్పి కాలువలో పడినట్లు వీఆర్వో గుమ్మన్న తెలిపారు. స్థానికుల సహకారంతో లక్ష్మీకాంత్ ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నాడు. నరసింహా (22) అనే యువకుడు గల్లంతుకాగా గ్రామ ప్రజలు, పోలీసులు, ఈతగాళ్లు నరసింహా కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలో భయాందోళనతోపాటు తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

పోలవరం పనులను వైసీపీ అడ్డుకోవట్లేదు...



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పోలవరం ప్రాజెక్టు పనుల్ని వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారంటూ సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అర్హులైన వారి పింఛన్ల జాబితాను తాము సేకరించామని, అందులో చాలా మందికి పింఛన్లు అందట్లేదని పేర్కొన్నారు.

భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలకు అటానమస్ హోదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాలలకు అటానమస్ హోదాను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ అదిత్యనాథ్ దాస్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. యూజీసీ నిపుణుల బృందం ఈ కళాశాలను పరిశీలించి అటానమస్ హోదాకు సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. కేజీఆర్ఎల్ కళాశాలకు అటానామస్ హోదాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖను ఆయన ఆదేశించారు.

మూడో విడత రుణమాఫీ వెంటనే జమ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మూడో విడత రుణమాఫీ జమ మూడు రోజుల్లో రైతులకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అలాగే రైతు సాధికార సంస్థకు వచ్చిన అన్ని ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు.సోమవారం తన నివాసం నుంచి జన్మభూమి-మా ఊరు, నీరు-ప్రగతి కార్యక్రమాలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, సఖ్యతతో, సమష్టిగా కృషిచేస్తే సాధించలేనిది లేదన్నారు. ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యత గురించి చైతన్యపరచాలని, కలిసి ఉంటే జరిగే లబ్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. వ్యవసాయంపై మక్కువ పెంచేందుకే ఏరువాక వేడుకలు, జలవనరుల ప్రాధాన్యత పెంచేందుకు జలసిరికి హారతి కార్యక్రమం చేపట్టామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.సిద్దాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభించడం ఒక చరిత్ర అంటూ బ్రిటిష్ కాలంలో 1922లో వెయ్యి ఎకరాలకు మాత్రమే సాగునీరందించగా,ప్రస్తుతం దీని ద్వారా 25వేల ఎకరాలకు నీరు ఇస్తున్నామన్నారు.ఈ రబీ సీజన్‌లో పంటరుణాల పంపిణీ 50% మాత్రమే జరిగిందంటూ, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరంలో పంటరుణాల పంపిణీ మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతపురంలో కౌలురైతులకు మరిన్ని రుణాలు ఇవ్వాలని సూచించారు. పాడి పరిశ్రమ ద్వారా రాబడి ప్రస్తుతం ఉన్న రూ.60వేల కోట్లనుంచి 2022 నాటికి రూ.లక్ష కోట్లకు పెంచాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఉల్లి,నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయాలని, దళారుల బెడదను అడ్డుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ధరల పెరుగుదలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయంత్రంలోపు సమీక్షించి తనకు వివరాలు తెలపాలని కోరారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని రైతుబజార్లలో అన్ని సరుకులు చౌకధరకు లభించేలా చూడాలని కోరారు. జన్మభూమి ఫిర్యాదులను శాఖలవారీగా విశ్లేషించాలని, వాటిని బట్టే ఆయా శాఖలకు రాబోయే బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సూచించారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థిక ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు.

హంద్రీనీవా ఎక్కడ..?

సహకార రంగంలోని చక్కెర ఫ్యాక్టరీల మూత బాబు పుణ్యమే ● ప్రజాసంకల్పయాత్రలో జగన్



విశాలాంధ్ర - చిత్తూరు: హంద్రీ-నీవా కాలువలను నాలుగు సంవత్సరాలుగా చిత్తూరుకు కలపలేకపోయారని, వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు రైతుల క్షేమం పట్టదని వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. బాబు ఎప్పుడైనా విశ్రాంతి తీసుకొవాలంటే అప్పుడే ప్రత్యేక విమానంలో సింగపూర్, రష్యా, జపాన్ లాంటి దేశాలకు వెళ్లి వచ్చి, ఆ దేశాల మాదిరిగా అభివృద్ధి చేస్తానని ప్రకటిస్తారని..ఇదీ చంద్రబాబు నైజమన్నారు. సోమవారం పూతలపట్టు నియోజకవర్గంలో ప్రజాసంకల్పయాత్ర కొనసాగింది. ఎర్రచెరువుపల్లి, తలపులపల్లి, తిమ్మిరెడ్డిపల్లి, రంగంపేట క్రాస్ మీదుగా పూతలపట్టుకు చేరుకున్న జగన్ ప్రజలతో మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ దీవాల తీయించే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబు కుటిలత్వాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. టీటీడీ పాలక మండలి ఏప్రిల్‌లో ముగిసినా కాణిపాకం పాలక మండలి మూడేళ్లుగా లేకపోయినా చంద్రబాబు పాలన కొనసాగుతుందంటూ ఎద్దేవా చేశారు. జాతీయ రహదారులపై కమ్యూనిటీ సెంటర్లు ఉన్నా డాక్టర్లు ఉండరని, రోడ్లు కూడా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయన్నారు. చిత్తూరు జిల్లాలో ఆరు చెక్కర ఫ్యాక్టరీలు ఉంటే రెండు సహకార రంగంలో ఉండగా అవికూడా మూతపడ్డాయన్నారు. అనంతర ఆయన ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. విశాఖ జిల్లాకు చెందిన మాజీ ఎంఎల్ఏ కుంభారవిబాబు వైసీపాలోకి జగన్ సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి, ఎంఎల్ఏలు నారాయణస్వామి, రామచంద్రారెడ్డి, సునీల్‌కుమార్, నాయకులు పూతలపట్టు సుబ్బారెడ్డి, తలపులపల్లి బాబురెడ్డి, కుమార్‌రాజా, జంగాలపల్లి శ్రీనివాసులు, జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

సహజ సాగుపై రైతులు మొగ్గు

సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

వ్యవసాయ శాఖ కార్యాచరణ

విశాలాంధ్ర అమరావతి : సాగు ఖర్చు తగ్గించి, రసాయన అవశేషాలు లేని ఆహార ఉత్పత్తుల సాధనకోసం సహజ, సేంద్రియ వ్యవసాయానికి రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఈ ఏడాది రెండు లక్షల మంది రైతులకు లబ్ధిచేకూర్చేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించింది. 116 మండలాల్లో 6లక్షల 50వేల హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం, 1 లక్షా 30 వేల హెక్టార్లలో సహజ వ్యవసాయం చేపట్టేలా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. ఇందుకుగాను 2016 -17 సంవత్సరంలో ఎన్ఎస్పీ కింద రూ. 39.38 కోట్లు, ఆర్.కె.వి.వై. కింద రూ.29.81 కోట్లు కేటాయించింది. రైతులు అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల భూసారం క్షీణించడమే కాకుండా ప్రజారోగ్యంపై దుష్ప్రభావం పడుతోంది. పంటల ఉత్పాదకత కూడా పడిపోతోంది. రసాయిన అవశేషాల ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఎగుమతికి నోచుకోవడం లేదు. స్వర్ణాంధ్ర విజన్ 2029లో భాగంగా రైతు సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయరంగ మిషన్‌ను ప్రారంభించింది. సమగ్ర వ్యవసాయ పద్ధతులతో అన్ని రకాల నేలల్లో, ప్రత్యేకించి వర్షాధార ప్రాంతాల్లో సాలీనా రైతుల ఆదాయాలను మెరుగుపర్చడం ఈ మిషన్ ఉద్దేశం. రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రతి వెయ్యి హెక్టార్లకు ఒకరు వంతున 4,354 మంది బహుళ ప్రయోజన విస్తరణాధికారులను ప్రభుత్వం నియమించింది. 2015-16లో 116 మండలాల్లోని 131 క్లస్టర్లలో సేంద్రియ వ్యవసాయం, 566 క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోని 10 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చే పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం అమలయ్యే గ్రామాల్లో ప్రాథమిక సర్వే ద్వారా ఏ, బీ, సీ కేటగిరీలుగా రైతులను గుర్తించి, క్లస్టర్లలో పథక పర్యవేక్షణకు ఏడీఏ స్థాయి అధికారిని జిల్లా ప్రాజెక్టు అధికారిగా నియమించింది. ప్రతి క్లస్టర్ కూ ఒక ఎం.పి.ఇ.వో/ ఎ.ఇ.వోను కేటాయించి, ఇద్దరు రైతు నిపుణుల ద్వారా సహజ వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ క్షేత్రాల్లో రైతులకు ప్రదర్శనలు నిర్వహించి, శిక్షణ ఇప్పిస్తోంది. పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయంపై గతేడాది జనవరి 24 నుంచి 31 వరకు ప్రకృతి వ్యవసాయ పితామహుడు, పద్మశ్రీ సుభాష్ పాలేకర్ చేత కాకినాడలో శిక్షణ ఇప్పించారు. 13 జిల్లాల నుంచి 5,730 మంది రైతులు, వ్యవసాయాధికారులు, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు హాజరై సహజ వ్యవసాయంపై శిక్షణ పొందారు. ఈ ఆధునిక శిక్షణలో శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్రపరిచి రైతులకు నేల తయారీ, భూ ఉపరితల/ భూగర్భజలాల నిర్వహణ, పశుసంబంధిత ఘన/ ద్రవపదార్థాల తయారీ, వాడకం, కషాయాల తయారీ, వాడకం ద్వారా పురుగులు/ తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

ప్రకృతిలో లభ్యమయ్యే వనరులతో పర్యావరణాన్ని పరిరక్షించుకొని, తక్కువ పెట్టుబడి, ఆరోగ్యవంతమైన పంటలతో అధిక దిగుబడి సాధించడమే సహజ వ్యవసాయం. నేలను ఆరోగ్యవంతం చేయడానికి సేంద్రియ పదార్థాన్ని బాగా పెంచాలి. ప్రస్తుతం భూముల్లో సేంద్రియ కర్బనశాతం 0.25శాతం కంటే చాలా తక్కువగా ఉంది. దీనిని 1.0 అంతకంటే ఎక్కువ శాతానికి పెంచాలి. సేంద్రియ పదార్థం పెంచడం వల్ల కోటాను కోట్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. దీంతో నీటిని పీల్చుకునే శక్తి పెరుగుతుంది. పోషకాలు అధిక మొత్తంలో మొక్కలకు లభ్యమవుతాయి. పంటలకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

చంద్రబాబుతో పాలేకర్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అతి తక్కువ పెట్టుబడి, అత్యధిక దిగుబడితోపాటు ఆరోగ్యదాయకమైన ప్రకృతి వ్యవసాయసాగుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ప్రక ృతి వ్యవసాయ సలహాదారు పాలేకర్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇటీవల పాలేకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాల విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి ఆయనను అభినందించారు. పెట్టుబడి లేని ప్రక ృతి వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహించదలిచిందని సీఎం స్పష్టం చేశారు. అందుకోసం 13 వేల గ్రామాల్లో ఫైబర్ నెట్ సాయంతో నెలకోసారి శిక్షణా తరగతులు నిర్వహించాలని పాలేకర్‌ను కోరారు. వచ్చే జూన్ లోగా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులు రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఇక్కడి రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ తరహా వ్యవసాయంలో యాంత్రీకరణ విస్తృతంగా ఉపయోగించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

ముగ్గురు అదనపు డీసీపీల బదిలీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : విజయవాడ, విశాఖపట్నంలో ముగ్గురు అదనపు డీసీపీలను ప్రభుత్వం బదిలీ చేసింది. గతంలో విజయవాడ, విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లకు అదనపు డీసీపీలుగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి తాజాగా వారికి ప్రభుత్వం మళ్లీ పోస్టింగ్స్ ఇచ్చింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విజయవాడ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్)గా నియమితులైన ఎం రమేష్‌కుమార్ ఇంతవరకు చేరలేదు. దీంతో ఆ పోస్టింగ్‌ను రద్దు చేసిన ప్రభుత్వం తాజాగా ఆయన్ను విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లో అదనపు డీసీపీ (ట్రాఫిక్)గా బదిలీ చేసింది. విశాఖపట్నం అదనపు డీసీపీ (ట్రాఫిక్)గా బదిలీ అయి చేరకుండా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న టీ రామ ప్రసాదరావును తాజాగా విజయవాడ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (ట్రాఫిక్)గా బదిలీ చేశారు. ప్రస్తుతం విజయవాడ ట్రాఫిక్ అదనపు డీసీపీగా ఉన్న టీవీ నాగరాజును పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలావుండగా, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఏపీఎస్పీ కమాండెంట్ ఎం నాగూర్‌రెడ్డిని విజయనగరంలోని ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బాలఆరోగ్యరక్ష కో-ఆర్డినేటర్‌కు డిప్యుటేషన్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కర్నూలులో బాల ఆరోగ్యరక్ష కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.హేమలత డిప్యుటేషన్ కాలాన్ని మరో ఏడాది పొడిగించారు.ఈ మేరకు హెల్త్ అండ్ మెడికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీఎంఅండ్‌హెచ్ఎస్‌లో డీడీ(అడ్మినిస్ట్రేషన్) విభాగంలో ఉన్న హేమలతను డిప్యూటేషన్‌పై కర్నూలులోని జవహర్ బాల ఆరోగ్యరక్ష కో-ఆర్డినేటర్‌గా నియమించారు.ఈమె విధులను ఈ నెల 4వ తేదీ నుంచి 3 జనవరి 2019వ తేదీ వరకూ ఏడాది కాలంపాటు పొడిగించింది.

గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఆర్నెల్లపాటు పొడిగించాలి

అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా 12,920 గ్రామ పంచాయితీల పాలకవర్గాలను ఆర్నెల్లపాటు పొడిగించాలని కోరుతూ అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు కోరారు.ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌కు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించాక..కొంతవరకూ పనితీరు మెరుగు పడిందని వివరించారు. రాజకీయాలకు సంబంధం లేకుండా సర్పంచుల అధికారులను గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం బదిలీ చేయాలని కోరారు. గ్రామాల్లో నిధుల వినియోగంపై మార్గదర్శకాలను ఏ పనికి ఎంత ఖర్చు చేయాలనేదీ స్పష్టం చేయాలని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.సర్పంచులకు ప్రోటోకాల్ కల్పించేందుకు పటిష్టంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

11న 'మా పంటలు - మా వంటలు' పోటీలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : జన్మ భూమి- మా ఊరు గ్రామసభల్లో భాగంగా ఈ నెల 11న అన్ని గ్రామాల్లో మా పంటలు - మా వంటలు పేరుతో ప్రత్యేక పోటీలను నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. సీఎం చంద్రబాబు ఆలోచనల మేరకు మండల, రాష్ట్రస్థాయిలో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. తెలుగు సంప్రదాయ వంటలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో విజేతలైన వారికి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. సంబంధిత మండలాల ఎంపీడీవోల ఆధ్వర్యంలో జరిగే పోటీలకు అవస రమైన మెటీరియల్‌ను పర్యాటకశాఖ సరఫరా చేస్తుందని, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తీపి వంటకాల విభాగాలలో నిర్వహించే పోటీలకు ఔత్సాహికులు పోటీపడవచ్చని ఆయన సూచించారు. పోటీలలో పాల్గొనే వారు వంట సామాగ్రిని తెచ్చుకోవాలని ఆయన తెలిపారు. ఈ పోటీల ద్వారా ఆరోగ్యకరమైన వంటల తయారీపై మహిళలలో అవగాహన పెంపొందించవచ్చన్నారు. మండల స్థాయి పోటీలలో విజేతలకు పర్యాటకశాఖ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి ఉత్తమ ఇంటి చెఫ్ పోటీలకు ఆహ్వానం అందిస్తామన్నారు. వీరికి ఉగాది లోపు పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు సీఎం చంద్రబాబు బహుమతులను అందజేస్తారని ఆయన వివరించారు.

గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్లకు గెజిటెడ్ హోదా

తక్షణం అమల్లోకి తెస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి :రాష్ట్రంలోని గ్రేడ్ -3 మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం గెజిటెడ్ హోదా కల్పించింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్ కరికాల వలవెన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా లేదా ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై మున్సిపల్ కమిషనర్లుగా పని చేస్తున్న వీరు పట్టణాలలో పన్నుల వసూలు, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, ఇంజనీరింగ్, పరిపాలనతో పాటు మున్సిపాల్టీ పరిధిలోని పాఠశాలలపై అజమా యిషీ చేస్తున్నారు. అయితే మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా ఉండగా, వారిపై అజమాయిషీ చేసే కమిషనర్లకు ఆ హోదా లేకపోవటాన్ని ఏపీ మున్సిపల్ కమిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. దీనిపై ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్ రంగాచారి చైర్మన్‌గా అనోమలీస్ కమిటీని 2008లో నియమించింది. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టు ప్రకారం, తొమ్మిదో పీఆర్సీ కమిషన్ సిఫార్సు మేరక ప్రభుత్వం గ్రేడ్ -3 మున్సిపల్ కమిషనర్స్‌కు గెజిటెడ్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జన్మభూమికి విద్యార్థుల తరలింపు సిగ్గుచేటు

- ప్రభుత్వ ఉత్తర్వులు దారుణం
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, రంగన్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా జన్మభూమి సభలకు విద్యార్థులను బల వంతంగా తరలించడం సిగ్గుచేటని అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, జి.రంగన్నలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజా సమస్యల్ని పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి సభలు పేలవంగా కొనసాగుతున్నాయని ఎద్దేవా చేశారు. పరీక్షల సమయంలో సభలకు విద్యార్థుల్ని బలవంతంగా తరలించడం దారుణమన్నారు. ఇప్ప టికే విద్యార్థులకు ప్రీ-ఫైనల్ పరీక్షల టైమ్ టేబులు షెడ్యూలును విడుదల చేశారని తెలిపారు.ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు సరిపడా లెక్చరర్లు లేనందున సిలబస్ పూర్తికాలేదని చెప్పారు.టీడీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీ కరణతో విద్యార్థులపై వేధింపులు అధికమవు తున్నాయన్నారు. దీంతో వారంతా విద్యకు దూరమవుతున్నారని వివరించారు. ప్రభుత్వ కళా శాలలో భారీగా ఉన్న లెక్చరర్ల పోస్టులను భర్తీచేసి మౌలిక సదుపాయాలను కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు 75 శాతం హాజరు నిబంధ నల్ని నిలుపుదల చేయాలని, జన్మభూమి కార్యక్రమాలకు విద్యార్థుల తరలింపు ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే నిలుపుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేతలు డిమాండు చేశారు.

సంపాదకీయం

చావు కబురు చల్లగా చెప్పినట్టు, ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న కేంద్రబడ్జెట్ ప్రజాకరంజకంగా వుండబోదని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ ముందుగానే సోమవారం తెలిపారు. బడ్జెట్‌లో కోతలు, వాతలు వుంటాయని కూడా ఆయన సెలవిచ్చారు. కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తూ మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్ కూడా ఇదే అవుతుంది. 2019లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి ప్రజలను మభ్యపెట్టేవిధంగా 'బడ్జెట్‌గారడీ' చేస్తారనడంలో మాత్రం ఎట్టి సందేహం వుండనవసరం లేదు. ప్రజలను ఏమార్చడంలో మోడీ అందెవేసిన చెయ్యి అని ఇప్పటికే తేలిపోయింది. గత లోక్ సభ ఎన్నికల్లో ఆయన చేసిన వాగ్దానాలలో ఏ ఒక్కటి నెరవేర్చకపోవడంతో ఆయన నైజాన్ని ప్రజలు గ్రహించడం ఇప్పటికే ప్రారంభం అయింది. ప్రజలు ఇక ఏ మాత్రం ఆయన వాగాడంబరానికి లోనుకారన్నది వాస్తవం. మోడీ ప్రభుత్వ ఐదవ, ఆఖరి బడ్జెట్ రూపకల్పనలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ముందు అనేక సవాళ్లు వుంటాయన్నది నిస్సందేహం. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కావడంతో జైట్లీ రాజకీయంగా లబ్ధి పొందడానికి ఖాయంగా కసరత్తు చేస్తారు. పెద్దనోట్ల రద్దు, ఆదరాబాదరాగా అమలు చేసిన వస్తు సేవల పన్నుతో దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. స్వదేశీ పెట్టుబడులు రాబట్టడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బడ్జెట్‌లో జైట్లీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా, చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు ఇటీవల ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీ బీజేపీ విజయం సాధించడం నుండి గుణపాఠాలను విస్మరించ గలరా అన్న ప్రశ్న ఉదయిస్తోంది. అన్నింటికీ మించి గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల దురవస్థ మరింత ఆందోళన కలుగజేసేదిగా వుంది. పెద్దనోట్ల రద్దుతో మూతపడిన చిన్న పరిశ్రమల పునరుద్ధరణ స్తంభించిపోయింది. అభివృద్ధిని, జనాకర్షక విధానాలను మేళవించి, బాధ్యతాయుతమైన ద్రవ్య నిర్వహణ సమానతను విత్తమంత్రి ఏ విధంగా కల్పించడానికి కసరత్తు చేస్తారో వేచి చూడాలి. గ్రామీణ దుస్థితికి ఏ రూపాలలోనైన తీసుకునే చర్యలు మౌలిక సౌకర్యాలపై (రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు వగైరా) ప్రభుత్వ పెట్టుబడులు పెంపు, గ్రామీణ నిరుద్యోగ కార్యక్రమం, ఇతర సామాజిక సేవలు ఉపాధికల్పనకు రహదారిగా భావించవచ్చు. పట్టణ, గ్రామీణ ఉపాధులకల్పనకు కూడా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవలసి వుంటుంది. అధిక ప్రభుత్వ పెట్టుబడులు 'అభివృద్ధి మైత్రిపూర్వక' విధానపరమైనవిగా, ఉపాధికల్పనకు ఉపకరించేవిగా వుండవలసిన అవసరం వుంది. జైట్లీ ఇప్పటివరకు 'ద్రవ్యపరిశుద్ధుడు' పాత్ర నిర్వహించేందుకు ప్రయత్నించాడు. బహుశా జైట్లీ తన రాగాన్ని తిరిగి రూపొందించుకోవలసి వుంటుంది.

రానున్నది 'కోత'ల బడ్జెట్

మోడీ ప్రభుత్వంలోని వాస్తవాన్ని దాచిపెట్టిన మోడీ సర్కారులోని వారు మినహా అందరూ వూహించినట్లుగానే 2016 నవంబరులో తీసుకున్న పెద్దనోట్ల రద్దు చర్య ఆర్థికంగా, సామాజికంగా విచ్ఛిన్నకరమైనదని రుజువైంది. ఆ చర్యతో 2017 ఆర్థికాభివృద్ధి నెమ్మదించింది. అంతేగాక 2017-18లో అది 6.5 శాతానికి తగ్గింది. ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ ఉత్పత్తి రంగాలు, రియల్ ఎస్టేట్, ఉత్పాదక రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ ఏడాది కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) ముందస్తు అంచనాలు తెలిపాయి. మరింత వాస్తవ జీవీయే (గ్రాస్ వాల్యూ యాడెడ్), ఉత్పత్తులపై ఇతర పన్నులు తీసుకోవడంతో 2016-17లో నెమ్మదించిన 6.6 శాతం నుండి ప్రస్తుత ఏడాదిలో 6.1 శాతానికి అభివృద్ధి పడిపోయింది. అయితే అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), ఇతర ప్రపంచ సంస్థలు 2017-18లో అభివృద్ధి రేటు 6.2 నుండి 6.66 శాతంగా అంచనాలు వేశాయి. మొత్తంగా సంస్కరణల దిద్దుబాటు మెరుగైన ఆర్థిక నిర్వహణ ఊహాగానాలపై 2018-19 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి రేటు 7 నుండి 7.5 శాతంగా మెరుగుపడుతుందని కూడా ఈ సంస్థలు పేర్కొన్నాయి. సీఎస్‌వో సమాచారం ఏ విధంగా ఉన్నప్పటికీ జైట్లీ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) అభివృద్ధి 11 నుండి 12 శాతం ఉండవచ్చునని ఇప్పటికీ భావిస్తున్నారు. వాస్తవంగా అదే జరిగితే తప్పకుండా అది జీడీపీలో పెరుగుదలే అవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలలోని తన వాటాలను ఉపసంహరించుకోవటం ద్వారా ఆ రంగాన్ని నీరుగార్చి వాటిని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయాలనే ఆలోచనతో వుంది. ప్రతి రంగాన్ని ప్రైవేటీకరించి వాటిని ధ్వంసం చేయుటమే మోడీ తన ధ్యేయంగా పెట్టుకున్నట్లు కనబడుతోంది.

మోడీ ప్రభుత్వం గత రెండేళ్లుగా అనుసరించిన అర్థరహిత ఆర్థిక విధానాల కారణంగా అధ్వానమైన స్థూల ఆర్థిక పరిస్థితి 2018-19లో స్థిరత్వం దిశగా సాగుతుందన్న నమ్మకం కలగడంలేదు. 2018లో భారతదేశ అభివృద్ధికి సంబంధించి ప్రపంచ దృక్పథం అంత ప్రోత్సాహకరంగా లేదనే చెప్పాలి. ఎందుకంటే వస్తువులు, ప్రత్యేకించి చమురు ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. చమురు ధరలు సుమారుగా బ్యారెల్‌కు 65 డాలర్లు పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ ఏడాదిలో ఆర్బీఐ నుండి ద్రవ్య వెసులుబాటు ఊహించలేము. భారతదేశ చమురు దిగుమతి బిల్లు విపరీతంగా పెరుగుతుంది. గడచిన మూడేళ్లలో మరింత మెరుగ్గా బడ్జెట్లను రూపొందించటంలో జైట్లీకి దోహదపడిన తక్కువగా ఉన్న చమురు ధరలు ఇప్పుడు భారీగా పెరిగాయి. ఆర్థికపరంగా ఎన్ని పరిమితులున్నప్పటికీ గ్రామీణ పేదల విద్య, ఆరోగ్య సంరక్షణ ఇతర మౌలిక అవసరాలపై రానున్న బడ్జెట్‌లో మోడీ సర్కారు దృష్టి సారించవలసిన అవసరం ఎంతైనా వుంది.

చురక

సర్కారుకు ఎక్సైజుతో
చేతినిండా రాబడి
జనం తాగి చస్తేనేమి
చెప్పలేని మత్తు ఒడి

ప్రమాదాలు, మరణాలను
పెంచుతున్న మద్యం
ప్రభుత్వాలు చూస్తే ఎలా
ప్రతిరోజు చోద్యం

- వేల్పుల నారాయణ

ట్రంప్ పన్ను బాదుడు - అణగారిపోతున్న మానవ హక్కులు

అంతర్జాతీయం

మార్క్ గ్రుయెన్‌బర్గ్

ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశం అమెరికాలో సామాజిక, ఆర్థిక అసమానతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. సుమారు 47మిలియన్ల మంది పేదరికం కోరల్లో నలుగుతున్నారని తెలుస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న పన్ను విధానాలు ఇందుకు ప్రధాన కారణంగా చెప్పాలి. కార్పొరేట్లు, అపరకుబేరుల ప్రయోజనం లక్ష్యంగా ఇటీవల ట్రంప్ పాలనా యంత్రాంగం ప్రకటించిన పన్ను సంస్కరణల చట్టం పేదరికం పెరుగుదలకు కారణమవుతోంది. మానవహక్కుల ఉల్లంఘనలకూ దోహద పడేదిగా ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక ఆక్షేపించింది. సంపద పంపిణీలో తీవ్ర అసమానతలు చోటు చేసుకుం టున్నాయని ఫలితంగా ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా ఆర్థిక అంతరాలు నెలకొన్న సమాజంగా అమెరికా నిలిచే ప్రమాదముందని సదరు నివేదిక అభిప్రాయపడింది. అనేక ఐరోపా దేశాల్లో కంటే అమెరికాలోనే ఆర్థిక అంతరాలు ఎక్కువవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. పేదరికం, నిరుద్యోగితలకు తోడుగా జాతి విద్వేషాలు అంతరాలను పెంచుతున్నాయి. పేదరికమన్నా, పేదలన్నా చాల చిన్న చూపు చూసే పరిస్థితి ప్రస్తుత అమెరికా సమాజ లక్షణంగా మారింది. సమాజంలో పేదలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నారు. పేదలకు రాజకీయహోదా దక్కడమూ ఎండమావిలో నీళ్లు చందంగా ఉంది. పన్ను సంస్కరణల పేరిట అపరకుబేరులు కార్పొరేట్లు చెల్లించాల్సిన 10సంవత్సరాల పన్ను మొత్తం 1.5ట్రిలియను డాలర్లను రద్దు చేసే వెసులు బాటు చర్యలకు డిసెంబరులో ట్రంప్ పాలన యంత్రాంగం

ఐక్యరాజ్యసమితి నిర్దేశనాలూ బేఖాతర్

సంసిద్ధమైంది. పన్ను విధానంపై జాయింట్ కమిటీ అంచనా ప్రకారం 80శాతం పన్ను కోత ప్రయోజనాలు జనాభాలో అగ్రస్థానంలో ఉన్న 10శాతం మందికి చేరతాయి. అగ్రస్థానంలో నిలిచిన ఒకే ఒక్కశాతం అపరకుబేరులకు మొత్తం సంపదలో 60శాతం చేరే అవకాశాలున్నాయి. ట్రంప్ ప్రతిపాదిస్తున్న ఈ వినాశనకర పన్నుచట్టం పూర్తి స్థాయిలో అమలులోకి రావడం అంటూ జరిగితే, పేదలు చెల్లించాల్సిన పన్ను 10శాతం నుంచి 12శాతం వరకు పెరుగుతుంది. అదే అపరకుబేరులు చెల్లించే పన్ను శాతం తగ్గేదిగా ఉండటం విచిత్రం. అలబామా, ఫ్లోరిడా,కాలిఫోర్నియా, జార్జియా, ప్యూర్టొరికో, డీసీల్లోని ప్రజలు, విశ్లేషకులు, వివిధ ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వ అధికారులు కొందరు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తూండటం గమనార్హం. అమెరికా జనాభాలోని ప్రతి ఏడుగురిలో ఒకరు పేదరికం కోరల్లో చిక్కుకునే దుస్థితి ఉన్నట్లు అంచనాగా ఉంది. ఈలెక్కన సుమారు 47మిలియన్ల మంది పేదరికంలోకి చేరుతారు. అవాంఛనీయంగా ఎదురయే ఈ పేదరికం కారణంగా పౌరులు వారు సహజసిద్ధంగా అనుభవించాల్సిన మానవహక్కులను అనుభవించలేక పోతున్నారు.

కార్పొరేట్ల పన్ను కోత కారణంగా ఏర్పడిన 1.5ట్రిలియను డాలర్ల లోటును పూడ్చుకునేందుకు ప్రజారోగ్యం, సామాజిక భద్రత తదితర గృహానుబంధ పథకాల మీద పన్ను భారం మోపడానికి ట్రంప్ పాలనా యంత్రాంగం సిద్ధపడుతోంది. దీని నుంచి ఎదురయే కష్టనష్టాలను ఎలా తట్టుకోవాలో దిక్కుతోచక పేదలు అలమటిస్తున్నారు. ఆయా సామాజిక వర్గాలకు వర్తించే సంక్షేమ పథకాలకూ కోత పెట్టేందుకు ట్రంప్ పాలన యంత్రాంగం సిద్ధపడుతోంది. అధికారంలోకి వచ్చిన తరువాత ట్రంప్ అనుసరించిన వినాశకర విధానాల కారణంగా ఒక్క లాస్‌ఏంజిల్స్‌లోనే సుమరు 55వేల మంది నిరాశ్రయులయారు. పేదరికం విలయతాండవం చేసే లోన్డైన్ కౌంటీ, అలా తదితర ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర నులిపురుగు వ్యాధి సోకిన కారణంగా వేలాది మంది అస్వస్థతకు గురయారు. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. డ్రైనేజీని చక్కదిద్దాలనే యోచనేదీ ట్రంప్ పాలన యంత్రాంగానికి ఉన్నట్లు కనిపించడం లేదు.

పరిశుభ్రమైన వాతావరణ కల్పన తమ బాధ్యత కాదన్నట్లు అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.. పేదింటి మహిళల అవస్థలు మరింత వర్ణనాతీతంగా ఉన్నాయి. సాధారణ జ్వరం, దంత సమస్యలకూ చికిత్సకూ సొమ్ము వెచ్చించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రాణాంతక జికా వైరస్ సోకిన కారణంగా వేలాది మంది మృత్యుభీతితో అల్లాడారు. అధికార యంత్రాంగం పట్టించుకోనే లేదు సుమారు 12మిలియన్ల మందిపేదలు అంటురోగాల బారిన పడి అష్టకష్టాలు పడుతున్నట్లు సమాచారం.

పేదల దుస్థితిని డ్రగ్ మాఫియా కుళ్లబొడుస్తోంది. పేదరిక రుగ్మతల కారణంగా వరుసగా రెండవ సంవత్సరమూ జీవన కాలం పడిపోయినట్లు అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. న్యాయం కోసం అలమటించడమే తప్ప అధికార, పోలీసు యంత్రాంగాలు పేదల వేదనను ఆలకించే పరిస్థితి కానరావడం లేదు. చిన్న పాటి అపరాధాలకే మునిసిపల్ అధికారులు జారీ చేసే నోటీసులు పేదలను మరింతగా రుణగ్రస్తం చేసేవిగా ఉంటున్నాయి. పోలీసు అరాచకాలకు హద్దే లేకుండా పోయిందని పేదలు గగ్గోలు పెడుతున్నారు.

ఒక్క రోజులో పేదరికాన్ని తొలగించేందుకు పాలకుల దగ్గర మంత్రదండమేమీ లేదనే వితండ వాదనలే పాలక పక్షాల నుంచి వినవస్తున్నాయి.

ఓటరు గుర్తింపు కార్డు ద్వారా పేదల్లోని శ్వేతజాతీయులకు ఒక న్యాయం ఇతరులకు మరో న్యాయం అమలు చేయడంలో అధికారులు జాతి వివక్ష పాటిస్తున్నారు. తద్వారా ఐక్యరాజ్యసమితి ఒప్పందాలకు అమెరికా పాలకులు అన్ని స్థాయిల్లో తూట్లు పొడుస్తున్నారు. ప్రజాస్వామ్య పంథాలో నిర్ణయాధికారం, ఉద్యోగ కల్పన సామాజిక భద్రత పథకాల అమలు, సకాలంలో పేదలకు న్యాయం వంటి ఐక్యరాజ్యసమితి నిర్దేశనాలను అమెరికా పూర్తిగా ఉల్లంఘిస్తోంది. ప్రపంచంలో ఎక్కడెక్కడో మానవహక్కుల ఉల్లంఘనలు జరిగాయంటూ గగ్గోలు పెట్టే అమెరికా తన పౌరుల ప్రాథమికహక్కుల పరిరక్షణలో ఘోరంగా విఫలమైన దుస్థితి విషాదకరం.

- వ్యాస రచయిత పీపుల్స్ వరల్డ్ వాషింగ్టన్ డీసీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

అబద్ధాల సభలు...!

బి.బాబు బహదూర్



ఏడూళ్ల సూరిగాడు

"ఆగడాల లంక...ఆగడాల లంక...ఆగడాల లంక" అని కండక్టర్ అరుపులతో ఏడూళ్ల సూరిగాడికి మెలుకువ వచ్చింది. దిక్కున లేచాడు. చరచరా గేటు దగ్గరకి దూసుకుపోయాడు. "జాగ్రత్త జాగ్రత్త నెమ్మది నెమ్మది" కండక్టర్ అంటుంటే సూరిగాడు బస్సు దిగాడు. వళ్లు విరుచుకున్నాడు. నెమ్మదిగా మాలపల్లె బాట పట్టాడు. చేపల చెరువులు చూసి..."ఇక్కడ పరద పిట్టలు బలే ఉండేవి, శీతాకాలం బాగా దొరుకుతాయి. దోరగ కాల్చి కూరు వండుకుంటే సామిరంగా" మనసులో సూరిగాడు అనుకున్నాడు. ఓ పర్లాంగు నడిచాడో లేదో... ఓ ప్యాంట్ వాలా..ఇంకో పంచెవాలా ప్రాణాలు అరచేత పట్టుకున్నట్టు పరుగు తీస్తున్నారు. వీళ్ల వెనక ఓ కుంటోడు పళ్లు బిగించి చేత్తో ఫెడల్‌ను గిరిగిరా తిప్పుతుంటే మూడు చక్రాల బండి దూసుకుపోతోంది. ఆ వెనక ఆడ,మగ, పిల్లా జెల్లా పరిగెడుతున్నారు. ఏడూళ్ల సూరిగాడు వాళ్లిద్దరినీ అడ్డుకున్నాడు. ప్యాంట్ వాలాను పట్టుకున్నాడు. పంచివాలా మాత్రం ఆగలేదు.

"నువ్వెక్కడి నుంచి ఊడిపడ్డావయ్యా బాబు , వదులు" ఒగర్చుతూ ప్యాంట్‌వాలా గుంజు కున్నాడు.

"మీరెవరు, వాళ్లెందుకు తరుముతున్నారు" సూరిగాడు గద్దించాడు.

"ఓర్నీ పొచిగూల. నేను తాహసీల్దారుని. పారిపోయినాయన ప్రెసిడెంటు. ఆ కుంటోడు చెప్పుల దండ వేస్తానంటూ వెనకపడుతున్నాడు" ప్యాంట్ వాలా కంగారుగా చెప్పాడు. అప్పటి జనం వచ్చేశారు. ఇద్దరినీ చుట్టుముట్టారు. కుంటోడు పళ్లు పటపట కొరికాడు. సూరిగాడు, తాహసీల్దారు చుట్టూ మూడు చక్రాల బండి నడుపుతున్నాడు.

"అరే చిన్నా నీపేరేంటీ? అగు.. ఈయన ఎక్కడిపోడులే. అసలేం జరిగింది"? సూరిగాడు అడిగాడు.

"సీతయ్య" పేరు చెప్పి మూడు చక్రాల బండికి బ్రేక్ వేశాడు. హ్యాండిల్‌కి చెప్పుల దండ వేలాడుతోంది.

"అదే ఏం జరిగింది, ఆయన పెద్దాఫీసరు కదా... చెప్పుల దండ వేయొచ్చా"? సూరిగాడు అడిగాడు.

"ఒక్క దండేనా... గాడిద మీద ఊరేగించాలి కొడుకుని" సీతయ్య మళ్లీ పళ్లునూరాడు.

"అంత పెద్ద తప్పేం చేశాడు"? సూరిగాడి ప్రశ్న.

"నా వికలాంగుల పెన్షన్ రద్దు చేశాడు. నేను వికలాంగుడిని కాదంట. వీడి కళ్లు దొబ్బాయా"? సీతయ్య ఊగిపోయాడు.

"అదేంటండీ.. వీడు కుంటోడేగా మరి పెన్షన్ ఎందుకు రద్దు చేశారు"? తాహసీల్దారును అడిగాడు.

"నిజం చెబుతున్నా నేను రద్దు చేయలేదు. జన్మభూమి కమిటీ సభ్యులే రద్దు చేయించారు. పది ఎకరాల భూమి ఉందని చెప్పారు". తాహసీల్దారు దండం పెట్టాడు.

"ఏం సీతయ్య నీకు పొలం ఉందంటగా" సూరిగాడు అడిగాడు.

"ఏ నా కొడుకు చెప్పింది. కనీసం ఇంటి స్థలం కూడా లేదు. వాళ్లెవరో చెబితే ఈడు ఎలా నమ్మాడు. నాకు పొలం ఉంటే శిస్తు కట్టించుకోరా? రికార్డులో ఉండదా? పదెకరాల పొలం ఉందన్నారుగా... ఏదీ ఎక్కడుందో చూపెట్టమనండి. హాయిగా పొలం చేసుకుంటా.. ఇట్టా అడుక్కోను". సీతయ్య మెలికేశాడు. ఇక తాహసీల్దారు బిక్కచచ్చిపోయాడు.

మరి ప్రెసిడెంట్ ఎందుకు పారిపోయాడు? సూరిగాడు అడిగాడు.

"నెల రోజుల్నించి వీధి లైట్లు వెలగట్లేదు. వారం నుంచి పంపుల్లో నీళ్లు రావటం లేదు. వెళ్లి అడిగితే కనీసం పట్టించుకోలేదు. పైగా మీరు ఊరకే ఓట్లేశారా? ఒక్కొడు ఐదొందలు తీసుకుని ఓటేశారు. దిక్కున్నోళ్లకి చెప్పుకోండి అని కసిరాడు. ఈయాల జన్మభూమి సభకి పళ్లిగిలిం చుకుంటూ వచ్చాడు. మేం సభకు రానన్నాం. పనికి పోవాలి. లేకపోతే పస్తే అన్నాం. మినిస్టర్ వస్తున్నారు. రేషన్ కార్డులు ఇస్తారు. కొత్త పెన్షన్లు మంజూరు చేస్తారు. ఆడోళ్లకి లోన్లు ఇస్తారు. సభకు రాకపోతే ఇవన్నీ మురిగి పోతాయని చెప్పాడు. సరేమని సభకు వెళ్లాం. మినిస్టర్ రాలేదు. ఈయనేమో శపథం చేయించాడు. ప్రెసిడెంటేమో సీఎంను తెగ పొగిడేస్తున్నాడు. అభివృద్ధి శరవేగం దూసుకుపోతోందని లెక్చర్ దంచాడు. లోన్లు ఊసు లేదు. రేషన్ కార్డు పేరు లేదు. గంటపాటు ఆయన ప్రసంగం సరిపోయింది. వచ్చే జన్మభూమిలో సమస్యలన్నీ పరిష్కరిస్తాం అంటూ తాహసీల్దారు గారు మూటా ముల్లె సర్దుతుంటే ఇక ఆగలేక పోయాం. ఈ దొంగ చచ్చినోళ్లకి చెప్పుల దండ వేసి సన్మానిద్దామనుకున్నాం. ఓ ఇల్లాలు మెటికలు విరిచింది.

"ఈ జన్మభూమి సభలంటేనే అసహ్యం పుడుతోంది. ఒక్క సమస్యా తీరదు. సీఎం వస్తాడు. అదిగో అమరావతి. ఇదిగో పోలవరం అంటాడు. మరో ముప్పై ఏళ్లకి రాష్ట్రం నెంబర్ వన్ అవుతుందంటాడు. కరువుతో ఆకలితో అలమటిస్తున్నాం అంటే... బిర్యానీ పొయ్యి మీద ఉంది. వచ్చే ఎన్నికల్లోనూ గెలిపిస్తే వడ్డిస్తా అంటాడు. ఇక ఆయన కొడుకు మరీ చోద్యగాడు. తాగటానికి మంచినీళ్లు లేవు. ఊళ్లో దీపాలు వెలగటం లేదు. దోమలు పీక్కుతుంటున్నా యంటే... వాటిని పట్టించుకోడు. ఐటీ దూసుకు పోతోంది. వచ్చే నాలుగేళ్లల్లో లచ్చల ఉద్యోగాలు వస్తాయంటాడు. ఐటీ కంపెనీలకి, పల్లెటూళ్లకి లింకేంటో అర్థం కాదు. ఎదురు ప్రశ్నిస్తే అభివృద్ధి నిరోధకులంటారు", ఓ కుర్రోడు అందుకున్నాడు.

"నిజమే వీళ్లకి ఇలాగే బుద్ధి చెప్పాలి. సీఎం, సీఎం కొడుకు... ఇలా అందరూ అందరే. జనాన్ని మభ్య పెడుతున్నారు. కానీ ఈ ఆఫీసరేం చేస్తాడు. ఎమ్మెల్యే ఏం చెబితే అది చేయాలి. లేకపోతే శంకరగిరి మాన్యాలకి పోవాల్సిందే. మనలోనూ ఇంకా మార్పు రావాలి. ఓటును నోటుకు అమ్ముకోకూడదు. నిజాయితీ పరుల్నే ఎన్నుకోవాలి. కానీ ఎలక్షన్ రాగానే ఎవరు డబ్బులిస్తే వాళ్లని గెలిపిస్తున్నాం. అందుకే ఈ దౌర్భాగ్యం, ఈ సారికి తాహసీల్దారును వదిలే యండి. ఇలా అవమానిస్తే కేసులు పెడతారు. మీరంతా కోర్టుల చుట్టూ తిరగాలి" సూరిగాడు అన్నాడు.

"కోర్టులు మాకేం కొత్త కాదు. జైలుకు పోతాం. ఈ దగుల్బాజీ ఆఫీసర్‌ని వదలం" సీతయ్య అరిచాడు.

బాబ్బాబు తప్పు జరిగింది. ఈ తప్పు సరిచేసుకుంటా. అసలే బీపీ, షుగరు ముండావాడ్ని నన్ను వదిలేయండి. తాహసీల్దారు ప్రాధేయపడ్డాడు. ఇంతలో నలుగురు పెద్దోళ్లు ముందుకు వచ్చి "పదండ్రా ఆయన తప్పు తెలుసుకున్నాడు" అన్నారు. "తూ.. నీ బతుకు కూల" అని జనం కదిలారు. సూరిగాడు వాళ్ల వెనుకే నడిచాడు.

కన్నీటి నుంచి కర్తవ్యం వైపు...!

డా॥ ఎ.రవీంద్రబాబు

లేఖలు రాయాలంటే భయమేస్తుంది మిత్రమా.. అప్పుడెప్పుడో పాతరాతి గుహల్లో మనం జీవిస్తున్నాం అనుకుంటారు మన చుట్టుపక్కలున్న వాళ్లు. కానీ నిజం ఏమిటంటే..! లేలేత చేతివేళ్ల చిగుర్లలోంచి స్వచ్ఛమైన మనసు ప్రవిస్తుంటే.. అక్షరాలు మాతృభాషలో అందంగా ఒదుగుతుంటే.. ఎంత ఆనందంగా ఉంటుందో కదా..! ఒకరు పంపిన ఫేస్‌బుక్ మెసేజ్‌ను మరికొందరికి, ఎవరో పంపిన వాట్సప్ మెసేజ్‌ను ఇంకొకరికి సొంతదిలా బట్వాడా చేసే ఈ రోజుల్లో స్వభాషలోని ఆస్వాదన మనోరంజకమే.. ఏమంటావు.. ఏమీ అనలేవులే...! ఎందుకంటే.. నీకు సాహిత్యంలోని పరిమళాలను ఆస్వాదించడం అంటే ఎంత ఇష్టమో నాకు తెలుసు. భావాలు సొంత భాషలో తప్ప, పరభాషలో పరుగులే కాదు తప్పటడుగులూ సరిగా వేయలేవని తెలుసు.

నిజానికి మనకు లేఖా సాహిత్యం చాలా తక్కువ. ఉత్తరాలు అనగానే చలం తలుపులు మనలో పులకలు రేపుతాయి. చదువుకునే రోజుల్లో చలం లేఖల్లోని సున్నిత భావాల వెనుక ఆయన జీవితంలో పడ్డ తపన గురించి, ఆయన మనసుపడ్డ మూగవేదన గురించి మనందరం ఎంతగా చర్చించుకునే వాళ్లం! ప్రతి లేఖలో ఆయన నిద్రలేని రాత్రుల మీదుగా నడిచిన అక్షరాల్లోని శైలి గురించి ఎంతగా వాదించుకొనే వాళ్లం. అంత సూటిగా, ఘాటుగా, రశాస్వాదనతో, ముగ్ధమనోహరంగా ఎలా రాయగలగాడా అని మాట్లాడుకునే వాళ్లం. పాపం.. శైలికి ముగ్ధులై ఆయన పుస్తకాలు చదివి, విషయాన్ని పట్టించుకోని వాళ్ల గురించి ఆలోచించి ఆయనే బాధపడే వారట. నీకు గుర్తుందా...! చివరకు చలం శైలి మీద మన యూనివర్సిటీలో వచ్చిన థీసెస్ చదివి ఎంత ఆశ్చర్యపోయాం. ఎదలోతుల్లోని భావాలు ఎలాంటి అడ్డంకుల్లేకుండా అక్షరాలుగా వర్షిస్తే.. వచ్చే తీవ్రత అంత ముగ్ధమనోహరంగా, కఠోర వాస్తవంగా, కన్నీటి జడుల్లా ఉంటాయనుకున్నాం. ఇప్పుడు నాలుగు వాక్యాలు సరిగా చదవడానికి అనుకూలంగా రాసే వాళ్లే కరువయ్యారు. వాక్యాల్నే కాదు, మనలోని భావాల్ని అమ్మేసుకుంటున్న జీవితాలు మనవి.!? సరే.. నిజం చెప్పనా.. నీకిప్పుడు ఈ అర్థరాత్రి నీ జీవితాన్ని ఏదో ఉద్ధరిద్దామని ఈ నాలుగు ముక్కలు రాయడం లేదు. నాకు నేనుగా మిగిలిన నాలుగు క్షణాల్ని గుర్తు చేసుకోవడానికి కూడా రాస్తున్నాను. అవును మిత్రమా..! మనిషి సంఘజీవి అనే మాటకు అర్థం పోయింది. మనిషి సంఘంలో ఉన్నా ఒంటరి జీవే. దీనిపై సూక్ష్మపరిశీలన అవసరమేమో ఇప్పుడు. వారం రోజులు క్రితం తెలిసింది. నువ్వు నీ ఒక్కగానొక్క కూతుర్ని తీసుకొని నీ భర్త నుంచి దూరంగా వచ్చేశావని. కారణాల గురించి పెద్దగా నేను చర్చించదలచుకోలేదు. జీవితం అన్నాక కలయికలే కాదు. నిత్యం చావుల మధ్య నలిగేటప్పుడు విడిపోవటాలు అవసరమేనని బలంగా నమ్ముతాను నేను.

లోకం ఎప్పుడూ విశాలమైందే. మనసులే సంకుచితమైనవి. నాది, నేను, నాకే సొంతం కావాలి, నేను చెప్పినట్లే వినాలి, ప్రతిక్షణం నాకు లొంగి బతకాలి, నేను చెప్పినట్లే నడుచుకోవాలి, ఆర్థికంగా, అధికారికంగా, ఆలోచనాపరంగా నేనే గిరి, నేనే దరి అనే వారి కౌగిళ్లలో వెచ్చదనం కన్నీళ్లను కాక సంతోషాన్ని, వేదనను కాక సుఖాన్ని పంచుతుందని నేను భావించను. ఇప్పుడు నువ్వు విడిపోవడం, దూరమవడం, బంధాన్ని తెంచేసుకోవడం అనే ఆలోచనల్లో మునిగి ఉంటావని నేను ఆలోచించడం లేదు. ఎందుకంటే జీవితపు కత్తి అంచుమీద గుండెను నిబ్బరం చేసుకొనే ఈ ఐదేళ్లు బతికావని అమ్మ చెప్పింది.

బలహీనమైన మనసులతో, బలవంతమైన క్షణాలు గడపలేక జీవితానికి మధ్యలోనే ముగింపు పలుకుతున్న వాళ్లు ఈ మధ్య ఎక్కువయ్యారు. నీది పిరికి మనసు అని చెప్పను కానీ నాకు తోచిన నాలుగు వాక్యాలు రాసి పంపాలని మాత్రమే ఈ ప్రయత్నం. ఎందుకంటే..! నీకు రాసే క్రమంలో నన్ను నేను నిర్మించుకుంటాను కాబట్టి, నిన్ను నేను చైతన్య పరిచే క్రమంలో నేనూ చైతన్యాన్ని తిరిగి పొందుతాను కాబట్టి, నిన్ను నన్ను అద్దంలో ఒకేసారి చూడగలం కాబట్టి... ఇవి నీ హృదయంలోకి నేరుగా చొచ్చుకొని పోవచ్చు, పోకపోవచ్చు. కానీ ఒక్క క్షణం అయినా నిన్ను నిన్నుగా నిలబెడతాయని మాత్రం కచ్చితంగా నమ్ముతాను.

ఎప్పుడైనా, ఎక్కడైనా మనకు మనమే ఓదార్పు.. మనకు మనమే చేయూత.. మనకు మనమే మార్గదర్శి.. జీవితం ఎవ్వరినీ వదలదు. ఒక్కొక్కరి మీద కసి తీర్చేసుకుంటుంది. కష్టాల అంతుచూపి నడిసముద్రంలో వదిలేసి నీ చావు నువ్వు చావు అని వెర్రిగా ఒక వికటాట్టహాసం చేస్తుంది. కన్నీళ్లు, నిద్రపట్టని రాత్రులు, ఒక్క చేయూత కోసం ఎదురుచూసే మనసు మాత్రమే మిగిలిపోతాయి ఎదనిండా, ఒడి నిండా.! లోకం మొత్తం చీకటై, మన గుండెలపై కూర్చొని కరాళ నృత్యం చేస్తుంది. మన అనుకున్న వాళ్లు, మనం సర్వస్వం అనుకున్న వాళ్లు, వాళ్లే మనంగా జీవించిన వాళ్లు నట్టేట ముంచి అచేతనంగా మన చిటికెన వేళ్లు వదిలేసి, గుండెల మీద తన్నేసి వెళ్లిపోతూ ఉంటారు. భవబంధాలేకాదు, రక్త బంధాలే కాదు, భౌతిక బంధాలు, శారీరక బంధాలు, మానసిక బంధాలు.. అన్నీ ఒక్కొక్కటీ అలా.. అలా.. ఎదలోతుల్లో పొరల్లా విడిపోతూ ఉంటాయి. పద్మవ్యూహంలో అభిమన్యుడిలా జీవిత యుద్ధంలో మనల్ని నిలబెట్టి బాణాలు సంధిస్తాయి. అనుభవాలు, అనుభూతులు భూతాలై వెంటాడుతుంటాయి, వెచ్చని కన్నీటి చారికలు మన సుతిమెత్తని మనసునే కాదు, శరీరం మొత్తాన్ని దహించి వేస్తుంటాయి. అప్పుడిక మనకు మనమే మిగులుతాం.. మనకు మనమే నిర్వేద రహిత కాలంలో కరిగిపోయి కుమిలిపోతాం. కాలిపోతాం. మాటలు ఉండవు, మౌనం ఉండదు, అదో భావరహితాకృత ఆక్రోశం. క్షోభ, వేదన. ఇప్పుడు ఆ తీవ్ర కల్లోల మధ్య ఉన్నావని తెలుస్తోంది. మొన్న నీతో మాట్లాడిన పది నిమిషాల వల్ల.

ఎక్కడో చదివినట్లు గుర్తు.. పుట్టుక నిజం, చావు నిజం. మధ్య ఉన్న ఈ జీవితం ఊహ మాత్రమే అని. నిజమే.. కానీ పుట్టిన తర్వాత ఎవరి ఆట వాళ్లు ఆడాల్సిందే. ఆట మధ్యలో ఆపడానికి వీల్లేదు. వీలుకాదు. కుదరదు. మన మనసే మనకు ఆటస్థలం అంటాడు గీతలో కృష్ణుడు. మనసును స్వాధీనం చేసుకుంటే ప్రపంచాన్ని ఆస్వాదించడం అలవాటైనట్లే. భవబంధాలు, భౌతిక బంధాల కన్నా మనకు మనం ముఖ్యం, మనసు మీద అధికారం ముఖ్యం. జీవితపు ఆట ముఖ్యం. మనకోసం మనం జీవించడం ముఖ్యం. ఎవరికీ ఎవరూ తోడు ఉండరు. జీవితపు రైల్లో ఎవరి స్టేషన్ వచ్చినప్పుడు వాళ్లు దిగిపోతుంటారు. కొత్తవాళ్లు ఎక్కుతుంటారు. అనుభవాలు మాత్రమే మిగులుతుంటాయి వ్యక్తులు కాదు. కొన్ని అనుభవాలు గుణపాఠాలు నేర్పుతాయి. మరికొన్ని చేదు గుర్తులు మిగుల్చుతాయి. కొన్ని అందమైన అనుభూతులు పంచుతాయి. అన్నిటికన్నా మనం చూసే దృష్టి ముఖ్యం. మనం తీసుకునే కోణం ముఖ్యం. మనం తీసుకునే కోణం ముఖ్యం. ముగింపు ఏదీ కాదు, అలాగే ప్రారంభమూ ఏదీ కాదు. ప్రయాణం మాత్రమే మన చేతుల్లో ఉంటుంది. అందుకే రిక్త హస్తాల నుంచి అక్షయ పాత్రను సృష్టించుకోవాలి ఒక్కోసారి. కెరటం నా ఆదర్శం, లేచి పడినందుకు కాదు, పడినా లేచినందుకు అన్నాడు ఓ మహాకవి. జీవితమూ అంతే. ఒక్కోసారి కన్నీటి కుండల్ని కౌగిలించుకోవాల్సి వస్తుంది. ఏకాంతపు క్షణాలతో రాత్రులను నిద్రపుచ్చాల్సి వస్తుంది. అంత మాత్రం చేత వృథా కాదు. తప్పు కాదు. నేరం కాదు. బతుకు క్షణాల ముంగిళ్లలో వేకువ ముగ్గులు విచ్చుకుంటాయి. అగ్ని సిగల్లో ఉదయపు మందార పూలు పూస్తాయి. మల్లెలు మత్తుగా విచ్చుకొని శరద్రాతుల్లో మనకు తోడుగా ఉంటాయి. కానీ గతాన్ని తవ్వుతూ కూర్చుంటే శిథిలాలే బయటపడతాయి. అందుకే ఆ పునాది మీద భవిష్యత్తును నిర్మించుకోవాలి. మన చేతుల్తో మనమే ఆశల సౌధాన్ని కట్టుకోవాలి. ఒక్కో క్షణాన్ని పోగు చేసిన ఒక్కో మెట్టుగా బాధాతప్త హృదయంలోంచి భవిష్యత్తు నిచ్చెన నిర్మించుకోవాలి. ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక... ఏ దారెటుపోతుందో ఎవరికి తెలియక.. అన్నాడు సినీ కవి.

ముందుగా నిన్ను నువ్వు నిర్మించుకో, నిన్ను నువ్వు ఆస్వాదించుకోయ, నిన్ను నువ్వు అనుభవించుకో, నిన్ను నువ్వు చైతన్యంలా విజృంభించుకో.. ఈ లోకానికి, ఈ లోకంలో నిన్ను వద్దనుకున్న వాళ్లకు, నిన్ను విచ్ఛేదన చేసిన వాళ్లకు.. నువ్వేంటో తెలిసేలా.. నువ్వేంటో గుర్తొచ్చేలా.. నువ్వేంటో గర్వించేలా.. నువ్వే ఒక బాణమై, నువ్వే ఒకరథమై, నువ్వే ఆ రథానికి సారథివై, అన్నీ నువ్వే అయి ముందుకెళ్లు, నీకోసం పది మంది కాదు, నువ్వు పది మంది కోసం అనేదే ముఖ్యం.వదిలేసిన శక్తులను కూడగట్టుకొని, నీరసించిన మనసును పునరుత్తేజింపజేసి, నిస్సాయత, నిరుత్సాహ ల్లోంచి.. నీకు నువ్వుగా, నిన్ను నమ్మే బంధాల కోసం సరికొత్తగా జీవితాన్ని స్వాగతించు..

ఓడిపోవడం తప్పు కాదు..
ఓడిపోయాను అనుకోవడం తప్పు..
ఓటమిలోనే ఉండిపోవడం తప్పు..
కొత్తదాన్ని ఆహ్వానించ లేకపోవడం తప్పు..

మిత్రమా.. ఇవన్నీ నీ ఆలోచనలకు కర్తవ్యానికి మధ్య వారధిలా నిలుస్తాయనుకుంటాను. ఇంత రాసిన తర్వాత నా మనసూ.. ఓరకమైన అచేతనలోకి జారిపోతోంది. అప్పుడప్పుడూ కలుసుకుం టుందాం బింబ ప్రతిబింబాల్లా.. అద్దంలో కనిపించే నీలినీడల దోబూచు ఆటలా.. తప్పదు కదా.. నాకు నువ్వు, నీకు నేను. పక్కనున్న అలారం రెండు గంటలు చూపిస్తుంది. కళ్లమీద నీడలాంటి నిద్ర ఓలలాడుతోంది. నిద్ర ఎప్పుడూ స్వాంతననిచ్చే దైనందిన భౌతిక క్రియే.. నిన్ను నువ్వు పునర్నిర్మించుకుంటావని ఆశిస్తూ.. సె...ల...వ్... నీకే కాదు, నీలాంటి వాళ్లందరికీ..

-వ్యాసరచయిత సెల్ 9394489263

విశాలాంధ్ర

బతుకు

The Life

మంగళవారం

09 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

ఒక్కోమాటకు ఒక్కొక్కరూ ఒక్కోతీరుగా స్పందిస్తారు. అది పిల్లలైనా, పెద్దలైనా సరే! ఆ స్పందించే తీరు వారి వ్యక్తిత్వాలను బట్టి ఉంటుంది. స్పందించే గుణానికి వయస్సు అడ్డంకి కాదు. అందుకు నిదర్శనమే ఈ ఉదంతం. మనదేశంలో ప్రభుత్వ పాఠశాలలన్నీ దాదాపు ఒకేరకంగా ఉంటాయి. పెచ్చులూడిపోయి, గోడలు బీటలు వారిపోయి, బెంచీలు సరిగ్గా లేకుండా...ఇలాంటి సవాలక్ష సమస్యలు. అలాంటి స్కూల్లో చదివే ఒక పిల్లాడు ఎవరైనా ఇలాంటి సమస్యలు మీకు చెబితే మీరేమంటారు! ఏం చేస్తాం? అన్నిచోట్లా ఇదే పరిస్థితి అంటారు! లేదంటే ప్రభుత్వానికి ఓ వినతిపత్రం అందజేద్దామనో, నాయకుల దృష్టికి తీసుకెళదామనో అంటారు! అంతేనా! ఇక అక్కడితే ఆ విషయాన్ని మర్చిపోతారు. అంతేగానీ ఈ సమస్యల పరిష్కారానికి మీరే పూనుకుంటారా? నలుగురు పిల్లలు ఆ పని చేశారు. వారి పాకెట్ మనీతో ఒక ప్రభుత్వ పాఠశాలకు కొత్త రూపునిచ్చారు. ఆ బడిపిల్లల పాలిట ఓ జ్ఞాపకంగా మారారు. బాలలందరికీ ఆదర్శనీయులయ్యారు.



బడి కోసం.. పిల్లల

పొదుపు పైసలు!

బెంగళూరులోని కళ్యాణ్ నగర్. ఇక్కడకు సమీపంలో ఉంది ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. ఈ స్కూల్‌లో చదువుతున్న ఒక కుర్రాడు వాళ్ళ అమ్మ పనిచేస్తున్న యజమాని కూతురుకి ఈ విషయం చెప్పాడు. తమ పాఠశాల ఎలాంటి దయనీయ స్థితిలో ఉందో వివరించాడు. ఈ మాటలు విన్న ఆ అమ్మాయి ఆలోచించింది. ఆ బడి బాగు చేయడానికి ఏదైనా చెయ్యాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని తన చెల్లెళ్ళు, తమ్ముళ్ళకూ చెప్పింది. మొత్తం నలుగురూ కలిసి ఆ పాఠశాలకు కొత్త రూపురేఖలను ఇచ్చారు. ఇదెలా జరిగిందో తెలుసా? ఇందుకోసం వారేం చేశారో తెలుసా? వాళ్ళ ఖర్చుల కోసం అమ్మానాన్నలు ఇచ్చిన పాకెట్ మనీని ఉపయోగించారు. ఆ డబ్బుల తోనే బడిని బాగుచేయించారు. ఆ స్కూల్లో కావలసిన సౌకర్యాలనూ కల్పించారు. ఈ విషయం కనీసం వారి అమ్మానాన్నలకు కూడా చెప్పకుండా చేయడం విశేషం. చేసేది మంచి పని అయినప్పుడు చెప్పకపోయినా తప్పు లేదని భావించారేమో! ఆ పిల్లలు చేసిన ఈ మంచి పని గురించి వాళ్ళ అమ్మానాన్నలకూ స్కూల్ యాజమాన్యం చెబితేనే తెలిసింది.

ఇంతకీ ఆ నలుగురు పిల్లలు ఎవరో తెలుసా! నిధి శంకర్ రెడ్డి, నేహా రెడ్డి, ధృవ రెడ్డి, దీక్షిత రెడ్డి. వీరిలో అందరికంటే పెద్ద నిధి. ఆ అమ్మాయికి వచ్చిన ఆలోచనే ఇది. నిధి ఇంటర్ చదువుతోంది. నేహారెడ్డి ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థి కాగా, ధృవ రెడ్డి నాలుగో తరగతి, దీక్షిత రెడ్డి ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఈ నలుగురూ కలిసి బెంగుళూరులోని కళ్యాణ్‌నగర్ సమీపాన ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం కోసం రూ.1.5 లక్షలు అందజేశారు. ఈ సొమ్ముతో కొత్తగా టాయిలెట్ కట్టించారు, తరగతి గదులు, బెంచీలకు రంగులు వేయించారు. ఇతరత్రా అవసరమైన సౌకర్యాలనూ కల్పించారు. ఇంత చిన్న వయస్సులో తమ పాకెట్ మనీని మంచి పని కోసం వినియోగించాలన్న ఆలోచన ఆ పిల్లలకు రావడం నిజంగా అభినందించదగ్గ విషయం. అది కూడా పాఠశాలలో తగిన సౌకర్యాల కోసం అందించడం ప్రశంసార్హం.

చదువుకునే పిల్లలకు తగిన సదుపాయాలు లేకపోవడం అనే విషయమే తనను కదిలించిందని, వాళ్ళకోసం ఏదైనా చేయాలనే ఆలోచనతోనే ఈ పని చేశానని చెబుతోంది నిధి. తనతోపాటు తన చెల్లెళ్ళు, తమ్ముళ్ళు మొత్తం నలుగురి పాకెట్ మనీని పొదుపు చేసి ఈ స్కూల్‌కి అందజేశామని వివరించింది నిధి.

చదువుకునే వయస్సులో చేతిలో డబ్బుంటే సినిమాకెళదామా? షికారుకెళదామా? ఇంకెలా జల్సా చేద్దామా అనుకునే పిల్లలే ఎక్కువమంది నేటి రోజుల్లో. ఇందుకు భిన్నంగా ఈ నలుగురు పిల్లలు ఇంత పని చేయడం ఆదర్శనీయమే.

ఈజీ రంగోలీ డిజైన్స్!







మోచేతులూ తెల్లగా...!

అందం మీద శ్రద్ధ ఉన్నవాళ్ళు మోచేతులకూ ప్రాధాన్యతనిస్తారు. మోచేతులు, మోకాళ్ళు సాధారణంగా నల్లగానే ఉంటాయి. వీటిని తెల్లగా మార్చుకునేందుకు కొన్ని సహజమైన పద్ధతులు ఉన్నాయి. అవి...


- ఒక టేబుల్ స్పూన్ బియ్యంపిండిలో మూడు, నాలుగు టీ స్పూన్‌ల రోజ్‌వాటర్ కలపండి. ఈ పేస్ట్‌ని మోచేతులకు రాయండి. కొద్ది నిముషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి. తర్వాత కొద్దిగా మాయిశ్చరైజర్‌ని రాయండి. రోజులో రెండు, మూడుసార్లు ఇలా చేస్తే వేగంగా ఫలితాలు కనిపిస్తాయి. 2. తాజా బంగాళాదుంపల నుంచి కొద్దిగా రసం తీసి వాటిని మోచేతులకు రాయండి. 20 నిముషాలు అలాగే ఉంచండం. తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి. ఈ మోచేతులు సాధారణ చర్మం మాదిరిగా తయారయ్యే వరకూ రోజులో ఎన్నిసార్లు అయినా ఈ చిట్కాని పాటించవచ్చు.
- అర టీ స్పూన్ బేకింగ్ సోడాలో ఒక టేబుల్ స్పూన్ నీళ్ళు కలిపి ఈ పేస్ట్‌ని మోచేతులకు రాసి పావుగంట ఉంచండి. తర్వాత వేడినీళ్ళల్లో కడిగేయండి. ఈ చిట్కాను రోజుకి ఒక్కసారి ఉపయోగిస్తే చాలు.



- తాజా పెరుగు తీసుకుని దాని మీద ఉండే మందపాటి పొరను మోచేతులకు రాయండి. అరగంట ఆగిన తర్వాత వేడి నీళ్ళతో కడిగేయండి. ఈ చిట్కానూ రోజుకి రెండు, మూడు సార్లు ఉపయోగించుకోవచ్చు.
- అలోవెరా నుంచి తాజా గుజ్జును తీసుకుని మోచేతులకు రాసి 35 నిముషాలు ఉంచి తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. రోజుకి రెండుసార్లు అలోవెరా గుజ్జు రాసుకోవచ్చు.
- ఒక టీ స్పూన్ కమలాపండు తొక్కల పొడి తీసుకోండి, ఇందులో రెండు, మూడు టీ స్పూన్‌లు రోజ్‌వాటర్ కలపండి. ఈ పేస్ట్‌ని మోచేతులకి రాసి 45 నిముషాలు ఉంచండి. తర్వాత యథావిధిగా గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారంలో ఐదు లేదా ఆరు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
- నిమ్మకాయను రెండు చెక్కలు చేసి ఒక దాంతో నేరుగా మోచేతి మీద రాయండి. జ్యూస్ మోచేతికి పట్టిన తర్వాత పావుగంట, 20 నిముషాలు ఉంచండి. ఇలా రోజుకి ఒకసారి చేయవచ్చు.







చెట్టునూ బతకనివ్వండి

రోడ్డుమీదకి వెళితే చాలు ఎక్కడా చూసినా బేనర్లు, హోర్డింగ్‌లే. ఊళ్ళోనే కాదు ఊరు శివారు ప్రాంతాలకు వెళ్ళినా ఇదే పరిస్థితి, ఈ బేనర్లు, హోర్డింగ్‌లు కట్టేందుకు చెట్టూచేమనూ కూడా వదలడం లేదు. ఎంతసేపూ వ్యాపారదృక్పథమే తప్ప ఇలా చేయడం వల్ల వచ్చే నష్టం గురించి ఆలోచించడం లేదూ. రోజూ మనం నడిచి వెళ్ళే దారిలో లేదా ప్రయాణించే దారిలో పదుల సంఖ్యలో, వందల సంఖ్యలో ఈ బేనర్లు కనిపిస్తూ ఉంటాయి. అక్రమంగా అంటించేస్తున్న వీటిని తొలగించే ప్రయత్నం ఎప్పుడైనా చేశారా? ఒక వూరు, ఒక ప్రాంతం అని కాదు దాదాపుగా అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోనూ ఈ పరిస్థితి ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలోనూ ఈ పరిస్థితి ఉంది. అక్కడ యువత ఈ విషయంపై దృష్టి పెట్టారు. ప్రత్యేకించి కొత్త సంవత్సరం సందర్భంగా కొత్త నిర్ణయం తీసుకున్నారు. అదే చెట్ల మీద ఉన్న బేనర్లు, హోర్డింగ్‌లు తొలగించాలన్నదే ఆ నిర్ణయం. నవీ ముంబయి నెట్‌వర్కింగ్ సంస్థకి చెందిన కొంతమంది యువ కార్యకర్తలు ఈ నిర్ణయం తీసుకోవడమే కాదు ఈ పని చేశారు కూడా. బేనర్లు, హోర్డింగ్‌లనే కాదు వాటిని ఏర్పాటు చేసేందుకు వాడిన మేకులు, స్క్రూలను కూడా తొలగించారు. డిసెంబరు 31వ తేదీనే ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆ రాత్రంతా కొనసాగింది. అక్రమంగా చెట్టు మాను, చెట్టు కొమ్మలకు ఏర్పాటు చేసిన బేనర్లు అన్నింటినీ తొలగించారు. చెట్లకు మేకులు కొట్టడం, బేనర్ల కోసం స్క్రూలను దింపడం వృక్షాల పరిరక్షణ నియమ, నిబంధనలను ఉల్లంఘించడమే, ఇలా చేయడం చెట్లకు తీవ్ర హాని చేస్తుంది అని చెప్పారు నవీ ముంబయి నెట్‌వర్కింగ్ వ్యవస్థాపకుడు సందీప్ శర్మ. ఈ సంస్థ వాలంటీర్లు తొలగించిన బేనర్లు అన్నింటినీ నవీ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంఎంసీ)కి అప్పగించారు. అక్రమ వాణిజ్య ప్రకటనలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంఎంసీ యోచిస్తున్న నేపథ్యంలో వారు ఈ చర్యలు తీసుకున్నారు. ఇలా బేనర్లు ఏర్పాటు చేయడం వల్ల కొమ్మలు ఉండని తాటిచెట్లు లాంటి చెట్లకు ఎక్కువ హాని కలుగుతోందని వివరించారు. మేకులు కొట్టడం, స్క్రూలు బిగించడం వల్ల చెట్లు తొందరగా దెబ్బతింటున్నాయని, చచ్చిపోతున్నాయని చెబుతున్నారు. ఈ సమస్య ఒక్క ముంబయిలోనే కాదు పంజాబ్, హర్యానాల్లోనూ ఎక్కువగానే ఉంది. ఇందులోనూ ఎక్కువగా రాజకీయ నాయకులు, ప్రముఖ రాజకీయ పార్టీలకు చెందిన బేనర్లే ఉండడం విచారకరం. పెరుగుతున్న ఈ సమస్యను పట్టించుకోవలసిన రాజకీయ నాయకులే ఇందుకు కారణమవుతుండడం మరింత దురదృష్టకరం. ఇందుకోసం పర్యావరణ పరిరక్షణ చట్టాలనూ ఉల్లంఘిస్తున్నారు. ముంబయిలోని నవీ ముంబయి నెట్‌వర్కింగ్ కార్యకర్తల మాదిరిగా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో స్వచ్ఛంద కార్యకర్తలు చెట్ల పరిరక్షణ కోసం ముందుకు రావాలి. అక్రమ హోర్డింగ్‌లను నిలువరించాలి.



అతడు-ఆమె

38

జరిగిన కథ

అయితే నిజానికి శాంతం విజ్ఞానం, చదువు ఆవిడ కక్కడిది? లేడీ అయ్యంగారి లౌక్యం, చాకచాక్యం. చలాకీకూడా శాంతం నేర్చుకోవాలి.... అదిగో నేను ఆవిడనీ ఈవిడనీ త్రైపారవేసి చూడకూడదు. ఎప్పుడూ అలా చెయ్యను అనుకుంటూనే వుంటాను. మళ్ళీ మనస్సు అనుకోకుండా అలా వెళ్ళిపోతుంది. నేనుకూడా లేడీ అయ్యంగారిని గురించి కాస్త మర్చిపోవడానికి ప్రయత్నించాలి... ఇంతకూ శాంతానికి కొంత వ్యాపకం, వేలంబన వుండాలి. చేతినిండా ఏదో వక పని వుండాలి. ... పాపాయి వక్కర్తె అయిపోయింది కూడాను....

49 ఆమె

మొన్నరాత్రి "ఈస్టు ఎండ్ వెస్టు" క్లబ్బువాళ్ళ వార్షికోత్సవం కన్నిమేరాలో అయింది. క్లబ్బు ప్రెసిడెంటు జస్టిస్ జాన్సన్, వైస్ ప్రెసిడెంట్లు మిస్ జిన్‌వాలాన్నూ, శాస్త్రిన్నీ, శక్రటరీ లేడీ అయ్యం గారునన్నూ, సర్ గోవింద మీనను, నన్నూ రమ్మనమని చంపేడు శాస్త్రి. ఈ పల్నాడు ఖద్దరులోనే నెందుకుక్కడికి - నేనేం డాన్సు చెయ్యగలనా?

(నిన్నటి సంచిక తరువాయి)

కొక్‌టైల్సు సేవించగలనా? నేనెందుకు - పానకంలో పుడకలాగన్నా. "అబ్బే నువ్వొస్తేకాని వీల్లేదు. నేను వైస్ నేమిటి? నువ్వు రాకపోవడమేమిటి?" అన్నాడు. మొండిపట్టు పట్టినట్టుం టుంది వెళ్ళకపోతే - ఆవేళ లేడీ అయ్యంగారి మొహం చూస్తే వొట్టన్నాగా, ఆ పంతంమీద రావడంలేదనుకుంటాడు శాస్త్రి అని - వెళ్ళా... ఓ, ఓ - వచ్చారు ప్రముఖులూ, వారి భార్యలు, "సోసైటీ స్త్రీలు," తెలుపు, నలుపు, చామనఛాయ జోరుగా వుండెను. లేడీ అయ్యంగారు నన్ను అందరికీ పరిచయం చేసింది. విందు, ప్రాచ్య ప్రతీచీ, చీకటి, వెన్నెల, శాకాహారం, మాంసాహారం, సోమరసం, చెరుకురసం, ధూమపానం, తాంబూలం ఎండా వానా నక్కల కుక్కల పెళ్ళి, అంతా తమాషాగా వుండెను. ఉపన్యాసాలు, భలేగా వుండెను. చప్పట్లు కొట్టడానికే వచ్చారు అందరూను. శాస్త్రి బాగా నవ్వించేడు అందరినీ - వింటూన్నంత సేపు నా శాస్త్రేనా ఇతను అని పించింది. ఎప్పుడూ చూస్తున్న మనుష్యుల గొప్పతనం మర్చి పోతూంటాం. పైవాళ్ళు జ్ఞాపకం చేస్తేనే అప్పుడు కళ్ళు తెరుస్తాం...డాన్సు... నేను మొదలుదగ్గరనుంచి పాశ్చాత్య నాట్యం అంటే అసహ్యించుకొనేదాన్ని. కాని, ఆ వాతావరణం, ఆ సంగీతం, లయ, ఆ అడుగులు అందంగానే వుండెను. స్త్రీలు పురుషులు కలిసి గిర్రున శాస్త్రీ, లేడీ అయ్యంగారు రెండుమూడు సార్లు కలిసి "ఫాక్సుట్రాటు" "వాల్టజ్" చేశారు. చూడ్డానికి రమ్యంగానే వుంది. ఆ సంగీతం కూడా సరిగ్గా సరిపోయింది. ఇంటికొచ్చేసర్కి తెల్లవారు ఝూం నాల్గు అయింది....!

ఈవేళ సాయంత్రం మామూలుగా మెరీనాకీ వెళ్ళేం. బ్యాండువాద్యం, జనం, దొర్లు, దొర సాన్లున్నూ. ఆ సంగీతం బోధపడకపోయినా మన వాళ్ళు కూడా చాలామంది వొచ్చారు. లేడీ అయ్యం గారు, శాంతాదేవి, ఆవిడ పెనిమిటీ అంతా మా కారు దగ్గిర కొచ్చారు. ఆ సంగీతం ఎవరిక్కావాలి? వచ్చేకార్లు వెళ్ళేకార్లు - బాతాఖానీ. ఇంతట్లో ఒక మోటారు సైకిల్ మీద ఒక దొరసాని వెనకని ఒక దొరా - యీ దొరేమో ఆవిడని ఆనుకుని ఒక చెయ్యి ఆవిడ నడుముచుట్టు వేసుకుని బర్రుమని వెళ్ళింది. అందరూ విడ్డూరంగా చూడ్డం మొదలెట్టారు. అక్కడినుంచి విమర్శనలూ "చూశార్రా యీ సినిమా దృశ్యం! వీళ్ళ మర్యాదలు మండిపోనూ, యీ వెకిలి తనమేమిటండీ?" అంది లేడీ అయ్యంగారు. నేనన్నా: "మొగుడు పెళ్ళాం ఏమోలెండి?" "అయితేనేం యిది మెరీనా అనుకున్నారా? వాళ్ళపడగ్గది అను కున్నారా? పెద్దా చిన్నా అందరూ వచ్చేస్థలం యింతా భాసా!" అందావిడ. "అయితే - ఏమిటి? యింతకీ వాళ్ళను చూచి చెడిపోయిందెవరు? మీకింత కోపం రావడానికి" అన్నాను. "చెడి పోయే దెవరంటారేమిటి? అందరమూన్నూ. ఇలాంటి పోకీరీలని విచ్చలవిడిగా తిరగనిస్తే మానం వున్నవాళ్ళమి, శీలంవున్న వాళ్ళమి యింక యిళ్ళలో కూచోవలసిందే!" నేనూర్కో వాలసిందా, ఆవిడతో పిచ్చిగా వాదించడం మొదలెట్టా. "మొగాడు ఆడది చెట్టాపట్టాలు వేసుకుని తిరగడం చూసినంత మాత్రాన్నే శీలానికి మానానికి భంగం వస్తే ఆ శీలం మానం



విలువేమిటి?" అన్నా. "ఏమో! మీలాంటి చదువుకున్న స్త్రీలలా అంటే నేనేం చెప్పలేను కాని, మాలాంటి హిందూ సాంప్రదాయం వాళ్ళందరికీ అసహ్యంగానే వుంది. ఏమేనా, మనవాళ్ళెవరూ ఇంత అసభ్యంగాను, యింత బాహాటంగాను బరితెగిపోవ దంలేదు. మన క్వీన్స్ కాలేజీ పిల్లలిక యీ దొరసాన్లలాగు మొదలెడుతారో ఏమి ఖర్మమో!" అంది ఆవిడ. "అదేమిటలా అంటారు? మొన్నా గిండీ గార్డెన్ పార్టీలో నోటని సిగరెట్టులేని అమ్మాయీ, మొహానికి, గోళ్ళకి రంగులేసుకోని ముద్దరాలూ వుంటే వొట్టన్నారెవరో!" అన్నా. "మా మీదేమిటాదెబ్బ! గార్డెన్ పార్టీలో డ్యాన్సులను మెరీనామీద ప్రణవిహారం ఒకటేటండీ -



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

శాంతంగారూ? శాస్త్రిగారూ! మా వాదప్రతి వాదాలకి మీరు తీర్పు చెప్పండీ?" అని శాస్త్రిని మధ్యకి లాక్కొచ్చింది. శాస్త్రి అన్నాడు - "నాకు ఏహ్యంగానే కనిపించింది సుమండీ!" "హిప్పు, హిప్పు, హుర్రే" అని చప్పట్లు కొట్టిందావిడ.... నాక్కొంచం చిన్నతనమే అనిపించింది. శాస్త్రి నన్ను వెనకేసుకు రావడం ధర్మం...లేకపోతే అనుకోకుండా బయటపడిపోయేడా? ...ఛీ..ఛీ..నే నేమిటలా రాస్తున్నా - మనసుకంటే కలమే ముందు పరుగెడుతూందేమిటి?...

50 అతడు

కన్నిమేరా టీపార్టీలో బాగా మాట్లాడేనని శాంతం మెచ్చుకుంది. లేడీ అయ్యంగారితో మూడుసార్లు డ్యాన్సు చేసాను. శాంతం ఏమనుకుంటుందో అని భయపడ్డానుగాని ఏం అనలేదు. సరేకదా, నాక్కూడా నేర్పుదురూ అని ఆవిడని అడిగింది. లేడీ అయ్యంగారు ఎంత బాగా డ్యాన్సు చేసింది? పాపం, చనిపోయి నాయన దొరా దొరసాన్ని పెట్టి నేర్పించాడుట! అతడేం డ్యాన్సు చేస్తాడు-టైకట్టుకోవడమే సరిగ్గా చేతగాకపోతే? కాని చేతితో చెయ్యికలిపి ఆవిడతో అలా డ్యాన్సు చేస్తుంటే వొళ్ళు జలద రించింది. నాకు. సంగీతం కూడా తలకెక్కింది - ఆలయ వింటూంటే మతిపోయినట్టే అయి పోయింది! ఇంగ్లండులోకూడా నేనెప్పుడు డాన్సు హాల్సుకు వెళ్ళినా - యిలాగే ఉండేది నాకు. వొంటిని ఎలెక్ట్రిక్కు బేటరీ పెట్టినట్టే. ఏదైనా - ఎలా అనిపిస్తుందంటే పురుషుడూ స్త్రీనీ చివరికీ భార్యభర్తలన్నా సరే - సామీప్యం - స్పర్శ మహాచెడ్డ ప్రమాదం క్రింద పరిణ మిస్తాయి...అరే! నేనేమిటి గాంధీలా రాస్తున్నా నేమిటి?...పార్టీ మాత్రం మంచి జల్సాగా వెళ్ళి పోయింది. శాంతంకూడా నిజంగా ఇంగ్లీషు సంగీతం నృత్యం నేర్చుకుంటేనా - అందరినీ మించి పోతుంది. అందుకు సందేహంలే - కాని ఖద్దరు ఇంగ్లీషు నృత్యం యీ రెండు ఎల్లా కలుస్తాయి? అదేమిటి? ఖద్దరు దేశభక్తుల్లో మాత్రం రసికుల్లేరా - నెరజాణలు లేరా? లేడీ అయ్యంగారు ఖద్దరు వేషం వేసుకుంటే ఎలా వుంటుందోనో! ఎంత చురుకుగా చాకచక్యంగా ఏర్పాట్లు చేయించిందండీ మొన్న టీపార్టీలో! అంతలాంటిమనిషి కూడా ముతకగుడ్డలు కట్టుకునే సరికి మెతకై పోతుందేమో? ఖద్దరు హృదయపరివర్తనం తీసు కొస్తుందంటారుగా!...ఏమైనా సరే ...ఖద్దరు గురించి శాంతంతో వాదన పెట్టుకోవడం మంచిదికాదని నిశ్చయించుకున్నా. మొగుడు పెళ్ళాం అయినాసరే రోజూ పూరికే వాగ్యుద్దాల్లో దిగకూడదు. ఖండన మండనాల్లో అహంకారం బయట కొచ్చేస్తుంది, పైవాళ్ళవుతే అప్పుడకప్పుడే సరి. వాళ్ళెవరో మన మెవరమో. కాని కావలసిన వాళ్ళమవుతే మర్చిపోలేం. వాదనలు తీవ్రం అయిపోతే లోపాలు తాపాలవుతాయి. మునుపు మేం ఇద్దరం ఎన్ని అనుకున్నా చివరికి బుజ్జగింపులతో అంతా సర్దుకు పోయ్యేది. ఇప్పుడల్లా అవటంలే. మొగుడూ పెళ్ళాంలోనూ అసలు విషయాల్లో తేడాలుంటే కష్టమే. నాకూ శాంతానికి అభిప్రాయాలు భిన్నం అయిపోతున్నాయి. ఈ ఖద్దరు వొకటి. ఈ ధోరణి యింక యెందులోకి యీడ్చుకుపోతుందో? స్త్రీలు - స్వేచ్ఛ యిదొక గొడవ. నిన్ననవసరంగా వొచ్చింది - దొర, దొరసాని మోటారు సైకిల్‌మీద - ఒకరి వెనకాల ఒకరు కూచుని పోతూంటే - దానిమీద లేడీ అయ్యంగారూ - శాంతం వాదించుకున్నారు. దొరసాని మోటారు సైకిలు నడుపుతుంటే దొర వెనకాల ఆవిడను కౌగిలించుకుని కూర్చోవడం - అది బాహాటంగా మెరీనామీద తిరగడం వెకిలితనం - నీతి బాహ్యం - కామోద్రేకం అని ఆవిడ - ఎవరి స్వేచ్ఛ వారిది, దీనిలో తప్పేంవుంది? నీతి నియమాలన్నీ నిర్ణయించడానికి పోలీసు వాళ్ళని పెడుతారా యేమిటి? అని శాంతం - ఇలా కాస్సేపు కాస్త గట్టిగానే వాదించుకున్నారు. చివరికి లేడీ అయ్యంగారు నన్ను తీర్పు చెప్పమంది. ఈ మోస్తరుగా తిరగడం "పబ్లీకుగా" రోడ్డుమీద అందులోకి నలుగురు జూడాలని - చాలా విడ్డూరం గానూ - ప్రజానీతికి వ్యతిరేకమేనండీ, అని నేనన్నాను. నాలికి కరుచుకున్నాను. నాకూ అసహ్యంగానే కనిపించినా, నలుగురి లోనూ వున్నప్పుడు శాంతాన్నే నేను వెనకేసుకురావడం ధర్మం. ఏమిటో ఆ నిమిషానికి అంతవరకూ ఆలోచన వెళ్ళలేదు. లేడీ అయ్యంగారు ఏది చెప్పినా మంచి చమత్కారంగాను, ఘాటు గాను చెబుతుంది. అంచేత ఆవిడవేపే నేనూ వుండాలని అనిపిం చింది. ఆ నిమిషానికి మాత్రం - ఆదీన్నీ - యీ విషయంలో ఆవిడ అభిప్రాయం నా అభిప్రాయం ఒకటే అవడంచేత నా వోటు శాంతానికి వ్యతిరేకంగా ఇచ్చేశాను. శాంతం మనస్సు చివుక్కుమంది. నేను కనిపెడుతూనే వున్నా. మా యిద్దరికీ తేదాలలో యిప్పుడు యిదొక కొత్త అంశం తేల్తొంది. ఇంక ఇందుమీద రోజూ నాకూ శాంతానికీ మాటమీద మాటలు వస్తే యిక మనస్సుకు శాంతి యెట్లా వుంటుంది? ఆడవాళ్ళు - స్వేచ్ఛ - అంతటితో ఆగదు. ఆడవాళ్ళు - ఆర్థిక స్వాతంత్ర్య ఆస్తిలో హక్కు ఇవన్నీ వస్తాయి. సరే విడాకుల హక్కుకేం - మా విషయంలో ఎలాగా మేం "సివిలు" వివాహం కాబట్టి ఆ హక్కు వుంటుంది. అయితే మాత్రం మాంసం తింటున్నామని, ఎము కలు మెళ్ళో కట్టుకున్నట్టు హక్కు వున్నంత మాత్రం ఆడది విని యోగిస్తుందా? నలుగురి నోట్లో పడిపోవడమేగా? అనుకున్న ట్టుగానే యింటికి వెళ్ళగానే భోజనం చేసేక - పాపాయి ఐదోయేడు వచ్చాక దాని చదువుమాటేమిటి? అని అంది శాంతం. ఏముంది? ఆరేళ్ళొచ్చాక సీమ పంపిద్దాం అన్నా.

- ఇంకా వుంది.

TET Paper-II SYLLABUS

(నిన్నటి సంచిక తరువాయి)

7. రసాయన సంయోగ నియమాలు మరియు రసాయన గణనలు : భౌతిక మార్పు, రసాయన మార్పు, రసాయన సంయోగ నియమాలు, రసాయన చర్యలు, సమీకరణాలు మరియు వాటి గణనలు, రసాయన చర్యలలోని రకాలు.

8. పరమాణు నిర్మాణం : పరమాణువులు మరియు అణువులు, మూలకాలు, అయాన్, డాల్టన్ పరమాణు సిద్ధాంతం, పరమాణు ద్రవ్యరాశి, సంయోజకత, అణుద్రవ్యరాశి, మోల్ భావన, థామ్సన్ పరమాణు సమూనా, రూథర్‌ఫర్డ్ పరమాణు సమూనా, బోర్ పరమాణు సమూనా, పరమాణు సంఖ్య- ఐసోటోపులు - క్వాంటమ్ సంఖ్యలు, ఎలక్ట్రాన్ విన్యాసం.

9. మూలకాల వర్గీకరణ మరియు రసాయన బంధం : డాబర్‌నీర్ త్రిక సిద్ధాంతం, న్యూలాండ్ అష్టక నియమం, మండలీవ్ ఆవర్తన పట్టిక, ఆవర్తన పట్టిక, ఆధునిక ఆవర్తన పట్టిక, (గ్రూపులోనూ, పిరియడ్స్‌లోనూ, మూలకాల ధర్మాలు, ఆవర్తన సరళి, రసాయన బంధం, ఆయానిక బంధం, సంయోజనీయ బంధం, అణువుల ఆకారాలు, వెలెన్సీ ఎలక్ట్రాన్ సిద్ధాంతం, ఆయానిక సంయోజనీయ బంధాల యొక్క ధర్మాలు.

10. లోహ సంగ్రహణ శాస్త్రం : ధాతువుల నుండి లోహ సంగ్రహణ మరియు దశలు, లోహాల చర్యాత్మకత మరియు లోహ సంగ్రహణలో వాటి పాత్ర. లోహ సంగ్రహణలో వాడే ముఖ్యమైన పద్ధతులు.

11. జీవశాస్త్రం : వర్గీకరణ సిద్ధాంతాలు, మానవ జీవితంలో జీవశాస్త్ర ప్రాముఖ్యత, జీవ పరిణామ సిద్ధాంతాలు.

12. సజీవ ప్రపంచం - లక్షణాలు : మొక్కలు, జంతువుల వర్గీకరణ - లక్షణాలు.

కణం : భావన - కణ సిద్ధాంతం - వృక్ష జంతుకణాల మధ్య విభేదాలు, కణ విభజన, కణాంగాలు.

కణజాలాలు : జంతు కణజాలాలు, వృక్ష కణజాలాలు.

13. వృక్ష ప్రపంచం : మొక్కలు - రకాలు- మొక్కలలోని వివిధ భాగాలు- వాటి విధులు, విత్తనవ్యాప్తి, మొక్కల నుండి నారలు. ప్రత్యుత్పత్తి - అలైంగిక, లైంగిక, శాఖీయ, ప్రత్యుత్పత్తి, పోషణ, కిరణజన్య సంయోగక్రియ, విసర్జన, శ్వాసక్రియ. మొక్కల ఆర్థిక ప్రాధాన్యత- వ్యవసాయం, వృక్షవ్యాధులు, నివారణ పద్ధతులు.

14. జంతు ప్రపంచం : వివిధ అవయవ వ్యవస్థలు - వాటి విధులు - (మానవునితో యుక్తంగా) జీవన ప్రక్రియలు : జీర్ణవ్యవస్థ, శ్వాస వ్యవస్థ, రక్తప్రసరణ వ్యవస్థ, విసర్జక వ్యవస్థ, నాడీ వ్యవస్థ, అంత:స్రావిక వ్యవస్థ, అస్థిపంజర వ్యవస్థ, ప్రత్యుత్పత్తి వ్యవస్థ, జ్ఞానేంద్రియాలు, పోషణ- మానవునిలో న్యూనత వ్యాధులు, ప్రథమ చికిత్స, జంతువుల ప్రవర్తన, జంతువుల ఆర్థిక ప్రాముఖ్యత, పశుపోషణ - పశు సంవర్ధకం, మత్స్య సంవర్ధనం, పట్టుపరిశ్రమ, ఎపికల్చర్, వ్యవసాయంలో సవాళ్లు.

15. సూక్ష్మజీవులు : బాక్టీరియా, వైరస్‌లు, శిలీంధ్రాలు, ప్రోటోజోవన్‌లు.

ఉపయోగకరమైన - అపాయకరమైన సూక్ష్మజీవులు, మొక్కలు, జంతువులలో సూక్ష్మజీవ సంబంధమైన వ్యాధులు.

16. మన పర్యావరణం : సజీవ మరియు నిర్జీవ కారకాలు, సహజ వనరులు, జీవ వైవిధ్యం, వివిధ రకాల ఆవరణ వ్యవస్థలు, గాలి కాలుష్యం, జల కాలుష్యం, నేల కాలుష్యం, కార్బన్ వలయం, నత్రజని వలయం, ఆక్సిజన్ వలయం.

17. జీవశాస్త్రంలో ఆధునిక ధోరణులు : హైబ్రిడైజేషన్, జనెటిక్ ఇంజినీరింగ్, జన్యు బ్యాంక్‌లు, జన్యు చికిత్స, కణజాల వర్ధనం.

పెడగాజీ (మార్కులు : 6)

1. సైన్స్ - నిర్వచనం, స్వభావం, నిర్మాణం, చరిత్ర.
2. సైన్స్ బోధన ఉద్దేశాలు, విలువలు, బోధన లక్ష్యాలు.
3. సైన్స్ బోధనా పద్ధతులు
4. సైన్స్ బోధనోపకరణాలు - సైన్స్‌లో టీఎల్ఎం.
5. బోధన ప్రణాళిక.
6. సైన్స్ ప్రయోగశాల.
7. సైన్స్ ఉపాధ్యాయుడు- మారుతున్న పాత్రలు.
8. సైన్స్ పాఠ్య ప్రణాళిక - కార్యకలాపాలు. ఎన్‌సీఎఫ్-2005, ఎన్‌సీఎఫ్-2011.
9. సైన్స్ పాఠ్యపుస్తకం.
10. మూల్యాంకనం- నిరంతర - సమగ్ర మూల్యాంకనం, రూపకల్పన, నిర్వహణ, విశ్లేషణ - విద్యావిషయక సాధన పరీక్ష (ఎస్ఏటీ)

IV(B). సోషల్ స్టడీస్

(మార్కులు : 60)

సోషల్ స్టడీస్ కంటెంట్ (మార్కులు : 48)

I. భూమి- వైవిధ్యం

1. పటాల అధ్యయనం విశ్లేషణ - స్కేలు- కార్డినల్ పాయింట్స్, - పటాల రకాలు - పటాల విశ్లేషణ - సాంప్రదాయక చిహ్నాలు - నమోన్నత రేఖలు (Contour lines)
2. గ్లోబు - మహా సముద్రాలు మరియు ఖండాలు - అక్షాంశాలు మరియు రేఖాంశాలు - భూమి పుట్టుక - భూమి ఆవరణములు (శిలావరణం, వాతావరణం, జలావరణం, జీవావరణం) - భూ స్వరూపాలు - భూ చలనాలు మరియు దాని ప్రభావాలు - రుతువులు - భూమి అంతర్గత నిర్మాణం.
3. సౌరశక్తి - సౌరపుటం- ఉష్ణోగ్రత మరియు వాటి మాపనాలు- భూవికిరణము - ధృవ ప్రాంతాలు
4. శీతోష్ణస్థితి అంశాలు - వర్షపాతం రకాలు
5. యూరప్, ఆఫ్రికా - ఉనికి - నైసర్గిక స్వరూపాలు -శీతోష్ణస్థితి - అడవులు మరియు వన్యమృగాలు - జనాభా - వ్యవసాయం - ఖనిజాలు - పరిశ్రమలు - రవాణా - వ్యాపారం - ఎగుమతులు మరియు దిగుమతులు.
6. భారతదేశం మరియు ఆంధ్రప్రదేశ్ భూగోళ శాస్త్రం - నైసర్గిక స్వరూపాలు - నదులు మరియు ఇతర జల వనరులు - రుతువులు - అడవులు - విద్యుచ్ఛక్తి - వ్యవసాయం - ఖనిజ సంపద - పరిశ్రమలు - జనాభా, అక్షరాస్యతా రేటు - జనాభా యొక్క జనసాంద్రత - నివాసాలు మరియు వలసలు - రవాణా.
7. విపత్తుల నిర్వహణ - విపత్తుల రకాలు - కరువు - ప్రమాద సంబంధితాలు - ఉగ్రవాద ముప్పు - మానవ కారక విపత్తులు.

II. ఉత్పత్తి - వినిమయం మరియు జీవనాధారాలు.

1. ఆదిమానవుల జీవనాధారం - ఆంధ్రప్రదేశ్‌లోగల స్థావరాలు - మచ్చిక చేసుకొనుట - స్థిర వ్యవసాయ జీవనం - వ్యవసాయ పద్ధతులు - పంట సమయం- వ్యవసాయరంగంలో సమస్యలు, వ్యవసాయ కార్మికులు మరియు చిన్న రైతుల సమస్యలు - ఒప్పంద వ్యవసాయం, ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం - వర్తకం మరియు మార్కెటింగ్ - స్వయం సహాయక బృందాలు - వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లు - కనీస మద్దతు ధర - భూకమతాలు - వ్యవసాయ అభివృద్ధి దశలు - హరిత విప్లవం - సేంద్రియ వ్యవసాయం.
2. ఉత్పత్తి - చేతివృత్తులు మరియు చేనేత వస్త్రాలు - సహకార సంఘాలు మరియు వాటి పాత్ర - పారిశ్రామిక విప్లవం - శక్తి వనరులు - పారిశ్రామిక ఉత్పత్తుల వ్యాపారం - పట్టణీకరణ మరియు మురికివాడలు - ఫ్యాక్టరీలో కాగితపు ఉత్పత్తి - పేపరు తయారీ విధానం - ఆంధ్రప్రదేశ్‌లో రవాణా వ్యవస్థ - రవాణా రంగంలో ఉద్యోగిత - రద్దీ మరియు కాలుష్యం.
3. పరిశ్రమలు - స్థాపన కారకాలు - వ్యవసాయాధారిత మరియు ఖనిజాధారిత పరిశ్రమలు, ఆటోమొబైల్ పరిశ్రమలు మరియు ఐ.టీ. - పారిశ్రామికాభివృద్ధి దశలు - పారిశ్రామిక విధానాలు - ఉత్పత్తిలో వృద్ధి - పర్యావరణ సమస్యలు.
4. సేవా కార్యక్రమాలు - రకాలు - ప్రాధాన్యత - సవాళ్లు.
5. ద్రవ్యం మరియు బ్యాంకింగ్ - వస్తుమార్పిడి పద్ధతి - వినిమయ మారకంగా ద్రవ్యం - ద్రవ్యం పరిణామ క్రమం - బ్యాంకులు - ఆవిర్భావం - వాణిజ్య బ్యాంకులు - డిపాజిట్ల రకాలు - చెక్కులు మరియు డిమాండ్ డ్రాఫ్టులు - రుణాలు (లోన్‌లు) - ఇంటర్నెట్ బ్యాంకింగ్ - ఆర్థిక వ్యవస్థలో రుణం - ఆర్థిక అక్షరాస్యత.
6. ధరలు మరియు జీవన వ్యయం - ప్రజలపై ధరల ప్రభావం- ద్రవ్యోల్బణం - వినియోగదారుల ధరల సూచిక - ధరల నియంత్రణ - ప్రభుత్వ బడ్జెట్ మరియు పన్నులు (వ్యాట్)
7. ఉత్పత్తి మరియు ఉపాధి - ఆర్థిక వ్యవస్థ రంగాలు - జాతీయ ఆదాయం - తలసరి ఆదాయం - (హెచ్‌డీఐ) (మానవాభివృద్ధి సూచిక) - ఉద్యోగిత - వ్యవస్థీకృత మరియు అవ్యవస్థీకృత రంగాలు - ఆర్థిక వ్యవస్థలోని మూడు రంగాలపై సాంకేతిక విజ్ఞాన ప్రభావం.
8. ప్రజారోగ్యం మరియు ప్రభుత్వం - ఆరోగ్య సేవలు - ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆరోగ్య బీమా.
9. ప్రపంచీకరణ - ఆర్థిక మార్పిడి ప్రవాహాలు - బహుళజాతి కంపెనీలు - విదేశీ వర్తకం - ప్రపంచీకరణకు దోహదం చేసిన అంశాలు - డబ్ల్యు.టి.వో, ఐ.ఎం.ఎఫ్. ప్రభావం.
10. ఆహార భద్రత మరియు భారత దేశంలో పోషకాహార స్థాయి - ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) సుస్థిరాభివృద్ధి అర్థం - సమానత్వంతో కూడిన సుస్థిరాభివృద్ధి.

III. రాజకీయ వ్యవస్థలు మరియు పరిపాలన

1. తెగల పంచాయతీ వ్యవస్థ - ప్రస్తుత స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ (గ్రామ పంచాయతీ, మండల పరిషత్ మరియు జిల్లాపరిషత్) & పట్టణ ప్రభుత్వాలు - ఏర్పాటు మరియు విధులు.
2. సామ్రాజ్యాలు మరియు గణతంత్రాల ఆవిర్భావం - మొదటి సామ్రాజ్యాలు - మౌర్యులు, రాజపుత్రులు - రాష్ట్ర కూటులు- చోళులు - దక్కన్ రాజ్యాలు - శాతవాహనులు - కుషాణులు - గుప్తులు.
3. ప్రాంతీయ రాజ్యాలు - కాకతీయులు - విజయనగర సామ్రాజ్యం - కుతుబ్‌షాహీలు
4. మొఘలులు - అసఫ్‌జాహీలు - బ్రిటీష్ సామ్రాజ్యం - బ్రిటీష్, నిజాములు, మరియు మొఘలాయిల కాలంలో భూస్వాములు మరియు కౌలుదార్లు.
5. భారతదేశంలో జాతీయోద్యమం - ముస్లింలీగ్ - దేశ విభజన మరియు వలసలు - దేశంలో సంస్థానాల విలీనీకరణ.
6. చట్టాల తయారీ మరియు అమలు - రాష్ట్ర శాసనసభ - శాసనమండలి మరియు పార్లమెంటు - ఎన్నికల విధానం.
7. భారత రాజ్యాంగం - నిర్మాణం - లక్షణాలు మరియు పీఠిక - న్యాయం - సమన్యాయపాలన - న్యాయవ్యవస్థ - పౌర మరియు నేర చట్టాలు - న్యాయస్థానాల స్థాయిలు.
8. యూరప్‌లో మారుతున్న సాంస్కృతిక సంప్రదాయాలు (1300-1800)- పునరుజ్జీవనం - సంస్కరణ - ఆధునిక శాస్త్రాలు.
9. ప్రజాస్వామ్య మరియు జాతీయ విప్లవాలు - ఇంగ్లాండు, అమెరికా మరియు ఫ్రెంచ్ విప్లవాలు - జర్మనీ, ఇటలీ ఏకీకరణ - మయన్మార్ మరియు లిబియాలో ప్రజాస్వామ్య విస్తరణ- పౌర హక్కులు.
10. పారిశ్రామికీకరణ మరియు సామాజిక మార్పు - బ్రిటన్, జర్మనీ మరియు ఫ్రాన్స్ - మహిళల, కార్మిక ఉద్యమాలు (సామ్యవాదం)
11. లాటిన్ అమెరికా , ఆసియా మరియు ఆఫ్రికాలో వలసవాదం, భారతదేశంపై ప్రభావం మరియు ప్రాంతీయ ఉద్యమాలు.
12. మొదటి మరియు రెండవ ప్రపంచ యుద్ధాలు కారణాలు - వర్సైల్స్ సంధి - నానాజాతి సమితి - మారణహోమం - నాజీజం - ఫాసిజం పర్యవసానాలు - అతిపెద్ద ఆర్థిక మాంద్యం.
13. చైనా, వియత్నాం, మరియు నైజీరియాలో విముక్తి ఉద్యమాలు.
14. ప్రపంచ యుద్ధానంతర ప్రపంచం మరియు ఇండియా - ఐక్యరాజ్యసమితి - అలీనోద్యమం - పశ్చిమాసియా ఘర్షణలు - శాంతి ఉద్యమాలు మరియు యూఎస్ఎస్ఆర్ పతనం.
15. స్వతంత్ర భారతదేశం - మొదటి సాధారణ ఎన్నికలు - రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ - ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలు - ప్రాంతీయ ఉద్యమాలు మరియు రాజకీయ పక్షాల ఆవిర్భావం - సంకీర్ణ ప్రభుత్వాలు - అత్యవసర పరిస్థితి - మండల్ కమిషన్ - ఆర్థిక సరళీకరణ
16. రోడ్డు భద్రత విద్య - ట్రాఫిక్ గుర్తులు - గుర్తులు - తప్పనిసరి ధ్రువపత్రాలు

IV. సామాజిక వ్యవస్థీకరణ మరియు అసమానతలు

1. భారతదేశంలో వైవిధ్యం - లింగ వివక్షతలు - లింగ నిష్పత్తి - ఉపాధి - మహిళల హోదా మరియు పని, వేతనాలు- మహిళల రక్షణ చట్టాలు.
2. కుల వివక్షతలు - సమానత్వానికై సంస్కరణల వాదుల ప్రయత్నాలు.
3. జమిందారీ వ్యవస్థ రద్దు - స్వాతంత్ర్య సమయంలో గ్రామీణ పేదరికం - భూగరిష్ట పరిమితి - భూదాన ఉద్యమం.
4. పేదరికం - గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి - తీవ్ర ఆకలి కూడా పేదరికమే - ఆహార సమతౌల్యత - పేదరిక నివారణ- సౌలభ్యమైన ఆహార లభ్యత - జీవించే హక్కు
5. మానవ హక్కులు మరియు ప్రాథమిక హక్కులు - సమాచార హక్కు- విద్యాహక్కుల - లోక్ అదాలత్.
6. సామాజిక ఉద్యమాలు - అమెరికాలో పౌర హక్కుల ఉద్యమాలు - గ్రీన్‌పీస్ ఉద్యమం - భోపాల్ వాయు దుర్ఘటన - ఎన్‌బీఎం (నర్మదా బచావో ఉద్యమం) - మైరియా పైటీ - రష్యాలో మానవహక్కుల ఉద్యమాలు.

V. మతము మరియు సమాజం

1. ప్రాచీన కాలంలో మతం మరియు సమాజం - సింధూలోయ నాగరికత - వేదాలు - హిందూమతం, బౌద్ధమతం, జైనమతం - క్రైస్తవ మతం - ఇస్లాం మరియు సూఫీ మతం, భక్తి ఉద్యమం - భారతదేశంలో నూతన మతాల అభివృద్ధి.
2. జానపదులు - మతం - సమాజంలో జానపద దేవతల పూజ - ప్రాచీన జానపద సంప్రదాయాలు - గ్రామ దేవతల అంతర్గత కలయిక మరియు ఉన్నతమైన మత సంప్రదాయం.
3. సాంఘిక మరియు మత సంస్కరణల ఉద్యమాలు - క్రైస్తవ మిషనరీలు మరియు పాశ్చాత్య మేధావులు - బెంగాల్ మరియు పంజాబ్‌లలో మత ఉద్యమాలు - ముస్లింలలో సంస్కరణలు మరియు విద్య - స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలు మరియు దళితులు.
4. లౌకికత్వం - అవగాహన

VI. సంస్కృతి మరియు సమాచారం

1. భారతదేశ వారసత్వం మరియు సంస్కృతి - చారిత్రక ప్రదేశాలు
2. భాష వ్రాయడం మరియు లిపి - వేదాలు - ఇతిహాసాలు - జాతక కథలు - తమిళంలో సంగమ సాహిత్యం.
3. శిల్పం మరియు కట్టడాలు - హరప్పా నగరాలు - బౌద్ధస్థూపాలు మరియు విహారాలు - రాతిని తొలిచిన చైత్యాలు.
4. రాజులు మరియు కట్టడాలు - సాంకేతిక నైపుణ్యాలు మరియు నిర్మాణాలు (దేవాలయాలు, మసీదులు సమాధులు, కోటలు మరియు చెరువులు) - దేవాలయాల ధ్వంసం - విజయనగర రాజుల నిర్మాణశైలి.
5. కళల ప్రదర్శన - సినిమా మరియు ముద్రణ మాధ్యమాలు - సినిమా ఆవిర్భావం - సమాజంపై సినిమా ప్రభావం సాంస్కృతిక చైతన్యం మరియు స్వాతంత్ర్యోద్యమ కాలంలో వార్తాపత్రికల పాత్ర.
6. జాతీయత మరియు దేశ ఆర్థికాభివృద్ధిలో ఆటల ప్రభావం.
7. సాంస్కృతిక చైతన్యంలో ముద్రణా మాధ్యమాల (పత్రికా రంగ) పాత్ర.

పెడగాజీ (అభ్యసన శాస్త్రం)/ మెథడాలజీ

(మార్కులు : 12)

- సాంఘిక శాస్త్ర అభ్యసన ఉద్దేశాలు మరియు లక్ష్యాలు - సాంఘిక శాస్త్ర బోధన ద్వారా విలువలు - అభ్యసన లక్ష్యాలు మరియు పటాలు - నిర్మాణాత్మక ఉపగమన కోణంలో అభ్యసన లక్ష్యాలు - విద్యా ప్రమాణాలు.

2. పాఠశాల విద్యాప్రణాళిక, సాంఘిక శాస్త్రంలో వనరులు - జాతీయ విద్యా ప్రణాళిక చట్రం - 2005 (ఎన్‌సీఎఫ్-2005) - ఆర్‌టీఈ -2009, ఎన్‌సీఎఫ్ - 2011 - పాఠ్య ప్రణాళిక - అభ్యసన వనరులు.
3. సాంఘిక శాస్త్రాలు ఒక సమైక్యతా అధ్యయనం : భావనలు మరియు సంబంధితాలు - సామాన్య శాస్త్రం. సామాన్య శాస్త్రాలకు మధ్య భేదాలు - సాంఘిక శాస్త్రం మరియు సాంఘిక శాస్త్రాలు - సాంఘిక శాస్త్ర మేధావుల ఆవిష్కారాలు, సేవలు.
4. సాంఘిక శాస్త్ర అభ్యసన ఉపగమాలు మరియు వ్యూహాలు - భాగస్వామ్య అభ్యసన ఉపగమనం (కొలాబరేటివ్ లెర్నింగ్ అప్రోచ్) - 5 ఈ అభ్యసన నమూనా - సమస్యా పరిష్కార పద్ధతి - కాన్సెప్ట్ మాపింగ్.
5. సామాజిక వనరులు మరియు సాంఘిక శాస్త్ర ప్రయోగశాల.
6. సాంఘిక శాస్త్ర అభ్యసన మూల్యాంకన పరికరాలు మరియు సాంకేతికాలు.
7. మూల్యాంకనం - సీసీఈ - మూల్యాంకన చట్రం - విద్యార్థుల యొక్క ప్రత్యేక అవసరాన్ని అభ్యాసన ద్వారా మూల్యాంకనం.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్‌లో 80 జేఆర్ఎఫ్‌లు



న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసీహెచ్ఆర్).. 2018-19 సంవత్సరానికి గాను 80 జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)-80.

వ్యవధి : రెండేళ్లు.

ఫెలోషిప్: రూ.17,600. దీంతోపాటు ఏడాదికి కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.16,500 ఇస్తారు.

అర్హతలు: హిస్టరీ/ హిస్టరీ అనుబంధ సబ్జెక్టుల్లో ఏదైనా యూనివర్సిటీలో పీహెచ్‌డీకి రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు అర్హులు.

ఎంపిక: ప్రవేశ పరీక్ష (ఎంట్రెన్స్ టెస్ట్).

ప్రవేశ పరీక్ష విధానం: ఇందులో ఎ, బి, సి అనే మూడు విభాగాలు ఉంటాయి. 'ఎ' విభాగం నుంచి 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి 1 మార్కు చొప్పున మొత్తం మార్కులు 30. 'బి' విభాగం నుంచి 12 షార్ట్ ఎస్సే ప్రశ్నలు ఇస్తారు. ఇందులో ఏవైనా 6 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ప్రతి ప్రశ్నకు 5 మార్కుల చొప్పున ఈ విభాగం గరిష్ఠ మార్కులు 30. 'సి' విభాగం నుంచి 6 లాంగ్ ఎస్సే ప్రశ్నలు ఇస్తారు. వీటిలో నుంచి ఏవైనా రెండు ప్రశ్నలు ఎంచుకొని ఒక్కోదానికి 500 పదాలకు తగ్గకుండా సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు 20 మార్కుల చొప్పున ఈ విభాగం గరిష్ఠ మార్కులు 40. మొత్తం పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు.

పరీక్ష కేంద్రాలు : న్యూఢిల్లీ, బెంగళూరు, గువాహటి, పుణె.

దరఖాస్తు రుసుం: రూ.200; ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు తదితర అవసరమైన వాటిని జతచేసి 'మెంబర్ సెక్రటరీ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రీసెర్చ్, నెం.35, ఫిరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ-110001' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 14, 2018.

దరఖాస్తు హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : జనవరి 24, 2018.

వెబ్‌సైట్ : www.ichr.ac.in

విశాలాంధ్ర బిజినెస్

198.94 ▲	64.75 ▲	◀◀	1000 ▼	డాలరు	ముడి ▼
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	Vs	చమురు
34,352.79	10,623.60	28,250	40,000	రూపాయి	67.62
		22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	63.41	బ్రెంట్ ధర (డాలర్లలో..)

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోల్ ఇండియా	290.40	3.10
సన్ ఫార్మా	604.50	2.20
ఇన్ఫోసిస్	1,038.80	2.07
లార్సెన్	1,345.50	1.64
హీరో మోటోకార్ప్	3,800.00	1.27

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
భారతి ఎయిర్‌టెల్	535.00	-4.42
అదానీ పోర్ట్స్	428.40	-0.54
బీహెచ్ఈఎల్	104.40	-0.44
ఓఎన్‌జీసీ	199.75	-0.35
ఎస్‌బీఐ	309.30	-0.23

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.36	63.41
యూరో	76.24	76.03
పౌండ్	86.00	85.79
ఆస్ట్రేలియా డాలర్	49.81	49.68
సింగపూర్ డాలర్	47.79	47.63

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,200	30,160
చెన్నై	28,200	30,160
బెంగళూరు	27,600	29,519
ముంబై	28,970	30,984
విజయవాడ	28,250	30,500

నూతన ఏడాదిలో బుల్ పరుగులు



- సరికొత్త గరిష్టాలను నమోదు చేసిన సూచీలు
- సెన్సెక్స్ 211, నిఫ్టీ 10,672 పాయింట్ల నమోదు
- అత్యధిక లాభాల్లో ఫార్మా, ఐటీ, బ్యాంకింగ్ రంగాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన సంవత్సరంలో సరికొత్త గరిష్టాలకు చేరాయి. బిఎస్ఇ ఇండెక్స్ జీవన కాల పరిమితులను దాటి 211.54 పాయింట్ల లాభం 0.62 శాతంతో 34,374.85 పాయింట్లు నమోదు చేసింది. నిఫ్టీ ఏకంగా 10వేల మార్కును దాటి 69 పాయింట్ల లాభంతో 0.65 శాతంతో 10,627.40 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రి బడ్జెట్ సెషన్ ముందు సూచీలు ఇంతె త్తుకు ఎదగడానికి ప్రధానంగా కార్పొరేట్ సంస్థల ఫలి తాలు వెలువడనుండటమే.... ఆసియా మార్కెట్ల సాను కూల ప్రభావం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర చినట్లు తెలుస్తోంది. దీనితో సూచీలు ఆద్యంతం లాభాల బాటలో పయనించాయి. ఈ వారంలో ప్రకటించనున్న మూడో త్రైమాసిక ఫలితాలపై మదుపరులు మరింత ఆశావాహంగా ఉండటంతో పెట్టుబడులు భారీగా వెల్లు వెత్తినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది సెన్సెక్స్ ఇప్పటివరకు 1.6శాతంతో 540 పాయింట్లును లాభాలను నమోదు చేసింది. నిఫ్టీ 177పాయింట్లు ఎదిగి 1.7శాతం నమోదు చేసింది. బిఎస్‌బి మిడ్‌కాప్, స్మాల్ కాప్ సూచీలు 156,136 పాయింట్లు లాభాన్ని నమోదు చేశాయి. బిఎస్ సెక్టరల్ సూచీల్లో 19ఫార్మా, బ్యాంకింగ్ స్టాక్స్ 292, 201 లాభాలను నమోదు చేసాయి. ఫార్మా స్టాక్స్‌లో ఎన్ఎమ్ఎస్ ఫార్మా (8.23 శాతం), వర్క్‌హార్డ్ ఫార్మా(7.16 శాతం), కోప్రాన్ 5.59 శాతంతో బిఎస్ఇ హెల్త్‌కేర్ సూచీలు అత్యధిక లబ్దిదారులుగా లాభాలను నమోదు చేశాయి. బ్యాంకు నిఫ్టీ 136 పాయింట్లు పెరిగి 25,728 వద్ద ముగిసింది. నిఫ్టీ 50స్టాక్స్‌లో 45 గ్రీన్‌లో ట్రేడయ్యాయి.

అతిపెద్ద లబ్దిదారులుగా:

సెన్సెక్స్ 28స్టాక్స్ గ్రీన్‌లో నమోదుకాగా భారతి ఎయిర్ టెల్ 2.78 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.32శాతంతో నష్టాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా 3.16 శాతం, యస్ బ్యాంకు 1.61 శాతం, ఎల్ అండ్ టి 1.19శాతం సెన్సెక్స్‌టాప్ గెయినర్స్‌గా నమోదయ్యాయి. జిందాల్‌స్టీల్ 8.61శాతం, రియల్ ఎస్టేట్ డెవలపర్స్ సోభా లిమిటెడ్ 14.8 శాతం పెరిగింది, వాక్‌హార్డ్స్ ఫార్మా 6.20 శాతంతో బిఎస్ అత్యధిక లబ్దిదారులుగా నమోదయ్యాయి. భారతి ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్సు, ఎస్‌బీఐ, టాటా స్టీల్, ఓఎన్‌జిసి నష్టాల్లో నమోదయ్యాయి. మార్కెట్ ఆద్యంతం సానుకూలంగా 1,633 స్టాక్స్ లాభాల్లో ముగియగా, 580 నష్టాల్లో నమోదయ్యాయి. టెక్ మహీంద్రా 52వారాల గరిష్టానికి చేరి 538.80 వద్ద ముగిసింది. జీడీపీ పెరుగుదలపై ప్రతికూలత నమోదు అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, ప్రి బడ్జెట్ ర్యాలీ నేపధ్యంలో మదుపరులలో మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసినట్లు తారస్ అస్సెట్ మేనేజిమెంట్ ఎండి ఆర్‌కె గుప్తా వెల్లడించారు.

గరిష్టానికి చేరిన రూపాయి:

డాలర్‌తో రూపాయి మారకపు విలు 63.2450 వద్ద నమోదైంది. 2015 ఏప్రిల్ అనంతరం రూపాయి అత్యధికంగా నమోదైంది. శుక్రవారం 63.3750 వద్ద ముగిసిన రూపాయి సోమవారం 63.3550 వద్ద నమోదైంది.

జీడీపీ వృద్ధి అంచనా :

వచ్చేనెల జరగనున్న ఫెడరల్ బడ్జెట్ సమావేశంలో విడుదల చేయనున్న జీడీపీ వృద్ధిరేటు ముందుగా అనుకున్నట్లు 7.5 శాతం కాక 6.5 శాతానికి పరిమిత మవుతున్నట్లు అంచనా. గత త్రైమాసికం కన్నా ఈ త్రైమాసి కంలో ఫలితాలు మరింత మెరుగవ్వచ్చని తెలుస్తోంది. ఆర్థిక, ఐటి రంగానికి చెందిన స్టాక్స్ లాభాల్లో నమోదుకాగా, ఇన్ఫోసిస్ లిమిటెడ్, ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడ్ మరింత ఊతం కల్పించాయి. శుక్రవారం ప్రకటించనున్న ఇన్ఫోసిస్ డిసెంబర్ క్వార్టర్ పలితాల నేపధ్యంలో షేర్లు 1.8శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.2 శాతానికి పెరిగాయి. విదేశీ మదుపరులు రూ.581.43 కోట్ల షేర్లను అమ్మగా, దేశీయ మదు పరులు రూ.243.13 కోట్ల ఈక్విటీలను అమ్మినట్లు గణాంకాలు వెల్లడించాయి.







CAT
(Indian Institute of Management)

2017 క్యాట్ ఫలితాల వెల్లడి

20 మందికి 100 శాతం మార్కులు

న్యూఢిల్లీ : ఇండియన్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (ఐఐఎం) కోర్సుల్లో ప్రవేశించేందుకు నిర్వహించే క్యాట్ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 20 మందికి 100 శాతం మార్కులు లభించాయి. 1,99,000 మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. గతేడాదిలా ఈ ఏడాదికూడా వందపర్సెంటైల్ పొందినవారు 20 మంది ఉన్నప్పటికీ వారి ప్రొఫైల్స్ మాత్రం భిన్నంగా ఉన్నాయి. గతేడాది టాప్ 20 అభ్యర్థులు పురుష ఇంజనీరింగ్ విద్యార్థులు కాగ, ఈ ఏడాది ఇద్దరు మహిళా అభ్యర్థులు, ముగ్గురు నాన్ ఇంజనీర్లు ఉన్నారని లక్నో ఐఐఎం కోఆర్డినేటర్ ఈమెయిల్‌లో తెలిపారు. దేశంలోని 140 పట్టణాల నుంచి దాదాపు 2 లక్షల మంది క్యాట్‌కు హాజరయ్యారు. ఈ ప్రవేశపరీక్షను రెండు షిఫ్టుల్లో నవంబరు 26న నిర్వహించారు. మూడేళ్లలో పోల్చితే 2017లో అధికంగా అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రాత సామర్థ్యం,బృందచర్చలు, వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. క్యాట్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు మార్కులను డౌన్‌లోడ్ చేసుకొని, వారి పర్సెంటైల్‌ను దేశంలోని 20 ఐఐఎంలు, మరో 100 పేరుగాంచిన సంస్థలకు పంపాల్సి ఉంది. ఈ ఏడాది 4 వేలమందికి ఐఐఎంల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఐఐఎం లక్నో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తుంది.

ప్రగతి పథంలో పతంగుల పరిశ్రమ

- గుజరాత్‌లో 48 వేల మందికి ఉపాధి
- ఈ ఏడాది 2.5 శాతం పెరుగనున్న వృద్ధి



అహ్మదాబాద్: గుజరాత్‌లోని పతంగుల తయారీ పరిశ్రమ ప్రగతి పథంలో దూసుకెళ్తున్నది. 48 వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.5 శాతం ఎక్కువ వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయని ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌జే హైదార్ అహ్మదాబాద్‌లో విలేకరులకు తెలిపారు. గుజరాత్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ (అంతర్జాతీయ పతంగుల ఉత్సవం)కు ప్రజాదరణ విపరీతంగా పెరుగుతుండటంతో రాష్ట్రంలో పతంగుల తయారీ పరిశ్రమ కూడా స్థిరమైన వృద్ధితో ముందుకు సాగుతున్నదని ఆయన చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పరిశ్రమ రూ.625 కోట్ల నుంచి రూ.630 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తుందని అంచనా వేస్తున్నామని, గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఇది 2.5 శాతం అధికమని ఆయన వివరించారు. 2015-16లో రూ.572 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన గుజరాత్ పతంగుల తయారీ పరిశ్రమ 2016-17లో 7.5 శాతం వృద్ధితో రూ.615 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, అయితే దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలుతో తలెత్తిన ఇబ్బందుల వలన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని, ఏది ఏమైనప్పటికీ త్వరలోనే పరిస్థితులు చక్కబడి వృద్ధిరేటు పరిమాణం మళ్లీ పెరుగుతుందని భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఇదిలావుంటే, ఈ ఏడాది గుజరాత్‌లో నిర్వహిస్తున్న 29వ అంతర్జాతీయ పతంగుల ఉత్సవాన్ని తిలకించేందుకు ఆదివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ సందర్శకులను అనుమతించనున్నారు. ఈ ఉత్సవాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ ఓపీ కోహ్లీ, ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ రూపానీ మాట్లాడుతూ.. గుజరాత్ కైట్ ఫెస్టివల్‌కు అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రజాదరణ లభిస్తున్నదని, రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదం చేస్తున్నదని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రొమ్ము క్యాన్సర్‌కు ఉచిత చికిత్స

ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే ప్రైవేటు బిల్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వాస్పత్రుల్లో రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలకు ఉచిత చికిత్స ఏర్పాటుకు ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే ఒక ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రతిపాదించారు. ఇటీవల ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాలలో రొమ్ము క్యాన్సర్ (అవగాహన, ఉచిత చికిత్స) బిల్లు-2017ను ప్రవేశపెట్టారు. కానీ దానిని ఇంకా పరిగణనలోకి తీసుకోలేదు. రొమ్ము క్యాన్సర్ చికిత్స, లక్షణాలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిల్లు అభ్యర్థిస్తోంది.

'రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత వైద్య పరీక్షలు ఏర్పాటు చేస్తాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రతి రొమ్ము క్యాన్సర్ రోగికి ఉచిత వైద్య చికిత్సలు అందించాలి' అని బిల్లు పేర్కొంది. 28 మంది మహిళల్లో ఒకరికి వారి జీవిత కాలంలో రొమ్ము క్యాన్సర్ వస్తుందని ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలకు రోగ నిర్ధారణ, చికిత్సలను ఉచితంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.


విజ్ఞానం



కేన్సర్ చికిత్సకు రియో వైరస్...

కేన్సర్ కణితులపై దాడి చేసేం దుకు వైరస్‌ను అస్త్రం గా చేసుకో వడంతో ఈ వైరస్ కేన్సర్ కణాలపై రోరాదేలా రోగ నిరోధక వ్యవస్థను చైతన్యవంత చేస్తాయని తెలుస్తోంది. రియో వైరస్ అనే ఈ వైరస్ సహజమైంది. నిరపాయకరమైంది కూడా.... కేన్సర్ కణాల్లోకి ఇది సులువుగా చొచ్చుకుపోయే స్వభావంకలదికూడా.... నని యుకె శాస్త్రవేత్తలు వెల్లడించారు. కాన్సర్ కణితులను శస్త్రచికిత్స ద్వారా తొలగించేందుకు ముందే ఈ ప్రక్రియ చేయడంతో....శాస్త్రవేత్తలకు ఈ కణితులను పరిశీలించే అవకాశం ఏర్పడింది. అన్ని కణాల్లోనూ ఈ వైరస్ ఉన్నట్లు స్పష్టం కావడంతో వైరస్‌ల ద్వారా మెదడు కణితుల్లోకి కూడా మందులు చేర్చవచ్చునని అంచనా..అంతే కాకుండా ఈ వైరస్ కేన్సర్ కణాల్లోకి మాత్రమే చేరగలదు కాబట్టి రోగ నిరోధక వ్యవస్థ వాటిని గుర్తించి నాశనం చేస్తాయని...సాధారణ పరిస్థితుల్లో అయితే ఇది సాధ్యంకాదని శాస్త్రవేత్తలు వివరించారు. ప్రస్తుతం అమలులో ఉన్న కీమో,రేడియోథెరపీలకు అనుబంధంగా ఈ రియో వైరస్‌ను ఎక్కించడం దాద్రా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని తెలుస్తోంది. శరీరంలో మిగిలిన కేన్సర్ కణాలనుకూడా తుద ముట్టించవచ్చునని వెల్లడించారు.

కొత్త బ్యాటరీలతో మరింత శక్తి...



స్మార్ట్ ఫోన్లతో పాటు విద్యుత్తుతోనడిచే కార్లలో కూడా ఎక్కువ మంది వాడే లిథియం ఆయాన్ బ్యాటరీల సామర్థ్యం అంతంత మాత్రంగానే ఉంది. అమెరికాలోని ఆర్గాన్ నేషనల్ లేబొరేటరీ శాస్త్రవేత్తలు త్వరలోనే ఈ పరిస్థితికి చరమాంకం పలకనున్నారు. లిథియం అయాన్ స్థానంలో లిథియం ఐరన్ ఆక్సైడ్‌న వాడటంతో ఎక్కువ మోతాదులో ఎక్కువ సమయం విద్యుత్తును నిల్వచేసుకోగల బ్యాటరీలను తయారు చేయవచ్చునని వీరునిరూపించారు. పరిశోధనలో భాగంగా వీరు నేరుగా నమూనా బ్యాటరీని తయారుచేయలేదు. కంప్యూటర్ సాయంతో లిథియం, ఐరన్‌ఆక్సైడ్‌ల నిష్పత్తిపై సిములేషన్లు నడిపించారు. బ్యాటరీల్లో ఐరన్ వాడేందుకు ఇప్పటివరకు జరిగినఅనేక ప్రయోగాలు విఫలం కావడం దీనికి కారణం. ఈ నూతన బ్యాటరీలు సాధారణ స్మార్ట్ ఫోన్ల బ్యాటరీలకంటే ఎనిమిది రెట్లుఎక్కువ కాలం విద్యుత్తును సరఫరా చేయగలవంటే వీటిని ఎలక్ట్రిక్‌కార్లలో వాడటం ద్వారా వాహనాలకు మైలేజి పెరుగుతుందని తెలుస్తోంది.



ఆన్‌లైన్‌లో పతంజలి వ్యాపార విస్తరణ

ఎనిమిది ఈ-కామర్స్ సంస్థలతో ఈ నెలలోనే ఒప్పందాలు

న్యూఢిల్లీ: ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలోని పతంజలి ఆయుర్వేద సంస్థ ఆన్‌లైన్‌లో తమ వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నది. ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్) రంగంలో అనేక రకాల స్వదేశీ ఉత్పత్తులను అమ్ముతున్న పతంజలి ఈ ప్రణాళికలో భాగంగా ఎనిమిది ప్రఖ్యాత ఈ-కామర్స్ సంస్థలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకోనున్నది. హరిద్వార్ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ అమెజాన్, పేటీఎం మాల్, 1ఎంజీ, బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్, స్నాప్‌డీల్ తదితర ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ వ్యాపార సంస్థలతో ఈ నెలలోనే ఒప్పందాలను కుదుర్చుకునే అవకాశం ఉందని, దీంతో తాము అమ్ముతున్న వివిధ రకాల ఉత్పత్తులు ఇకమీదట ఆన్‌లైన్‌లో కూడా వినియోగదారులకు లభ్యమవుతాయని పతంజలి కంపెనీ అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. ఆన్‌లైన్‌లో వ్యాపారాన్ని విస్తరించాలన్న ప్రణాళికలో భాగంగా పతంజలి ఈ నెల 16న న్యూఢిల్లీలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. రామ్‌దేవ్‌తో పాటు పతంజలి మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ పాల్గొనే ఈ కార్యక్రమానికి అన్ని ఆన్‌లైన్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని ఆ సంస్థ భావిస్తున్నది. మా వ్యాపారాన్ని భారీ స్థాయిలో విస్తరించబోతున్నాం. ఇందులో భాగంగా మా ఉత్పత్తులన్నింటినీ ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చేందుకు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకోబోతున్నాం. ఈ ప్రక్రియ పూర్తయితే మా ఉత్పత్తులు అట్టడుగు స్థాయి వినియోగదారులకు సైతం చేరువవుతాయి అని పతంజలి సంస్థ అధికార ప్రతినిధి ఎస్‌కే తిజారావాలా స్పష్టం చేశారు.

గుప్తా నామినేషన్‌పై

కాంగ్రెస్ పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ : రాజ్యసభకు సంబంధించి ఆప్ అభ్యర్థి ఎన్‌డీ గుప్తా నామినేషన్‌ను తిరస్కరించాని కోరుతూ ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ మాకెన్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఎన్నికల అధికారులు సోమవారం తోసిపుచ్చారు. గుప్తా లాభదాయక పదవులు నిర్వహిస్తున్నారని మాకెన్ ఆరోపించారు. లాభదాయక పదవులకు సంబంధించిన కేసు పరిష్కారమైందని, నారాయణ్ దాస్ గుప్తా నామి నేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆమోదించారని ఢిల్లీ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం (సీఈఓ) తెలిపింది. గుప్తా ఇప్పటికీ నేషనల్ పెన్షన్ సిస్టమ్ ట్రస్టు ట్రస్టీగా లాభదాయక పదవిలో కొనసాగుతున్నారని మాకెన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మార్చి 30న గుప్తాను ఆ పదవికి నియమించారని తెలిపారు. ట్రస్టుకు సంబం ధించిన రోజువారీ పనివిధానం, నిర్వహణ, పాలన, నియమనిబంధనలన్నీ పరిశీలించిన తర్వాత గుప్తా నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆమోదించారు. మాకెన్ ఫిర్యాదు చేసిన విధంగా గుప్తాకు ఆ ట్రస్ట్‌తో సంబంధం లేదని, అందువల్ల ఆయన నామినేషన్‌ను అంగీకరిస్తున్నట్లు ఎన్నికల అధికారులు తేల్చిచెప్పారు. ఆడిట్ కమిటీ ఆఫ్ ది నేషనల్ పెన్షన్ సిస్టమ్ ట్రస్టు చైర్మన్‌గా పనిచేస్తున్నారన్న మాకెన్ ఆరోపణను గుప్తా కొట్టిపారేశారు. తప్పుడు ఆరోపణలతో రాజకీయ ప్రచారం పొందడానికి మాకెన్ ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆప్ నాయకులు ఇంతకుముందు చెప్పారు. గత ఏడాది మార్చి 30న తనను ట్రస్ట్ చైర్మన్‌గా నియమించారని, అయితే, డిసెంబరు 29న ఆ పదవికి తాను రాజీనామా చేశానని గుప్తా వివరించారు.

మొండి బకాయిలను వసూలులో

చిన్న బ్యాంకులే నయం

న్యూఢిల్లీ: నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) సమస్యను పరిష్కరించుకోవడం ద్వారా మొండి బకాయిలను రాబట్టుకునేందుకు ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)ని ఆశ్రయించి, దివాలా చట్టం కింద చర్యలు చేపట్టడంలో పెద్ద బ్యాంకుల కంటే చిన్న బ్యాంకులే ముందంజలో ఉన్నాయి. ఈ జాబితాలోని పెద్ద బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) అగ్రస్థానంలో నిలువగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) లాంటి మిగిలిన పెద్ద బ్యాంకుల కంటే యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, దేనా బ్యాంక్ లాంటి చిన్న బ్యాంకులే ఎన్‌సీఎల్‌టీకి ఎక్కువ కేసులను నివేదించడం విశేషం. అయితే ఇటువంటి కేసుల విలువ పరంగా చూస్తే ఈ జాబితాలో ఎస్‌బీఐ అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి ఈ బ్యాంకు దాదాపు రూ.34,100 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 18 కేసులను ప్రారంభించింది. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి దివాలా చట్టం కింద చర్యలు ప్రారంభమైన మొత్తం కేసుల సంఖ్య 330 గానూ, వాటి మొత్తం ఆస్తుల విలువ రూ.1.07,000 కోట్లు గానూ ఉన్నట్లు ప్రముఖ జాతీయ పత్రిక స్పష్టం చేసింది. సమాచార హక్కు (ఆర్‌టీఐ) ద్వారా రాబట్టిన సమాధానాలను ఆధారంగా చేసుకుని ఈ వివరాలను



వెల్లడించిన ఆ పత్రిక.. ఇటువంటి కేసులు ఇంకా ఎన్నో ఉండవచ్చని పేర్కొన్నది. ఆర్‌టీఐ కింద తాము అడిగిన సమాచారాన్ని 17 బ్యాంకులు ఇచ్చాయని, అయితే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ ఈ సమాచారాన్ని అందజేసేందుకు నిరాకరించాయని ఆ పత్రిక తెలిపింది. అలాగే బ్యాంకుల వారీగా అడిగిన ఈ సమాచారం తమ వద్ద లేవని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) పేర్కొంటూ, ఆ వివరాలను అందజేయాల్సిందిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు సూచించిందని, అయితే ఆ వివరాలను ఎన్‌సీఎల్‌టీ ఇప్పటివరకూ అందజేయలేదని ఆ పత్రిక వివరించింది. రూ.46,300 కోట్ల విలువైన 5.30 లక్షల నిరర్థక ఆస్తుల ఖాతాలను కలిగివున్న బ్యాంక్ ఆఫ్ బరోడా గత ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి వీటిలో 55 కేసులను ఎన్‌సీఎల్‌టీకి నివేదించిందని, ఈ కేసులకు సంబంధించిన మొత్తం మొండి బకాయిలు రూ.12,294 కోట్లుగా ఉన్నాయని ఆ పత్రిక వెల్లడించింది. అలాగే రూ.52,000 కోట్ల నిరర్థక ఆస్తులను కలిగివున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.14,856 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 51 కేసులను, యూకో బ్యాంక్ రూ.7,265 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 30 కేసులను, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.3,400 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 23 కేసులను, దేనా బ్యాంక్ రూ.3,400 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 23 కేసులను, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ.5,296 కోట్ల మొండి బకాయిలకు సంబంధించిన 28 కేసులను, ఆంధ్రా బ్యాంకు రూ.5,766 కోట్ల నిరర్థక ఆస్తులకు సంబంధించిన కేసులను, కెనరా బ్యాంక్ ఒకే ఒక్క కేసును ఎన్‌సీఎల్‌టీకి నివేదించాయని ఆ పత్రిక వివరించింది.

ఎస్‌బీఐ ఖాతాలే ఎక్కువ.. తర్వాతి స్థానాల్లో పీఎన్‌బీ, కెనరా

దేశంలోని పలు కార్పొరేట్ సంస్థలతో పాటు బడా వ్యాపార,

ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడంలో పెద్ద బ్యాంకుల వెనుకంజ

పారిశ్రామికవేత్తలు బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలను ఎగవేస్తుండటంతో వాటిలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) గణనీయంగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ రంగంలోని 21 బ్యాంకులకు రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో రుణాలను ఎగ్గొట్టిన సంస్థలు 1,463 వరకు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో అతిపెద్దదైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్) ముగిసే నాటికి ఎస్‌బీఐలో ఇటువంటి ఖాతాలు 265 ఉండటంతో ఆ మొండి బకాయిలు రూ.77,538 కోట్లకు చేరాయి. ఈ జాబితాలో ఎస్‌బీఐ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ద్వితీయ స్థానంలో నిలిచింది. పీఎన్‌బీకి రూ.100 కోట్ల కంటే ఎక్కువ మొత్తంలో రుణాలను ఎగ్గొట్టిన ఖాతాలు 143 ఉండటంతో ఆ మొండి బకాయిలు రూ.45,973 కోట్లకు పెరిగాయి. పీఎన్‌బీ తర్వాత ఈ జాబితాలో కెనరా బ్యాంకు తృతీయ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ రంగంలోని చిన్న బ్యాంకుల జాబితాలో యూనియన్ బ్యాంకు ఇటువంటి 79 ఖాతాలతో అగ్రస్థానంలో నిలువగా, రూ.100 కోట్ల కంటే ఎక్కువ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టిన ఖాతాలు ఓరియంటల్ బ్యాంక్‌లో 68, యూకో బ్యాంక్‌లో 62 ఉన్నట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇటువంటి ఖాతాల సంఖ్య నానాటికీ పెరుగుతుండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికం చివరి నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు రూ.7.34 లక్షల కోట్లకు చేరుకున్న విషయం తెలిసిందే.



చాక్లెట్

పిల్లలు పెద్దలు అన్న భేదం లేకుండా అందరూ చాలా సందర్భాల్లో ఇష్టంగా తినేది చాక్లెట్. కొకా మొక్కల నుండి తీసిన పదార్థంతో చాక్లెట్లను తయారుచేస్తారు. తొలుత క్రీపూ.1500-400 సంవత్సరాల మధ్యకాలంలో బల్మిక్ ఇండియన్స్ పెరట్లో కొకా మొక్కలను పెంచినట్లు చరిత్ర తెలుపుతోంది. క్రీ.శ.250-900 సంవత్సరాల మధ్య మయన్ సంపన్నవర్గాలకే కొకాగింజల నుండి త్రాగే పానీయం పరిమితం చేయబడింది.

1502లో కొలంబస్ మయన్‌లోని గుఆంజాలో కానొయ్‌కి ఓడలో కొకా గింజలను తీసుకువెళ్లినట్లు చరిత్రకారులు చెబుతారు. 1519లో చక్రవర్తి మోంటిజుమా ఆధ్వర్యంలోని న్యాయస్థానం కొకా వాడినందుకు స్పానిష్‌కు చెందిన హెర్నాండో కార్టెజ్‌కి శిక్ష విధించింది. 1544లో క్రిక్‌చి మయన్ ప్రముఖుల సందర్శనార్థమై వచ్చిన స్పెయిన్‌రాజు ఫిలిప్‌కు మయన్‌లు జాడీలతో కొకా గింజల పొడిని, వెంటనే కలుపుకుని త్రాగేందుకు వీలుగా వుండేలా బహుమతిగా ఇచ్చారు. 16వ శతాబ్దంలో స్పానిష్ తొలిసారిగా చక్కెరను ఇతర సుగంధద్రవ్యాలను వనీల్లాను కలుపుకుని తీపికొకాను తయారుచేయడం ప్రారంభించింది. 1570లో కొకాను చాలామంది మందుగా, వీర్యవృద్ధికి వాడేవారు. అలాగే 1585లో మొదటిసారిగా కొకా గింజలను మెక్సికోలోని విరాక్రాజ్ నుండి సెవిల్లికి రవాణా చేయడం ప్రారంభమయింది.

1819లో ఫ్రాంకిస్ లూయిస్ కల్లిర్ మొదటి స్విస్ చాక్లెట్ ఫ్యాక్టరీని ప్రారంభించాడు. 1847 సంవత్సరంలో కొకా, వెన్న, పంచదారను కలిపి పేస్ట్‌లా తయారుచేసి పోతపోసి జోసెఫ్ ఫ్రై అండ్ సన్‌వారు ఇప్పటి ఆధునిక చాకొలెట్ బార్‌కు రూపకల్పన చేశారు. 1849 సంవత్సరంలో జోసెఫ్ ఫ్రై అండ్ సన్ క్యాడ్‌బరీ బ్రదర్స్ కలిసి ఇంగ్లాండ్, బెర్మిన్‌గ్రామ్‌లోని బింజిలిహాల్‌లో చాక్లెట్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశారు. 1861 సంవత్సరంలో రిచర్డ్ క్యాడ్‌బరీ వాలెంటైన్స్ డే సందర్భంగా మొదటిసారిగా హృదయం ఆకారంలో కాండిబాక్స్‌ను తయారుచేశాడు. అలాగే 1868లో జాన్ క్యాడ్‌బరీ చాక్లెట్ కాండిస్ సాధారణ మార్కెట్‌లోకి విడుదల చేశాడు. 1876సం॥లో స్విట్జర్లాండ్‌లోని వివీకి చెందిన దానియల్ పీటర్ 8 సం॥రాల పరిశోధన అనంతరం 'మిల్క్ చాక్లెట్'ను తయారుచేయగా, రెండు సంవత్సరాల అనంతరం 1879లో దానియల్ పీటర్, హెన్రి నెస్టిల్‌లు కలిసి 'నెస్టిల్ కంపెనీ' ఏర్పాటుచేశారు. 1879లో స్విట్జర్లాండ్‌లోని బెర్నికి చెందిన రొడాలోఫి లిండ్ నాలుకపై పెట్టుకుంటే కరిగిపోయేలా మెత్తగా, క్రీమ్‌గావుండే చాక్లెట్‌ను రూపొందించాడు. దీనికై 'కొంచింగ్' మిషన్‌ను ఉపయోగించాడు. ఈ పద్ధతిలో వేడిచేసి గుండ్రని ఆకారంలో చాక్లెట్‌ను తయారుచేస్తారు. 72 గంటల తర్వాత వెన్న, ఇతర తినే క్రీమ్‌లను దానికి కలిపి పూర్తిస్థాయి చాక్లెట్‌ను తయారుచేస్తారు.




1910లో ఆర్థర్ గాంగ్ అనే కెనడియన్ మొట్టమొదటి 'నికెల్ చాక్లెట్‌బార్'ను తయారుచేశాడు. 1913లో స్విస్‌లోని మోంట్రిక్స్‌కు చెందిన జూలిస్ సెర్చడ్ మిషన్లపై చాక్లెట్లను పూర్తిస్థాయిలోతయారుచేయడం ప్రారంభించాడు. 1926లో జోసెఫ్ డ్రాప్స్ అనే బెల్జియన్ అమెరికా మార్కెట్‌లో అప్పటికే వున్న పోటీదారులకు ధీటుగా 'గొడివా కంపెనీ' పేరుతో చాక్లెట్లను విజయవంతంగా మార్కెట్ చేశాడు. ఇప్పుడు మార్కెట్‌లో వున్న రకాల గురించి ఇక చెప్పనక్కరలేదు కదా! ఇదీ చాక్లెట్ కథ!



1657లో లండన్‌లో ఫ్రెంచ్ దేశస్థుడు ఒకరు మొదటిసారిగా చాక్లెట్‌హౌస్‌ను ప్రారంభించాడు. దీన్ని కాఫీమిల్, టొబాకొ రోల్‌గా పిలిచేవారు. 1674లో గట్టిగా వుండే తినే చాక్లెట్‌ను తయారుచేశారు. దీనితో పాటు గుండ్రని చాక్లెట్లు, కేక్‌లను, చాక్లెట్ ఎంపోరియంలో తయారుచేసేవారు. 1732లో ఫ్రెంచికి చెందిన మోన్సియుర్ డుబైస్సన్ చాక్లెట్ మెత్తగా తయారీకి టేబుల్‌మిల్‌ను రూపొందించాడు. 1753లో స్వీడన్ దేశానికి చెందిన పర్యావరణ వేత్త కరొలస్ లిన్నాయిస్ 'కొకా' అన్న పదంపై అసంతృప్తి వ్యక్తంచేసి దాని బదులుగా 'థియోబ్రొమా' అని పేరుపెట్టాడు. అంటే 'దేవుని ఆహారం' అని అని అర్థం. 1765 సంవత్సరంలో వెస్టిండీస్‌నుండి మస్సాచుట్స్ డొర్చెస్టర్‌లకు కొకాగింజలను దిగుమతి చేసుకుని అమెరికాలో మొదటిసారిగా చాక్లెట్‌ను పరిచయం చేశాడు ఐరిష్‌కు చెందిన చాక్లెట్ల తయారీదారుడు జాన్ హనన్. ఇతనికి అమెరికాకు చెందిన డా॥ జేమ్స్ బేకర్ సహాయంచేశాడు. ఆ తర్వాత వారిరువురు1780లో మొదటి అమెరికా చాక్లెట్ మిల్ 'బేకర్స్ చాక్లెట్' ఏర్పాటుచేశారు.







కొన్ని విశేషాలు..

మన సౌరకుటుంబానికి ఆవల, సుదూరంగా వున్న మరో సౌరకుటుంబానికి చెందిన గ్రహంపై వాతావరణం వుందని, ఆ వాతావరణంలో కొన్ని రసాయనాలు కూడా వున్నాయని ఖగోళ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనిని బట్టి చూస్తే ఆ గ్రహంపై జీవి ఉనికి ఉండేందుకు ఆస్కారం ఉందని కూడా వారు అంటున్నారు. భూమికి 150 కాంతి సంవత్సరాల దూరంలో వున్న ఒక నక్షత్రాన్ని హబుల్ టెలిస్కోప్‌తో పరిశీలిస్తున్నప్పుడు దానికున్న గ్రహాలలో ఒక గ్రహంపై వాతావరణం వుందని, ఆ వాతావరణంలో సోడియం వుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీంతో మన సౌరకుటుంబానికి ఆవల ఎక్కడో ఒక చోట జీవులు వున్నాయన్న ఊహలకు బలం చేకూరుతోందని వారు అంటున్నారు. హబుల్ టెలిస్కోప్‌తో పరిశీలించిన ఆ నక్షత్రం మన సూర్యుడిని పోలి వుంది. దీనికి హెచ్ డి 209458 అని పేరు పెట్టారు. ఇంతవరకూ శాస్త్రవేత్తలు రోదసీలో గుర్తించిన 76 గ్రహాలలో ఇది ఒకటి. అయితే రసాయనాలతో కూడిన వాతావరణ ఆవరణ వున్న గ్రహం మాత్రం ఇది ఒక్కటే కావడం విశేషం. ఈ గ్రహం మన సౌర కుటుంబంలో అతి పెద్దదైన జూపిటర్ (గురుగ్రహం) సైజులో 70 శాతం వుంది. ఇది దాని మాతృనక్షత్రం (సూర్యుడి వంటిది) నుంచి కేవలం 40 లక్షల మైళ్ల దూరంలో పరిభ్రమిస్తోంది. ఈ గ్రహం ప్రతి మూడున్నర రోజులకొకసారి ప్రదక్షిణం పూర్తి చేస్తోంది. మన భూమి సూర్యునికి సుమారు 15 కోట్ల కిలోమీటర్ల దూరంలో వుందని, ఒక ప్రదక్షణం చేయడానికి ఏడాది పడుతుందని తెలిసిందే. కొత్తగా కనుగొన్న గ్రహం గురుగ్రహంలాగే వాయుగోళమని తెలిసింది. మాతృనక్షత్రం నుంచి బయలు దేరిన కాంతి ఈ గ్రహపు వాతావరణం గుండా భూమిపైకి ప్రయాణిస్తోంది. అక్కడి వాతావరణంలో వున్న రసాయనాల ప్రభావం వల్ల కాంతి వక్రీభవనం చెందుతోందని శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.



ప్రాణాంతకమైన ప్లేగు వ్యాధిని కలిగించే బాక్టీరియాకి చెందిన జన్యు చిత్రపటాన్ని బ్రిటిష్ శాస్త్రవేత్తలు రూపొందించగలిగారు. దీనివల్ల ప్లేగు వ్యాధి నివారణకు తగిన ఔషధాన్ని రూపొందించడమే గాక, ప్లేగు వ్యాధి ప్రబలకుండా చూడడానికి వీలవుతుంది. స్వల్ప కాలంలోనే అత్యధిక జనాభాను బలి తీసుకునే ఈ ప్లేగు కారక బాక్టీరియాను యుద్ధాలలో జీవాయుధాలుగా కూడా వాడే అవకాశం ఉంది. యుద్ధాలలో వాడే జీవాయుధాలు మూడింటిలో ఈ ప్లేగు బాక్టీరియా ఒకటి. "బ్లాక్ డెత్"గా పిలిచే ఈ ప్లేగు వ్యాధి వల్ల ఇంతవరకు 20 కోట్లమందికి పైగా మరణించారు. 1347-1350 మధ్య ఈ వ్యాధి సోకి ఐరోపా ఖండంలో మూడో వంతి మంది చనిపోయారు. ఇటీవల అమెరికాలో ప్లేగు వ్యాధి కారణంగా మరణించిన ఒక వ్యక్తి నుంచి సేకరించిన బాక్టీరియా ఆధారంగా ఈ జినోమ్‌ను రూపొందించారు.



'ఆచారి అమెరికా యాత్ర' టీజర్ విడుదల !

విష్ణు మంచు హీరోగా నటించిన 'ఆచారి అమెరికా యాత్ర' చిత్ర టీజర్ విడుదలైనది. కామెడీ ప్రధానంగా సాగే టీజర్ అందరిని ఆకట్టుకుంటోంది. బ్రహ్మానందం, విష్ణుల కాంబినేషన్‌లో వస్తుండటంతో చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. వీరిరువురు 'ఢీ', 'దేనికైనా రెడీ', 'దూసుకెళ్తా' వంటి చిత్రాల్లో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన సంగతి తెలిసిందే. ఇక జి.నాగేశ్వర్ రెడ్డి కలయికలో విష్ణు 'దేనికైనా రెడీ', 'ఈడో రకం ఆడో రకం' వంటి సూపర్ హిట్ కామెడీ చిత్రాలను అందించారు. 'ఆచారి అమెరికా యాత్ర' కూడా అదే తరహా వినోదాన్ని అందించనుంది నిర్మాతలు ధీమా వ్యక్తపరిచారు. విష్ణు సరసన ప్రజ్ఞ జైస్వాల్ జంటగా నటిస్తున్న ఈ సినిమాకి ఎస్ ఎస్ తమన్ సంగీతం అందించారు. 'ఆచారి అమెరికా యాత్ర' చిత్రాన్ని జనవరి 26న విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. అమెరికా, మలేషియా, హైదరాబాద్‌లలో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రాన్ని కీర్తి చౌదరి, కిట్టు 'పద్మజ పిక్చర్స్' బ్యానర్‌పై నిర్మించగా యమ్.ఎల్. కుమార్ చౌదరి సమర్పిస్తున్నారు. ఇతర తారాగణం: తనికెళ్ళ భరణి, కోట శ్రీనివాస్ రావు, పోసాని కృష్ణ మురళి, పృథ్వీ, ప్రవీణ్, విద్యుల్లేఖ రామన్, ప్రభాస్ శ్రీను, ప్రదీప్ రావా, ఠాకూర్ అనూప్ సింగ్, సురేఖ వాణి, సాంకేతిక వర్గం: రచయిత: మల్లాది వెంకటకృష్ణ మూర్తి, ఛాయాగ్రాహకుడు: సిద్దార్థ్, ఎడిటింగ్: వర్మ, సంగీతం: ఎస్ ఎస్ థమన్, మాటలు: డార్లింగ్ స్వామి, ఆర్ట్ : కిరణ్, యాక్షన్ : కనాల్ కన్నన్, బ్యానర్ : పద్మజ పిక్చర్స్, సమర్పించు : ఎం ఎల్ కుమార్ చౌదరి, నిర్మాతలు: కీర్తి చౌదరి, కిట్టు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : జి నాగేశ్వర్ రెడ్డి

భాగమతి 26న గ్రాండ్ రిలీజ్




ఎవ్వడు పడితే వాడు రావడానికి ... ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమన్నా పశువుల దొడ్డా... భాగమతి అడ్డా.... లెక్కలు తేలాలి... ఒక్కడ్ని పోనివ్వను.... అంటూ అనుష్క భాగమతి ట్రైలర్‌లో చెప్పిన హై పిచ్ డైలాగ్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ వండర్ బాహుబలి చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్న అనుష్క నటించిన తాజా తెలుగు చిత్రం భాగమతి. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి చిత్రాల్లో అనుష్క నటించిన తీరు అందర్నీ అబ్బురపరిచింది. ఇదే తరహాలో... భాగమతిగా అనుష్క తన పెర్ ఫార్మెన్స్‌తో మెస్మరైజ్ చేయనుందని ట్రైలర్‌తో రుజువైంది. భాగమతి ట్రైలర్ రిలీజ్ అయిన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. అనుష్క నటన, దర్శకుడు అశోక్ టేకింగ్, మధి కెమెరా వర్క్, అబ్బుర పరిచే రవీందర్ ఆర్ట్ వర్క్, తమన్ రీ రికార్డింగ్, యువి క్రియేషన్స్ నిర్మాణాత్మక విలువలు హై స్టాండర్డ్స్‌లో ఉన్నాయి. అనుష్క గెటప్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎప్పుడెప్పుడు ఈ సినిమా చూద్దామా అన్నంతగా క్రేజ్ సంపాదించుకుందీ ట్రైలర్. ఈ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకొని గణతంత్ర దినోత్సవ కానుకగా జనవరి 26న భాగమతి చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రమోద్, వంశీ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ.... బాహుబలి చిత్రంతో తన ఫేంను, క్రేజ్‌ను మరింత పెంచుకొని సూపర్ ఫాంలో ఉన్న అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న భాగమతి చిత్రాన్ని తాము నిర్మిస్తున్నందుకు గర్వంగా ఫీలవుతున్నాం. ఈ చిత్ర ట్రైలర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ఈ ట్రైలర్‌తో అంచనాలు తారా స్థాయికి చేరాయి. ఈ చిత్ర కథ అదుతేంగా కుదిరింది. అందుకు తగ్గట్టుగానే దర్శకుడు అశోక్ అద్భుతంగా తెరకెక్కించాడు. అనుష్క పెర్ పార్మెన్స్ ఈ సినిమాకు హైలైట్ కానుంది. మధి కెమెరా వర్క్ స్పెషల్ ఎట్రాక్షన్. ఆర్ట్ రవీందర్ వేసిన సెట్స్ గ్రాండియర్‌గా ఉంటాయి. కథకు తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. తమన్ అందించిన పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతీ సన్నివేశాన్ని హైలైట్ చేసేదిగా ఉంటుంది. భాగమతి కథ, కథనం తెలుగు ప్రేక్షకుల్ని తప్పకుండా ఎంటర్ టైన్ చేస్తుంది. గణతంత్ర దినోత్సవ కానుకగా జనవరి 26న అత్యధిక థియేటర్లలో భాగమతి చిత్రాన్ని విడుదల చేయనున్నాం. అని అన్నారు.

నటీనటులు - అనుష్క, ఉన్ని ముకుందన్, జయరాం, ఆశా శరత్, మురళీ శర్మ, ధన్ రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖ రామన్, దేవ దర్శిని, తలైవాసల్ విజయ్, అజయ్ ఘోష్, మధు నందన్, సంగీతం - ఎస్.ఎస్.తమన్, సినిమాటోగ్రాఫర్ - మధి, ఎడిటర్ - కోటగిరి వెంకటేశ్వరరావ్, ప్రొడక్షన్ డిజైనర్ - రవీందర్, నిర్మాతలు - వంశీ - ప్రమోద్, స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ - అశోక్

విశాలాంధ్ర సినిమా

పెళ్లైందనే భావిస్తాను..



'బార్ బార్ దేఖో', 'జగ్గా జాసూస్' సినిమాలతో వరుస ఫ్లాప్‌లను చవిచూసిన బాలీవుడ్ బార్బీ డాల్ కత్రినా కైఫ్‌కు 'టైగర్ జిందా హై' సినిమా ఊరట నిచ్చింది. సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ జంటగా నటించిన ఈ సినిమా వారం రోజుల్లోనే రూ.300 కోట్లు రాబట్టి 2017లోనే బ్లాక్‌బస్టర్ చిత్రంగా నిలిచింది. ఈ సందర్భంగా కత్రినా తన సినిమాలు, వ్యక్తిగత విషయాల గురించి ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 'జీవితంలో పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాల్సిన సమయం వస్తుంది. ఆ సమయంలో కెరీర్ వెనుకబడిపోతుంది. ఎందుకంటే ఆ సమయంలో మనం కుటుంబానికే ప్రాధాన్యం ఇస్తాం. జీవితం మిక్స్ అండ్ మ్యాచ్‌లా ఉంటుంది. కానీ నేను మాత్రం నాకు వివాహమైందనే భావిస్తాను. ఎందుకంటే ప్రస్తుతం నాకు సినిమాలే జీవితం. జీవితంలో పెళ్లి అనేది ఓ భాగం కావాలి. అంతేకానీ వచ్చే వ్యక్తి కోసం మనల్ని మనం కోల్పోకూడదు.' అని చెప్పుకొచ్చారు. బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్‌తో రిలేషన్‌లో ఉన్న కత్రిన కొన్ని కారణాల వల్ల రెండేళ్ల క్రితం విడిపోయారు. మరి ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు అని అడిగితే.. ఇప్పటికైతే తనకు కెరీరే ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం కత్రినా 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్', 'జీరో' సినిమాల్లో నటిస్తున్నారు.

నందమూరి కళ్యాణ్‌రామ్ - తమన్నాల చిత్రం 'నా.. నువ్వే'

నందమూరి కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా, ప్రఖ్యాత యాడ్ ఫిలిం మేకర్ జయేంద్ర దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో అందాల భామ తమన్నా హీరోయిన్‌గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి "నా.. నువ్వే" అనే టైటిల్‌ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. కూల్ బ్రీజ్ సినిమాస్ నిర్మాణంలో, ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ప్రఖ్యాత కెమరామెన్ పీసీ శ్రీరామ్ ఈ చిత్రానికి అద్భుతమైన ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు. ఒక టోటల్ ఫ్రెష్ లుక్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ ఈ చిత్రంలో కనిపిస్తారు. ఈ చిత్రానికి అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ షరెత్ సంగీతాన్ని అందిస్తున్నారు.

"జనవరి నెలాఖరుకి దాదాపుగా షూటింగ్ పూర్తవుతుంది. ఈ చిత్రానికి "నా.. నువ్వే" అనే టైటిల్ చాలా యాప్ట్‌గా ఉంటుంది. ఒక నూతన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ లుక్‌తో ఈ చిత్రాన్ని దర్శకులు జయేంద్ర తీర్చిదిద్దుతున్నారు. కళ్యాణ్ రామ్, తమన్నాల కాంబినేషన్ ఈ చిత్రానికే హై లైట్‌గా నిలుస్తుంది. పీసీ శ్రీరామ్ కెమెరా వర్క్ "నా.. నువ్వే" చిత్రానికి చాలా పెద్ద అసెట్ " అని నిర్మాతలలో ఒకరైన కిరణ్ ముప్పవరపు తెలిపారు.

"శ్రీరామ్, జయేంద్ర వంటి టాప్ క్వాలిటీ టెక్నికల్ టీంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. హీరో కళ్యాణ్ రామ్‌కి ఈ చిత్రం ఒక టోటల్ మేకోవర్‌ని ఇస్తుంది అని నమ్ముతున్నాం. వేసవి సెలవుల్లో చిత్రాన్ని విడుదల చేయటానికి సిద్ధపడుతున్నాం" అని సమర్పకులు మహేష్ కోనేరు తెలిపారు.

లవ్, యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా ఉండే ఈ చిత్రంలో, కళ్యాణ్ రామ్, తమన్నా, తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణ మురళి, వెన్నెల కిశోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి, ప్రియ, సురేఖ వాణి ప్రధాన నటులు. ఇతర నటీ నటులు వివరాలు త్వరలో తెలుపుతాము అని యూనిట్ సభ్యులు తెలిపారు.

ఈ చిత్రానికి నిర్మాతలు : కిరణ్ ముప్పవరపు , విజయ్ వట్టికూటి, సమర్పణ : మహేష్ ఎస్ కోనేరు , సంగీతం: షరెత్ , సినిమాటోగ్రఫీ: పి. సి. శ్రీరామ్ ,ఎడిటింగ్: టి. ఎస్. సురేష్ , కథ, స్క్రీన్‌ప్లే - జయేంద్ర, శుభ, దర్శకత్వం: జయేంద్ర



జయ దర్శకత్వంలో కొత్త చిత్రం



డైనమిక్ లేడీ డైరెక్టర్ జయ బి. దర్శకత్వంలో ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' వంటి సూపర్‌హిట్ చిత్రాలను నిర్మించి అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు ప్రముఖ నిర్మాత బి.ఎ.రాజు. జనవరి 7 నిర్మాత బి.ఎ.రాజు పుట్టినరోజు సందర్భంగా తమ ఆర్.జె. సినిమాస్ బేనర్‌పై మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నట్టు ప్రకటించారు. 'మా బేనర్‌లో నిర్మించిన మొదటి సినిమా 'పేమలో పావని కళ్యాణ్'. నిర్మాతగా 15 సంవత్సరాలు పూర్తయింది. మా బేనర్‌లో వచ్చిన 'ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇప్పుడు మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో జయ దర్శకత్వంలో మరో చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని నిర్మించబోతున్నాం. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన స్టోరీ డిస్కషన్స్ జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాని స్టార్ట్ చేస్తాం. అలాగే మా సూపర్‌హిట్ మ్యాగజైన్ 24వ సంవత్సరంలోకి సక్సెస్‌ఫుల్‌గా అడుగుపెట్టింది. మా వెబ్‌సైట్ ఇండస్ట్రీ హిట్ డాట్ కామ్ మంచి రేటింగ్‌తో నాలుగో సంవత్సరంలోకి ఎంటర్ అయింది" అని చెప్పారు బీఏ రాజు

గుమస్తా ఉద్యోగానికి 15 వేల దరఖాస్తులు

- హర్యానాలో ఎనిమిది పోస్టులకు..
- దరఖాస్తుదారుల్లో గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లే అధికం
- ఉద్యోగాల కొరత పెరుగుతుందనడానికి నిదర్శనం



న్యూఢిల్లీ : దేశంలో రోజురోజుకు ఉద్యోగాల కొరత పెరిగిపోతోంది. అందుకు తార్కాణమిదే. హర్యానాలో జింద్ కోర్టులో 'గుమస్తా' ఉద్యోగానికి పోస్టు గ్రాడ్యుయేట్లతో సహా 14,836 మందికిపైగా దరఖాస్తు చేశారు. ఈ ఉద్యోగానికి విద్యార్హతగా కేవలం 10వ తరగతి సర్టిఫికెట్ మాత్రమే అవసరమైనప్పటికీ, గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు, డాక్టరేట్ డిగ్రీలు పొందిన వారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. 'కేవలం ఎనిమిది ఉద్యోగ ఖాళీలు మాత్రమే ఉన్నాయి. అయితే సుమారు 15 వేల దరఖాస్తులు అందాయి' అని ఒక అధికారి చెప్పారు. 'ఒక్కో పోస్టుకు కనీసం 1,875 దరఖాస్తులు వచ్చినందున ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. 'నేను ఎంఏ డిగ్రీ కలిగి ఉన్నా. ప్రస్తుతం ఎంఫిల్ చేస్తున్నాను. నా కుటుంబానికి మద్దతుగా నిలవడానికి నాకు అత్యవసరంగా ఉద్యోగం అవసరం. ప్రభుత్వ ఉద్యోగం సురక్షితమైనది. టెన్షన్ ఉండదు. అందువల్లే గుమస్తా ఉద్యోగమే కదా అనే ఆలోచన నాకు లేదు' అని అశీష్ కుమార్ అనే ఒక దరఖాస్తుదారుడు పేర్కొన్నాడు. వచ్చే 35 ఏళ్ల పైబడిన కాలంలో పెరిగే జనాభాకు ఉపాధి కల్పించడమనేది దేశానికి భారం కానుంది. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం(యూఎన్‌డీపీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, 1991-2013 మధ్య కాలంలో 'పని వయస్సు' కలిగిన జనాభా సంఖ్య 300 మిలియన్లకు చేరిందని పేర్కొంది. అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్థ కేవలం 140 మిలియన్లకు మాత్రమే ఉపాధి కల్పించగలదని వివరించింది. ఇదిలాఉండగా, రాజస్థాన్ ఎమ్మెల్యే కుమారుడు ఒకరు గుమస్తా ఉద్యోగానికి ఎంపికైన తర్వాత రాష్ట్రంలో గుమస్తా ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఒక ఉన్నతస్థాయి విచారణ జరపాల్సిందిగా జనవరి 5న రాజస్థాన్‌లోని కాంగ్రెస్ నాయకులు డిమాండు చేశారు.

చెప్పింది గోరంతే....

జర్నలిస్టు రచనా ఖైరా



ముంబై : ఆధార్ దుర్వినియోగంపై రాసిన జర్నలిస్టు రచనా ఖైరా తనపై ఎఫ్ఐఆర్ వ్యవహారంలో స్పందించారు. ఈ కథనంలో చెప్పినది గోరంతేనని.. ఇంకా చెప్పాల్సింది కొండంత ఉందన్నారు. యూఐడీఏఐ నుంచి స్పందన రాబట్టడం ఆనందంగా ఉందని రచనా ఖైరా చెప్పారు. 'ఈ కథనంలో వెల్లడించినది మంచు పర్వతం కొనంత మాత్రమే.. మొత్తం విచారణను పూర్తిచేసుకున్నాం.. ఈ వ్యవహారం చట్టబద్ధత, సున్నితత్వాన్ని యూఐడీఏఐ అర్థంచేసుకోవడం సత్ఫలితం. ఇంకా బయటపెట్టాల్సిన వాస్తవాలు చాలావున్నాయి. వీటిని మరికొన్ని రోజుల్లో బట్టబయలు చేస్తాం' అని ఆమె అన్నారు. ఈ క్రమంలో తానో ఎఫ్ఐఆర్‌ను సాధించుకున్నానని, అదేవిధంగా నిబంధనల ఉల్లంఘన, వివరాల దుర్వినియోగంపై కేంద్రప్రభుత్వం తగు చర్యలు చేపడుతుందని ఆశిస్తున్నానని రచనా ఖైరా తెలిపారు.

ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలి : న్యూస్‌పేపర్ ఎంప్లాయీస్ యూనియన్

జర్నలిస్టుపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని న్యూస్‌పేపర్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండు చేసింది. ఆధార్ వివరాల దుర్వినియోగంపై చర్యలు చేపట్టకుండా, వార్తాకథనంలో తప్పులను చూపిస్తామని యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) పేర్కొనడాన్ని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ న్యూస్‌పేపర్ అండ్ న్యూస్ ఏజెన్సీ ఎంప్లాయీస్ ఆర్గనైజేషన్ తీవ్రంగా ఖండించింది. ఇది పత్రికాస్వేచ్ఛపై దాడి అని, అధికార యంత్రాంగానికి సానుకూలంగా లేని వార్తాలు అందించడాన్ని ప్రెస్‌ను అడ్డుకొంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొంది.



పత్రికాస్వేచ్ఛకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : రవిశంకర్

ఆధార్ నేపథ్య అక్రమాలను బట్టబయలు చేసిన ట్రిబ్యూన్ పత్రిక జర్నలిస్టుపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ క్రమంలో కేంద్ర న్యాయ, ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. పత్రికా స్వేచ్ఛకు సర్కార్ కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. దేశాభివృద్ధి దృష్ట్యా ప్రవేశపెట్టిన ఆధార్.. వివరాల పరిరక్షణకు కేంద్రం కట్టుబడిఉందని, గుర్తుతెలియనివారిపై ఎఫ్ఐఆర్ నమోదైందని ట్విట్టర్‌లో మంత్రి పేర్కొన్నారు.

ఆధార్ గోప్యతపై కథనం

ది ట్రిబ్యూన్ పత్రికపై ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ: ఆధార్ కార్డుల వివరాలు గోప్యంగా లేవంటూ 'ది ట్రిబ్యూన్ పత్రిక వెలువరించిన పరిశోధనాత్మక కథనానికి సంబంధించి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) డిప్యూటీ డైరెక్టర్ బి.ఎం.పట్నాయక్ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ప్రథమ సమాచారపత్రం (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు. 100 కోట్లకు పైగా భారతీయుల ఆధార్ వివరాలను తెలుసుకోగల ఓ సేవను పత్రిక కొనుగోలు చేసిందంటూ తమకు సమాచారం అందిందని..ఇది ఆధార్ గోప్యతను అతిక్రమించడమేనని పట్నాయక్ ఈ నెల 5న ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేరోజున ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. పత్రికకు కథనం అందించిన విలేకరి రచనా ఖైరా పేరును కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చమని..అయితే, ఎవరినీ నిందితులుగా పేర్కొనలేదని స్పష్టంచేశారు. ఎఫ్ఆర్ఆర్‌లో పేర్లు ఉన్న వారందరినీ ప్రశ్నిస్తామని వెల్లడించారు. యూఐడీఏఐ ఫిర్యాదు నేపథ్యంలో 'ది ట్రిబ్యూన్' విలేకరిపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఈ వ్యవహారాన్ని భారతీయులంతా ఖండించాలని పార్టీ ప్రధాన అధికర ప్రతినిధి రణదీప్‌సింగ్ సూర్జేవాలా పిలుపునిచ్చారు.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి : ఎడిటర్స్ గిల్డ్

'ది ట్రిబ్యూన్ కథనం పై ఎఫ్ఐఆర్ నేపథ్యంలో 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని పత్రికతోపాటు విలేకరిపై ఎఫ్ఐఆర్‌ను యూఐడీఏఐ ఉపసంహరించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఆధార్ గోప్యత అతిక్రమణ అంశంపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపించాలని కూడా కోరింది.

వాస్తవాలు వెల్లడిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా? : శత్రుఘ్న సిన్హా

ఆధార్ నేపథ్య అక్రమాలను బట్టబయలు చేసిన ట్రిబ్యూన్ పత్రిక జర్నలిస్టులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా తీవ్రస్థాయిలో విమర్శించారు. మనం రాజకీయంగా అస్థిరంగా ఉన్న దేశంలో ఉంటున్నామా? అని ప్రశ్నించారు. ఆధార్ వివరాల దుర్వినియోగం జరుగుతోందన్న వాస్తవాన్ని బయటపెట్టినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం న్యాయమా అని అడిగారు. జాతి, సమాజ హితవు కోసం పరితపిస్తూ, నిజాయితీగ పనిచేసేవారిపై రాజకీయపరమైన కక్షసాధింపుకు పాల్పడుతున్నారా' అంటూ సిన్హా ట్విట్టర్‌లో ప్రశ్నించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ విధానాలు, వివిధ అంశాలపై శత్రుఘ్న సిన్హా పలుమార్లు విమర్శలు చేయడం విదితమే. జర్నలిస్టు పక్షాన నిలిచిన ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాను ఆయన అభినం దించారు. జర్నలిస్టుపై ఎఫ్ఐఆర్‌ను వెనుక్కు తీసుకోవాలని, పారదర్శకంగా విచారణ జరిపిం చాలని ఎడిటర్స్ గిల్డ్ డిమాండు చేసింది. ఈ వ్యవహా రంలో నిజాయితీగల ప్రభుత్వ అధికారులు తగు విధంగా స్పందిస్తారని, ముఖ్యంగా సుప్రీం కోర్టు దీనిపై దృష్టిసారించి శీఘ్రమే దిద్దుబాటు చర్యలకు ఆదేశిస్తుందన్న నమ్మకం ఉన్నట్టు పేర్కొంది.



బీజేపీ నేతకు చెప్పుల 'దండ'న..!



భోపాల్ : "అయ్యా మా వాడకట్టులో కుళాయిలు పని చేయటం లేదు. తాగునీటి కోసం అల్లాడిపోతున్నాం", అని మొర పెట్టుకుంటే ఆ చైర్మన్ కనీసం కన్నెత్తి చూడలేదు. ఎన్ని ప్రదక్షిణలు చేసినా కరుణించలేదు. ఐతే, ప్రస్తుతం ఎన్నికలొచ్చాయి. ఈ సారి ఆ చైర్మన్ ఇంటికి వచ్చి సలాంలు కొడుతున్నాడు. అంతే అతడికి ఓ ఓటరు ఎదురేగాడు. చెప్పుల దండతో స్వాగతం పలకబోయాడు. పరిస్థితిని గమనించిన ఆ నేత పరుగందుకున్నాడు. కానీ ఓటరు వదిలి పెట్టలేదు. ఎట్టకేలకు తన అభిమాన నేత మెడలో చెప్పుల మాల వేసి సత్కరించాడు. ఈ ఘటనల మధ్యప్రదేశ్‌లోని థామ్‌నోడ్ ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్‌లో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో థామ్‌నోడ్ అనే ప్రాంతంలో దినేశ్ శర్మ అనే బీజేపీ నేత ప్రచారానికి వెళ్లారు. హుషారుగా ప్రతి ఇంటికి ఓట్లు అడుగుతున్నాడు. ఆ సమయంలో ఓ వ్యక్తి చెప్పులతో దండతో ఎదురెళ్లాడు. చెప్పుల దండను చూసిన దినేశ్ శర్మ ఓటరును అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. కానీ ఆ వ్యక్తి వదలలేదు. నాయకుడి వెంటే వెళ్లాడు. ఇక తప్పని స్థితిలో ఆ నాయకుడు ఓటరు ముందు తల వంచాడు. చెప్పుల దండ వేయించు కున్నాడు. అనంతరం ఈ దండ వేసిన వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ తమ ప్రాంతంలో నీటి సమస్య అధికంగా ఉందని, ఈ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ఆ విషయాన్ని అందరికీ తెలిపేందుకే తాను ఇలా చేశానని అన్నారు. ఇక దండ వేయించుకున్న బీజేపీ నేత దినేశ్ మాత్రం ఆ చర్యపట్ల తనకు ఎలాంటి కోపం లేదని, ఈ సమస్యపై తాము మాట్లాడుతానని అన్నారు. అది వారి కోపం మాత్రమేనని, తన నుంచి ఏదో కోరుకుంటున్నారని, అందుకే తమ అసంతృప్తిని అలా వ్యక్తం చేశారని అన్నారు. తానెప్పుడూ వారి బిడ్డనేనని, వారి అవసరాలు తీర్చేందుకు మరింత బాగా పనిచేస్తానని అన్నారు.

సీఎంల ట్వీట్ల యుద్ధం

- ప్రజల ఆకలి తీర్చడం నేర్చుకోండి : సిద్ధరామయ్య
- రైతు ఆత్మహత్యలకు అంతే లేదు : యోగి




బెంగళూరు : కర్నాటక, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, యోగీ ఆదిత్యనాథ్ మధ్య ట్వీట్ల యుద్ధం నడుస్తోంది. అభివృద్ధి, పాలనాతీరుపై పరస్పరం విమర్శలు గుప్పించుకుంటూ ట్వీట్లు చేసుకున్నారు. ఇవి ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యాయి. బీజేపీ కర్నాటక రాష్ట్ర శాఖ ఆదివారం ఇక్కడ నిర్వహించిన నవ కర్నాటక పరివర్తన ర్యాలీలో యోగి పాల్గొన్నారు. సిద్ధరామయ్య ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికిగాను బీజేపీ 75రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా ఆ కార్యక్రమం జరిగింది. యోగి రాకను స్వాగతిస్తూ యూపీలో ఆకలి చావుల సమస్యను పరిష్కరించుకోవడానికి కర్నాటక నుంచి ఆయన చాలా నేర్చుకుంటారని సిద్ధరామయ్య ట్వీట్ చేశారు. 'యూపీ సీఎం యోగిని మా రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నాను. మా నుంచి మీరు నేర్చుకోవాల్సింది చాలా ఉంది. మీరు ఇక్కడికి వచ్చి ఇందిరా క్యాంటీన్, రేషన్ దుకాణాలను సందర్శించండి. మీ రాష్ట్రంలో పెరిగిన ఆకలిచావుల సమస్యను పరిష్కరించుకోవడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. మా రాష్ట్రం నుంచి దీనిని నేర్చుకొని వెళ్లండి' అని సిద్ధరామయ్య ట్వీట్ చేశారు. దీనికి యోగి ఘాటుగానే స్పందించారు. 'ఆహ్వానం పలికినందుకు సిద్ధరామయ్యకు ధన్యవాదాలు. కర్నాటకలో పెరిగిన రైతు ఆత్మహత్యలు, కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజాయతీ గల ప్రభుత్వ అధికారులపై వేధింపులను చూస్తున్నాం' అని యోగి ట్వీట్ చేశారు. 'సిద్ధరామయ్య గారికి ధన్యవాదాలు. మీ హయాంలో రైతు ఆత్మహత్యల సంఖ్య పెరిగిపోయిందని విన్నాను. లెక్కలేనన్ని ఆత్మహత్యలు జరిగాయి. నిజాయతీ అధికారులకు బదిలీ బహుమానంగా ఇచ్చారు' అని స్పందించారు. ఇద్దరు ముఖ్యమంత్రులు చేసుకున్న ఈ ట్వీట్లు వైరల్ అయ్యాయి. రెండు రాష్ట్రాల స్థితిగతులు ప్రజలకు అర్థమవుతున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రతిపక్షాలు దీనిని అవకాశంగా తీసుకొని మరింత విమర్శలు దాడి ప్రారంభించాయి. అవినీతి, విభజన రాజకీయాలు, అభివృద్ధి నిరోధక విధానాలు కారణంగా కర్నాటకను కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు వెనక్కి తీసుకెళ్లిందని యోగి నిన్న విమర్శించారు. కులం పేరుతో సమాజాన్ని చీల్చడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఎదురుదాడి చేశారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ఇలాంటి రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ దేశానికి భారం, సమస్యగా మారిందని వ్యాఖ్యానించారు.

విస్తృత ధర్మాసనానికి హోమోసెక్సువాలిటీ తీర్పు

న్యూఢిల్లీ : స్వలింగ సంపర్కం నేరంగా పరిగణిస్తూ 2013లో వెలువరించిన తీర్పుపై పున: సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరిం చింది. ఈ తీర్పు సమీక్షించాలని విస్తృత ధర్మాస నానికి నివేదించింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 377పై సమీక్ష జరపాలని విస్తృత ధర్మాసనాన్ని కోరారు. సెక్షన్ 377 ప్రకారం ప్రకృతి వ్యతిరేక సంభోగ క్రియ నేరంగా పరి గణిస్తుంది. ఈ నేరానికి పాల్పడినవారికి 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు అపరాధరుసుం కూడా విధిస్తారు. సెక్షన్ 377 చట్టవ్యతిరేకమని వయోజనులు తమకు నచ్చిన విధంగా సెక్సులో పాల్గొనవచ్చని నవ్‌తేజ్ సింగ్‌జోహర్ పిటిషన్ దాఖలు చేయడంతో ధర్మాసనం విచారణకు స్వీకరిం చింది. జోహర్ తరపున సీనియర్ అడ్వకేట్ అరవింద్ దాటర్ కోర్టుకు హాజరై ఇద్దరు మేజర్లు స్వలింగ సంపర్కానికి పాల్పడి నంతమాత్రాన నేరంగా పరిగణించరా దని, దీన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించి విస్తృత ధర్మా సనం సమీక్ష కోరారు. స్వచ్ఛందసంస్థ నాజ్ ఫౌండేషన్ ఈ విషయంపై పిటీషన్ దాఖలు చేయగా, 2009లో ఢిల్లీ హైకోర్టు సెక్షన్ 377ను చట్టవ్యతిరేకంగా పేర్కొన్న అంశాన్ని ప్రస్తావిం చారు. అత్యున్నత న్యాయస్థానం 2014లో ఈతీర్పును పక్కన పెట్టి ఫుల్‌బెంచ్ దీనిపై చర్చించాలని పేర్కొంది.

దేశంలో గంటకో విద్యార్థి మృతి

- స్కూళ్లు, కళాశాలల్లో పెరుగుతున్న ఒత్తిళ్లు
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థులు



న్యూఢిల్లీ : దేశంలో గంటకో విద్యార్థి మృతి చెందుతున్నాడు. పరీక్షల్లో వైఫల్య భయం, మంచి ఫలితాలు సాధించలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2014 నుంచి మూడేళ్ల కాలంలో భారత్‌లో 26 వేల మందికి పైగా విద్యార్థులు మరణించారు. ఒక్క 2016లోనే ఈ మరణాల సంఖ్య 9,474గా ఉంది. అంటే ప్రతి 55 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అందిన నివేదిక పేర్కొంది. సరైన కారణాలు లేనప్పటికీ, దాదాపు పావు వంతు కేసులు పరీక్షల్లో ఫెయిల్ కావడమే కారణంగా కనిపిస్తోంది. మొత్తం 2,403 కేసులు(2014లో), 2,646(2015లో), 2,413(2016లో) ఈ కారణంతో ఆత్మహత్య కేసులు నమోదయ్యాయని కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారామ్ అహిర్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ ఏడాది మే నెలలో మధ్యప్రదేశ్‌కు చెందిన అనేక ప్రాంతాల్లో 12 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఆరుగురు బాలికలు ఉన్నారు.. పదవ తరగతి, పన్నెండవ తరగతి ఫలితాలలో ఫెయిలవడంతో ఒత్తిడికి గురై ఆగస్టులో ఆత్మహత్యలు చేసుకున్నారని భోపాల్ పోలీసులు తెలిపారు. వెస్ట్ బెంగళూరుకు చెందిన 15 ఏళ్ల విద్యార్థి ఒకరు ప్రమాదకర ఆన్‌లైన్ గేమ్ బ్లూ వేల్ చాలెంజ్ ఆడుతూ మరణించినట్లుగా అనుమానించారు. అయితే అది తర్వాత నిర్ధారణ కాలేదు. అయితే 2016లో 1,350 కేసులతో మహారాష్ట్ర విద్యార్థుల ఆత్మహత్యల్లో అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం కేసుల్లో ఇది ఇక్కడ 14 శాతంగా ఉంది. ఇక పశ్చిమ బెంగాల్, తమిళనాడులు 1,147, 981 కేసులతో వరుసలో ఉన్నాయి. అయితే ఈ ఘటన వెనుక కేవలం చదువులో వైఫల్యం మాత్రమే కారణం కాదు. బలవంతంగా కెరీర్ ఎంపికలు, వైఫల్య భయం, మానసిక అనారోగ్యం తరచూ తీవ్ర స్థాయికి చేరుకోవడం కారణాలుగా ఉన్నాయని 'యువర్ దోస్త్' ఆన్‌లైన్ కౌన్సిలింగ్ సర్వే 2016లో పేర్కొంది. వైద్య విద్యార్థుల మరణాలు ఎన్ని ఉన్నాయని సభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు, కేంద్రం వద్ద అటువంటి సమాచారం ఏదీ లేదని మంత్రి అహర్ సమాధానమిచ్చారు. అయితే దేశంలో కేవలం 5 వేల మంది మానసిక వైద్యులు, వైద్య సంబంధ మనస్తతత్వ వేత్తలు కేవలం 2 వేల మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి జనాభాకు మరింత మంది మానసిక వైద్యుల అవసరం ఉంది.

ఇదిలాఉండగా, పాఠశాలలు, కళా శాలల్లో కౌన్సిలింగ్, జీవిత నైపుణ్య శిక్షణ, పని ప్రదేశంలో ఒత్తిడి నిర్వహణ, ఆత్మహత్యల నివారణ సేవా విభాగాలతో దేశంలోని కొన్ని జిల్లాల్లో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అహిర్ లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. పూనెలోని సుమారు 115 కళాశాలలు విద్యార్థుల కోసం వెల్‌నెస్ కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ఇక ఖరగ్‌పూర్ ఐఐటీ ఒక అసాధారణ చర్య చేపట్టింది. ప్రతి రోజూ ఒక గంటపాటు ఒకరితో మరొకరు కలిసి చర్చించడం, సలహాలు తీసుకోవడాన్ని ప్రోత్సహిస్తోంది.

పాక్ జాతీయ గీతాలాపన కేసులో అరెస్టులు

శ్రీనగర్(జమ్మూకాశ్మీర్) : జమ్మూకాశ్మీర్‌లోని బందిపోరా జిల్లాలో క్రికెట్ మ్యాచ్ ఆరంభంలో పాకిస్థాన్ జాతీయ గీతంను ఆలపించానే ఆరోపణపై నలుగురు కాశ్మీరీ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇతర ఆటగాళ్ల కోసం గాలిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో మధ్య కాశ్మీర్‌లోని గందెర్‌బాల్ జిల్లాలో ఇలాంటి సంఘటనే జరిగింది. స్థానిక క్రికెట్ మ్యాచ్‌లో ఆట ఆరంభానికి ముందు కాశ్మీరీ యువకులు పాక్ జాతీయ గీతాల్ని ఆలపించారు.

సీనియర్ క్రీడా విలేకరి శశికాంత్ కన్నుమూత

పూణే(మహారాష్ట్ర) : సీనియర్ క్రీడా విలేకరి శశికాంత్ భగవత్(61) సోమవారం గుండె పోటుతో మరణించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరాఠీ దినపత్రిక 'సకల్'లో శశికాంత్ చాలా కాలం పనిచేశారు. అందులో క్రీడా విలేకరిగా పని చేస్తూనే పదవీ విరమణ చేశారు. పూణే శ్రామిక్ పత్రకార్ సంఘ్, పూణే పత్రకార్ ప్రతిష్టాన్‌కు శశికాంత్ అధ్యక్షుడుగా సేవలందించారు.

గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన డీఎంకే

చెన్నై(తమిళనాడు) : తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు ఆరంభమైన మొదటి రోజున గవర్నర్ ప్రసంగాన్ని ప్రతిపక్షం ద్రావిడ మున్నేట్రా కజగం (డీఎంకే) బహిష్కరించింది. 18 మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బహిష్కరించిన అనంతరం మైనార్టీకి పడిపోయిన అన్నాడీఎంకే అధికారంలో కొనసాగే అర్హతను కోల్పోయిందని ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మౌనం వహిస్తున్నందున రానున్న రోజుల్లో సమావేశాల్లో అన్నాడీఎంకేను నిలదీస్తామని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు.

'కమలా మిల్స్' ఘటనపై శివసేన ఫైర్

ముంబై(మహారాష్ట్ర): రాష్ట్రంలో శాంతి, భద్రతలు అదుపులో ఉన్నాయంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ చెప్పుకుంటున్నారని, అయితే పరిస్థితులు అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని శివసేన పేర్కొంది. కమలా మిల్స్ కాంపౌండ్ అగ్నిప్రమాదానికి బాధ్యులైన నిందితులు యదేచ్ఛగా తిరుగుతున్నా ప్రభుత్వం ఏమీ చేయడం లేదని పార్టీ విమర్శించింది. 'డిసెంబర్ 29 దుర్ఘటన' అనంతరం అక్రమంగా నడుపుతున్న పబ్, రెస్టారెంట్లపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా బీఎంసీ కమీషనర్ అజోయ్‌మెహెతాపై వత్తిడి తెస్తున్నారని సేన ఆరోపించింది.

అసోంలో తీవ్రవాది అరెస్టు

హఫ్లాంగ్(అసోం) : అసోంలోని హసావో జిల్లాలో పోలీసులు, అసోం రైఫిల్స్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఒక తీవ్రవాది పట్టుబడ్డాడు. వ్యతిగత భద్రతాధికారి(పీఎస్‌ఓ)ని కిడ్నాప్ చేసిన కేసులో ఈ తీవ్రవాది నిందితుడని పోలీసులు పేర్కొన్నారు. పట్టుబడిన తీవ్రవాదిదని జినియాంగ్రాంగ్ యునైటెడ్ ఫ్రంట్ (జెడ్‌యూఎఫ్)కు చెందిన ఎన్‌ఎన్ మాజ్ నైయేయింగ్‌గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. కిడ్నాప్‌కు గురైన భద్రతాధికారిని దీమా హాసావో జిల్లాలోని హుంగ్రూం గ్రామంలో పోలీసులు, అసోం రైఫిల్స్ జనవరి 1న రక్షించిన సంగతి తెలిసిందే.

నానాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి

చిత్రకూట్(మధ్యప్రదేశ్) : ప్రముఖ సంఘసంస్కర్త నానాజీ దేశ్‌ముఖ్ విగ్రహాన్ని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ సోమవారం ఓ ఆయుర్వేద ఆరోగ్య కేంద్ర ప్రాగంణంలో ఆవిష్కరించారు. సత్నా జిల్లాలో ఒక రోజు పర్యటనకు కోవింద్, కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్‌తో పాటు విచ్చేశారు. అంతకు మునుపు చిత్రకూట్ చేరుకున్న రాష్ట్రపతిని హెలిపాడ్ వద్ద మధ్యప్రదేశ్ గవర్నర్ ఓపీ కోహ్లీ, ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ సాదరంగా ఆహ్వానం పలికారు.

సగం కాలిన మృతదేహం లభ్యం

జల్నా(మహారాష్ట్ర) : సగం కాలి ఉన్న ఓ 30 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంబడ్ ప్రాంతంలోని పత్తర్వాడా రోడ్డులో కనుగొన్న ఈ మృతదేహాన్ని స్థానికులు శ్రీకాంత్ ఇంగోలేగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం కాళ్లు, చేతులను తాడుతో కట్టివేశారని పోలీసులు తెలిపారు. ఆర్థిక లావాదేవీలే శ్రీకాంత్ హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

బీహార్ సీఎంకు అవార్డు ప్రదానం

జమ్మూ (జమ్మూకాశ్మీర్) : రాజకీయాలు, ప్రజాజీవితంలో ఋజువర్తనకు గాను అందజేసే 'ముఫ్తీ మొహమ్మద్ సయీద్ అవార్డు'ను ప్రప్రథమంగా బీహార్ ముఖ్యమంత్రి నితిష్ కుమార్‌కు ప్రధానం చేశారు. పీడీపీ వ్యవస్థాపకుడు, రెండు సార్లు జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రిగా సేవలందించిన ముఫ్తీ మొహమ్మద్ సయీద్ వర్ధంతి(సోమవారం) రోజున రాష్ట్ర గవర్నర్ ఎన్ఎన్ వోరా నితిష్ కుమార్‌కు అందజేశారు.

వంతెన పై నుంచి పడిపోయిన కారు - ఇద్దరు మృతి

హత్రాస్ : ఉత్తరప్రదేశ్‌లోని ముర్సాన్‌లో సోమవారం ఉదయం పొగమంచు కారణంగా ఒక కారు వంతెనపై నుంచి పడిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారని తెలిపారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయని చెప్పారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని, ఫరూదాబాద్ నుంచి కార్పన్ నదిపై వంతెనను దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించామన్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

కాశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపుచర్యలు

శ్రీనగర్ : మధ్య కాశ్మీర్‌లోని బుదగాం జిల్లాలో చాదురాలో భద్రతాదళాలు, ఉగ్రవాదుల మధ్య హోరాహోరీగా కాల్పులు జరిగాయని పోలీసులు తెలిపారు. చాదురాలోని జుహమా గ్రామంలోని ఒక ఇంట్లో ఉగ్రవాదులు ఉన్నట్టు అందిన సమాచారం మేరకు భద్రతాదాళాలు అక్కడ గాలింపుచర్యలు చేపట్టింది. ఈ సందర్భంలో ఇరువురి మధ్య కాల్పులు జరుగుతున్నాయి. భద్రతాదళాల ఎన్‌కౌంటర్‌లో ఇద్దరి మృతిచెందినట్టు సమాచారం. కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి.

బెయిల్ కోరనున్న లాలు

రాంచీ : దాణా కేసులో సీబీఐ కోర్టు తీర్పుతో జైలుశిక్ష అనుభవిస్తున్న బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ మరికొద్దిరోజుల్లో జార్ఖండ్ హైకోర్టుకు బెయిల్‌కు దాఖలు చేసుకోబోతున్నారని ఆయన తరపు న్యాయవాది తెలిపారు. తీర్పుకు సంబంధించిన కాపీని తాము చదివి వచ్చే శుక్రవారం గాని, సోమవారం గాని బెయిల్ కోసం దాఖలు చేసుకోనున్నట్టు చెప్పారు.

వారిని విధుల నుంచి తొలగించొద్దు

న్యూఢిల్లీ : తమ అనుమతి లేకుండా తమిళనాడు ప్రభుత్వం సమ్మె చేస్తున్న రవాణా సిబ్బందిని సర్వీసుల నుంచి తొలగించవద్దని మద్రాస్ హైకోర్టు సోమవారం పేర్కొంది. జనవరి 5న ఈ అంశంపై దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ ఇందిరా బెనర్జీతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వును జారీచేసింది. సమ్మె చేస్తున్న వర్కర్లతో సమావేశమై పరిష్కరం చూపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిల్‌లో పేర్కొన్నారు.

రిజర్వ్‌బ్యాంకుకు ధన్యవాదాలు తెలిపిన నవీన్‌పట్నాయక్

భువనేశ్వర్ : కొత్తగా విడుదల చేస్తున్న పది రూపాయల నోటుపై ప్రసిద్ధ కొణార్క్ సూర్య దేవాలయంకు చెందిన రథ చక్రం చిత్రంను వాడటం తమకు గర్వకారణమని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ పేర్కొన్నారు. తమ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ సంపదను సూచించే గొప్ప కట్టడాన్ని జాతీయ కరెన్సీ నోటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించడం చాలా గర్వంగా ఉందంటూ ధన్యవాదాలు తెలుపుతూ ఆయన ట్వీట్ చేశారు.



రుణ ఎగవేతదారులను శిక్షించాలి


విశాఖ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద సీపీఐ ఆందోళన

విశాలాంధ్ర-విశాఖపట్నం: నల్లధనాన్ని వెలికితీస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం ద్వారా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నాలుగేళ్ళయినా ఆ దిశగా కనీస చర్యలు చేపట్టకపోగా బ్యాంకు వద్ద రూ.కోట్లలో రుణాలు తీసుకొని ఎగవేతకు పాల్పడ్డ బడా పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాయడం దారుణమని సీపీఐ విశాఖ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు మండిపడ్డారు. విశాఖలోని పాతజైలురోడ్డులోని ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రుణాలు ఎగ్గొట్టిన 63 మంది బడా పారిశ్రామికవేత్తలకు ఎస్‌బీఐ రూ. 7వేల106 కోట్లు రుణమాఫీ చేయడాన్ని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ లిక్కర్ మాఫియా కింగ్ విజయమాల్యాకు రూ. వెయ్యి 201 కోట్లు, విక్టరీ ఎలక్ట్రికల్స్‌కు రూ.93కోట్లు, విక్టరీ ట్రాన్స్ అండ్ స్విచ్‌గేర్స్‌కు రూ.65కోట్లు, ఘణశ్యామ్‌దాస్ జెమ్స్ అండ్ జ్యూయిలర్స్‌కు రూ. 61 కోట్లు, యాక్సిస్ సర్టికల్స్‌కు రూ.51 కోట్లు, టోటెం ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థకు రూ. 93.68 కోట్లు, ఎస్ఎస్‌వీజీ ఇంజనీరింగ్ ప్రాజెక్టు లిమిటెడ్‌కు రూ. 65.24కోట్లు రుణమాఫీ చేసి పేదల సొమ్మును పెద్దలకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌బీఐ రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన ముఖేష్ అంబానీ రూ. 1లక్షా 87వేల 70కోట్లు, అనిల్ అంబానీ రూ. 1లక్షా 24వేల 956 కోట్లు, రూలియా బ్రదర్స్ రూ. 1లక్షా 1వెయ్యి 461కోట్లు, అనిల్ అగర్వాల్ రూ. 1లక్షా 3వేల 340 కోట్లు, సైరస్ మిస్త్రీ రూ. 80వేల 701కోట్లు, మనోజ్‌గౌడ్ రూ. 75వేల 163కోట్లు, సజ్జన్ జిందాల్ రూ. 58వేల 171 కోట్లు, లాంకో మధు రూ. 47 వేల 102 కోట్లు, జీఎం రావు రూ. 47వేల 976 కోట్లు, వీఎస్ దూప్ రూ. 45వేల 400కోట్లు, జీవీకే రెడ్డి రూ. 33వేల 393 కోట్లతో పాటు సహారా గ్రూప్, రేణుకా షుగర్స్, నవీన్ జిందాల్, బీఎల్ఎల్ వంటి సంస్థలు రూ.5వేల కోట్లకు పైగా రుణాలు ఎగ్గొట్టిన మొత్తం రూ. 28 లక్షల కోట్లు మొండిబకాయిలు వసూలు చేస్తే దేశం ఆర్థికాభివృద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. రుణాలు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి మార్కండేయులు, నగర కార్యవర్గ సభ్యులు జి.రాంబాబు, పైలా ఈశ్వరారవు, ఎస్కె రెహమాన్, నాయకులు పీఎస్ సుకుమారన్, బి.ప్రశాంత్‌కుమార్, నాగభూషణరావు, చంద్రశేఖరరావు, సీహెచ్ గురుమూర్తి పాల్గొన్నారు.

తిరుపతిలోనూ సమయ నిర్దేశిత సర్వదర్శన కౌంటర్లు

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతిలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్‌స్టాండ్, అలిపిరి తదితర ప్రాంతాల్లో ఎక్కువ శాతం సమయ నిర్దేశిత సర్వదర్శన కౌంటర్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం సీనియర్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ డిసెంబరు 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తిరుమలలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన సమయ నిర్దేశిత సర్వదర్శనం విధానం విజయవంతమైన నేపథ్యంలో దీనిని శాశ్వతంగా అమలు చేసేందుకు తిరుమలతోపాటు తిరుపతిలోనూ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడంతోపాటు హార్డ్‌వేర్ పరికరాలను సిద్ధం చేయాలన్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్ల నుంచి భక్తులను దర్శనానికి వదిలే సమయంలో క్యూల నిర్వహణపై సమగ్రంగా అధ్యయనం చేయాలని జేఈవోకు సూచించారు. తిరుమలలో గదులు తీసుకున్న భక్తులు 12 గంటలలోపు ఖాళీ చేస్తే 50 శాతం రీఫండ్ ఇస్తున్నామని, ఆధార్ ఉన్న భక్తులకు ఈ మొత్తాన్ని నేరుగా బ్యాంక్ ఖాతాలకు చెల్లించాలన్నారు. ఆధార్‌లేని వారికి రీఫండ్ ఎలా చెల్లించాలనే విషయంపై చర్యలు చేపట్టాలని ఎఫ్ఏసీఏవోను కోరారు. తిరుమలలో భక్తులు వివిధ ప్రాంతాలను సులువుగా గుర్తించేలా సూచిక బోర్డులను వివిధ భాషలలో ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ కల్యాణమండపాల ఆన్‌లైన్ బుకింగ్‌ను ఈ నెలలో చిత్తూరు జిల్లా నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. ఒంటిమిట్ట కోదండరామాలయం వద్ద పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. సమావేశంలో టీటీడీ తిరుమల జేఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు, తిరుపతి జేఈవో పోల భాస్కర్ పాల్గొన్నారు.

పీఏసీఎల్ ఖాతాదారులకు సెబీ ఊరట



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పీఏసీఎల్ (పెరల్ అగ్రిటెక్ కార్పొరేషన్ లిమిటెడ్) ఖాతాదారులకు సొమ్ము చెల్లింపు విషయంలో సెబీ కొంత ఊరటనిచ్చిందని పీఏసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీబాబు తెలిపారు. 13 జిల్లాల పీఏసీఎల్ ఖాతాదారుల సర్వసభ్య సమావేశం సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.మురళీబాబు మాట్లాడుతూ పీఏసీఎల్ ఖాతాదారులు కోటి 43 వేల మంది ఉన్నారని, వీరికి మొదటి విడతగా రూ.1549 కోట్లు ఇవ్వడానికి సెబీ ముందుకు వచ్చిందన్నారు. కంపెనీ నుంచి రూ.2500 లోపు రావలసిన ఖాతాదారులకు చెల్లింపు విషయంలో ఊరటనిస్తూ సెబీ గతంలోనే ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం రూ.2500 లోపు వున్న ఖాతాదారులు తమ వివరాలను సెబీకి తెలియజేసి వెబ్‌సైట్ ఙఙఙ.ంవఎఱఎశీఎవఙవవ.ఱశీఎ లో ఫిబ్రవరి 28లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే సమీపంలోని పీఏసీఎల్స్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. కృష్ణా జిల్లా అధ్యక్షులు చెల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హృదయరాజు (గుంటూరు), శ్యామలరావు (హైదరాబాద్), పెన్నబోయిన సుబ్బారావు (వినుకొండ), పి.మాల్యాద్రిరెడ్డి (గుంటూరు), పి.సుధాకర్ (రాజమండ్రి), సమ్మెట రాజకుమారి (విజయవాడ), టి.కొండలరావు (గుంటూరు), పి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగ అవకాశాలు



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయ్‌భాస్కర్ అన్నారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో జాతీయ స్థాయి ఉద్‌ఘోష్-టెక్నికల్/ఆర్ట్స్ అండ్ కల్చరల్, చలపతి స్పోర్ట్స్ కార్నివాల్-2018 కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పి.ఉదయ్‌భాస్కర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చలపతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఉదయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డీఆర్ఎం వి.ఎస్.భూమా, కళాశాల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవికాంత్, కళాశాల డైరెక్టర్ డి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో 12వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: శ్రీశైలం భ్రమరాంభిక మల్లికార్జునస్వాములకు జనవరి 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధాన కార్యనిర్వాహణాధికారి భరత్‌గుప్త సోమవారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు రోజులపాటు కొనసాగే ఉత్సవాలు 18వ తేదీన ముగుస్తాయన్నారు. సాంప్రదాయాన్ని అనుసరించి శ్రీమల్లికార్జునస్వాముల వారికి ఏటా రెండుసార్లు సంక్రాంతి, శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా శాశ్వత, అర్జిత సేవలైన కళ్యాణం, రుద్రహోమం, గణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం, ఏకాంత సేవా, సర్వసేవా పథకములు నిలిపివేసినట్టు వివరించారు.

మినుము రైతు గగ్గోలు

- మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు నిలిపివేత
- బయట మార్కెట్‌లో ధరలు పతనం
- ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని విన్నపాలు



విశాలాంధ్ర- నందిగామ: మార్క్‌ఫెడ్ మినుముల కొనుగోళ్లు నిలిపివేయటంతో కృష్ణాజిల్లా రైతులు కుమిలిపోతున్నారు. బయట మార్కెట్‌లో కనీస ధర లేకపోవడంతో ఇళ్లలోనే నిల్వ చేస్తున్నారు. ధర కొంతైనా పెరుగుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసిన పేద, మధ్య తరగతి రైతులు దిక్కుతోచని స్థితిలో నలిగిపోతున్నారు. కొందరు పొలాల్లోనే అమ్మేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ఈ ఏడాది టార్గెట్ మేరకు మినుము కొనుగోళ్లు పూర్తి చేయటంతో ప్రస్తుతం నిలిపివేసింది. కేంద్రం నుంచి మళ్ళీ ఆదేశాలు వస్తేనే కొనుగోలు చేస్తామని, లేకుంటే ఏమీచేయలేని మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు, బయటి మార్కెట్ ధరకు క్వింటాకు రూ.1000కు పైగా తేడా ఉండటంతో విక్రయించాలో, నిల్వ చేయాలో తెలియక రైతులు అయోమయంలో పడ్డారు.

ఇళ్లలో క్వింటాళ్లకొద్దీ నిల్వలు

జిల్లావ్యాప్తంగా రైతుల ఇళ్లలో వేలాది క్వింటాళ్ల మినుముల నిల్వలు పేరుకుపోయాయి. రెండేళ్ల క్రితం మార్కెట్‌లో మినుము ధర అనూహ్యంగా క్వింటా రూ.12 వేలు పలికింది. ఈ నేపథ్యంలో గత ఏడాది మినుము పండించిన రైతులు అధిక శాతం మంది ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో విక్రయించకుండా నిల్వ చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర లేకపోవడం, మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు నిలిపివేయడంతో నిల్వలు పెరిగిపోయాయి. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం ఒక్క తూర్పు కృష్ణాలోనే లక్ష క్వింటాళ్ల నిల్వలు ఉన్నట్లు సమాచారం. డెల్టాలో ఖరీఫ్ సీజన్ వరి కోతలు పూర్తయిన తర్వాత ఎక్కువ మంది రైతులు మినుము వేశారు. గత రబీ సీజన్ పంట నిల్వలు ఇంకా రైతుల వద్దే ఉండగా మరో నెల రోజుల్లో కొత్త మినుములు ఇళ్లకు రానున్నాయి. పరిస్థితి అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు. కౌలు రైతులు కన్నీరు పెడుతున్నారు.

వ్యాపారుల విన్యాసాలెన్నో..

బయట మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులు అతి తక్కువ ధర ఇస్తున్నా చుక్కలు చూపెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.5,400. ప్రస్తుతం బయట మార్కెట్‌లో పూర్తి స్థాయి నాణ్యతతో కూడిన మినుములను క్వింటా రూ.4000 నుంచి రూ.4500 మధ్య వ్యాపారులు అడుగుతున్నారు. అదికూడా నాలుగు, ఐదు సార్లు జల్లిడ వేసిన తర్వాత తరుగు కింద క్వింటాకు రెండు కిలోల చొప్పున తీసేస్తే. అప్పుల వత్తిళ్లు తట్టుకోలేక, చేతిలో చిల్లిగవ్వలేక, గత్యంతరం లేక కొందరు తెగనమ్ముకుంటున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

మినుము రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ధర లేదని గత ఏడాది పంట కొందరు అమ్ముకోలేదు, కొత్త పంట ఇళ్లకు చేరుతుంది. పెట్టుబడులు పెరగడంతో రైతులు చిక్కుల్లో పడ్డారు. మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలి.

చుండూరు వెంకటసుబ్బారావు, కార్యదర్శి, ఏపీ రైతుసంఘం కృష్ణాజిల్లా

టార్గెట్ మేరకు కొనుగోలు చేశాం

జిల్లాలో టార్గెట్ మేరకు మినుములు కొనుగోలు చేశాం. మొత్తం రూ.15,400 క్వింటాళ్లు కొనుగోలు చేశాం. ప్రస్తుతం నిలిపివేశాం. తిరిగి కొనుగోళ్లు చేయాలంటే కేంద్ర ప్రభుత్వ నుంచి ఆదేశాలు రావాల్సిందే. పెసల పంటను మాత్రం కొనుగోలు చేస్తున్నాం. మరికొద్ది రోజులపాటు కొనుగోళ్లు కొనసాగుతాయి.

శ్రీనివాసరావు, మేనేజర్, మార్క్‌ఫెడ్ కృష్ణాజిల్లా

ప్రకృతి వ్యవసాయంతో సిరులు

- ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్



విశాలాంధ్ర- గుంటూరు జిల్లాపరిషత్: రసాయనిక వ్యవసాయ సాగులో నష్టపోయిన రైతులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ సేద్యం చేసి సిరులు పండించాలని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ సూచించారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు ఉన్న బైబిల్ మిషన్ ప్రాంగణంలో 'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ' శిక్షణా తరగతుల ముగింపు సభలో సోమవారం పాలేకర్ ప్రసంగించారు. దేశవాళీ విత్తనం పూర్వీకులు మనకు ప్రసాదించిన అమూల్య సంపద అన్నారు. వందల ఏళ్లుగా మన దేశంలో పెరుగుతున్న రకరకాల మొక్కలు మాత్రమే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటున్నాయన్నారు. సంకర జాతి, మెరుగు పర్చిన రకాలు తట్టుకోలేవన్నారు. ప్రకృతి వ్యవసాయం నుంచి ఎంచుకున్న విత్తనాల మొక్కలు ప్రకృతి వైపరిత్యాలకు తట్టుకునే లక్షణాలు వుంటాయన్నారు. దున్నే ప్రక్రియ నుంచి మేలైన విత్తన రకాలను ఎంచుకోవాలని సూచించారు. ప్రకృతి సేద్యం ద్వారా ఆరుతడి వరి సాగు ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. శిక్షణ పొందిన రైతులందరికీ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయం, సహకారశాఖల ప్రత్యేక సలహాదారు టి.విజయ్‌కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరి జవహర్ లాల్, జేడీఏ విజయభారతి, ఉప వ్యవసాయ సంచాలకులు ఎం.రామలింగయ్య, తిరుపయ్య, జేసీ-2 ముంగా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

19న ఎస్టీయూ 70 వసంతాల ఉద్యమోత్సవం

- తిరుపతిలో20, 21 తేదీల్లో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు
- ఎస్టీయూ భవన్ ప్రారంభోత్సవం
- రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షణ్మార్తి, సుధీర్‌బాబు



విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తిరుపతి వేదికగా నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.షణ్మార్తి, సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబులు తెలిపారు. తిరుపతిలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్టీయూ భవన్ ప్రాంగణంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన ఎస్టీయూ 70 వసంతాల ఉద్యమోత్సవాన్ని స్థానిక లక్ష్మీపురం సర్కిల్‌లోని పి.ఎల్.ఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ఎస్టీయూ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రానున్నారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యాసదస్సుకు రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు, అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, పలువురు పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు హాజరవుతారన్నారు. 70 వసంతాల సందర్భంగా స్థానిక బైరాగిపట్టెడలో ఎస్టీయూభవన్‌ను ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవం చేస్తామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నట్టు వివరించారు. 2004వ సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సీపీఎస్ విధానం వలన పదవీ విరమణ తర్వాత భద్రత లేని జీవితం గడపాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని, ఈ విధానం రద్దు కోసం పెన్షన సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో ధర్నాలు, వచ్చే నెల 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించనున్నామన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో బోధనకు విఘాతం కలుగుతుందన్నారు. 14 వేల పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ఎం.వి.రమణప్ప, గంటా మోహన్, ధనంజయనాయుడు, వజ్రవేలురెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి రమేష్, పురుషోత్తం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిధి కోసం కోట బావిలో నీళ్లు తోడేస్తున్నారు

విశాలాంధ్ర - తుగ్గలి : కర్నూలు జిల్లా తుగ్గలి మండల పరిధిలోని చెన్నంపల్లికోటలో గుప్త నిధుల కోసం తవ్వకాలు 27వ రోజు సోమవారం కూడా కొనసాగాయి. వివిధ ప్రాంతాలను మార్చుతూ ఆరు చోట్ల తవ్వినప్పటికీ ఎలాంటి నిధి జాడ కానరాకపోవడంతో సోమవారం పాతాళగంగ బావిపై దృష్టిపెట్టారు. ఎండా కాలం కూడా నీరు పుష్కలంగా ఉండే బావిలో నీటిని పంపుల ద్వారా బయటకు తోడుతున్నారు. ఈ బావి ఎంత లోతున్నది ఎవ్వరికీ అంతుదొరకని విషయం. గతంలో ఆ ఊళ్ళో నీటి ఎద్దడి తీవ్రతరమైన నేపథ్యంలో రెండు మోటార్లతో నీటిని బయటకు తోడినా నీరు తగ్గలేదు. ఇప్పుడు అధికారులు నీరు మొత్తాన్ని ఎలా తీస్తారో అంతు చిక్కడం లేదని గ్రామస్తులు చర్చించుకుంటు న్నారు. ఓ పక్క గ్రామస్తులు, రాజకీయ నాయకులు, ఆ కోట వారసులు తవ్వకాలు ఆపాలని ఒత్తిడి తీసుకొస్తున్నా అధి కారులు మాత్రం కోటలో కట్టడాలను సైతం కూల్చేస్తు న్నారు. గుప్త నిధులున్నాయో లేదో తెలియదు కానీ, తరతరాల తీపి గుర్తులను భావితరాలకు అందించకుండా అధికారులు శిథిలం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తు న్నాయి. అధికారులు తవ్వించడం చర్చనీయాశమైంది.

ఏయూలో కొలువుల జాతర

- సుదీర్ఘకాలం తర్వాత తీరనున్న అధ్యాపకుల కొరత
- నియామకం కానున్న 391 మంది సిబ్బంది
- హర్షం వ్యక్తం చేసిన విద్యావేత్తలు



విశాలాంధ్ర-విశాఖ సిటీ: విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కొరత త్వరలో తీరనుంది. దశాబ్ధకాలం తర్వాత బోధనా సిబ్బంది నియామకాలు జరగనున్నాయి. దేశంలోనే ప్రఖ్యా త వర్సిటీగా పేరుగాంచిన ఏయూలో బోధ నా సిబ్బంది సరిపడా లేక పోవడం, 2006 తరు వాత ఇప్పటివరకు నియామకాలు లేకపోవడం, ఏటా కొందరు ప్రొఫెసర్లు పదవీ విరమణ చేయడంతో బోధనాపరమైన ఇబ్బందులు తలెత్తేవి. దీంతో యూనివర్శిటీ ఉన్నతాధికారులు తాత్కాలిక, ప్రత్యా మ్నాయ పద్ధతుల్లో బోధనా సిబ్బందిని వినియో గించుకుంటూ ఏర్పాట్లు చేశారు. ఈ విధానంలో విద్యార్థులకు న్యాయం జరిగినా, యూని వర్శిటీకి మాత్రం తీరని నష్టం వాటిల్లేది. నేషనల్ అక్రిడే టెడ్ కౌన్సిల్(నాక్) గుర్తింపులో కూడా ఇదే ప్రధానలోపంగా పరిగణిస్తారు. అయినప్పటికీ యూనివర్శిటీ ఉన్నతాధికారులు సమస్యను నెట్టుకొ స్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది రాష్ట్రవ్యా ప్తంగా 14 విశ్వవిద్యాలయాల్లో 1,385 మంది బోధనా సిబ్బందిని నియమించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఏయూలో 391 మంది నియామకం కానున్నారు. ఆచా ర్యులు 22 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు 28 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 341 మంది కొత్త వారు రానున్నారు. రెండు విడతలుగా కొనసాగే ఈ నియామక ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయింది. ఈ ప్రకటనపై విద్యా వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఎక్కువ వర్సిటీలకు వీసీలుగా ఏయూ ఆచార్యులే నియామకం కావటం గమ నార్హం. ఇంతటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయా నికి పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది కొరత తీరకపో యినా కొంతైనా ఊరట కలగడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులపై

పని ఒత్తిడి తగ్గించకపోతే ప్రమాదం

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దామోదరరావు



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ఏపీఎస్ ఆర్టీసీలోని గ్యారేజ్ కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించకపోతే సిబ్బంది అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు అన్నారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో సోమవారం ఈయూ గుంటూరు రీజియన్ గ్యారేజ్ కార్మికుల సదస్సు జరిగింది. ఈయూ రాష్ట్ర మెంటినెన్స్ కమిటీ సభ్యులు ఎస్.కె.ఖాజా అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన దామోదరరావు ముఖ్యఅతి థిగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 128 ఆర్టీసీ డిపోల వర్క్‌షాపుల్లో ఖర్చు తగ్గించాలన్న ఆలో చనతో ఖాళీ అవుతున్న పోస్టుల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందితో భర్తీ చేస్తున్నారన్నారు. వీరికి అనుభవం లేకపోవడంతో నాణ్యత లోపించి బస్సుల కండీషన్ సరిగ్గా లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం అన్ని డిపోలు, వర్కుషాపులలో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలన్నారు. నాణ్యమైన పనిముట్లు, స్పేర్‌పార్ట్శు, టూల్స్ సప్లయి చేయడంతోపాటు దూర ప్రాంతాలు తిరిగే బస్సులకు స్పెషల్ మెంటినెన్స్ చేయాలని కోరారు. ఈయూ రాష్ట్ర మెంటినెన్స్ కమిటీ కన్వీనర్ సి.నబీరసూల్ మాట్లాడుతూ గ్యారేజ్ కార్మికులకు యాజమాన్యం కేటాయిస్తున్న షెడ్యూల్ 3, 4, పనులపై ఎటువంటి వర్క్ స్టడీ చేయకుండా పనిచేయాల్సిందేనని కొత్త ప్రయోగాలను మానుకోవాలన్నారు. ఆర్టీసీ ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి మాట్లాడుతూ రీజియన్‌లోని అన్ని డిపోల్లోని గ్యారేజ్ కార్మికుల సమస్యలను చర్చించి నా దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు, సంస్థ అభివృద్ధి కోసం నిరం తరం పోరాడిన చరిత్ర ఒక్క ఎంప్లాయిస్ యూనియన్‌దే అన్నారు. ఈయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హనుమంతరావు, గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జి, ఈయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి.ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీలో గుర్తింపులోకి వచ్చిన ఎన్ఎంయూ ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. గత ఏడాది ఏప్రియల్ నుంచి జరగాల్సిన వేతన సవరణ కోసం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. సదస్సులో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శంకరరావు, కార్యదర్శి కోటేశ్వరరావు, విజయవాడ జోనల్ అధ్యక్షులు ఎన్.వి.కృష్ణా రావు, కార్యదర్శి ఎస్.కె.సుభాని, రీజనల్ అధ్యక్షులు ఎం.సత్యన్నారాయణ, కార్యదర్శి సి.హెచ్.సత్యనారాయణ, నాయకులు రాజేష్ ఖన్నా, జి.టి.రావు, ఏ.ప్రసాదరావు పాల్గొన్నారు.

మెట్రోలు, బస్సులకు 'కామన్‌కార్డు'



న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రజలకు సులభ రవాణా సౌకర్యం కోసం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రోరైళ్లు, బస్సుల్లో ప్రయాణించేందుకు కామన్ కార్డులను ప్రవేశపెట్టారు. దీంతో ఢిల్లీలోని వివిధ రూట్లలోని 200 డీటీసీ, 50 క్లస్టర్ బస్సులతో ప్రయాణించవచ్చు. ఈ కార్డును డెబిట్ కార్డులా ఉపయోగించవచ్చని, ఏప్రిల్ 1 నుంచి ఢిల్లీలోని మొత్తం 3,900 డీటీసీ1,600 క్లస్టర్ బస్సులను ప్రయాణీకులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

గోరఖ్‌పూర్‌లో బీఆర్‌డీ ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం



గోరఖ్‌పూర్ : బీఆర్‌డీ ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆసుపత్రిలోని ప్రిన్సిపాల్ కార్యాలయం, దానికి అనుకుని ఉన్న రికార్డు రూంలలో ఈ ప్రమాదం జరిగిందని ఫైర్ విభాగ సిబ్బంది తెలిపారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ ఘటనపై దర్యాప్తుకు కమిటీ నియమించామని చీఫ్ ఫైర్ ఆఫీసర్ టీకే సింగ్ తెలిపారు. అగ్ని మాపక వాహనాలు అక్కడికి చేరుకుని ఒక గంట సమయంలో మంటలను అదుపులోకి తెచ్చినట్టు తెలిపారు.

సచివాలయంలో దళారుల హవా..!

- సామాన్యులకు పడిగాపులు.. బడాబాబులకు రాచమార్గాలు
- సీఎం బ్లాక్‌లో సంచారం.. నిఘా వైఫల్యానికి తార్కాణం



విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర పాలనకు కేంద్ర బిందువు వెలగపూడి సచివాలయం. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత తక్కువ సమయంలో నవ్యాంధ్ర రాజధానిలో నిర్మాణం చేసుకున్న ఏకైక నిలయం. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో ఆశయాలతో తీర్చిదిద్దిన వెలగపూడి సచివాలయం నేడు దళారులకు ఆవాసంగా మారింది. సామాన్య ప్రజలు సచివాలయం లోపలికి అడుగు పెట్టాలంటే ఆంక్షలు విధించే భద్రతా సిబ్బంది బడా బాబులుకి మాత్రం రాచబాట పరుస్తున్నారు. ముఖ్యమంత్రి, ఇతర మంత్రివర్గం కొలువుదీరే సచివాలయంలో దళారులు ఇష్టానుసారం సంచరిస్తున్నారు. సచివాలయం తమ బాధలు చెప్పుకునే పరిష్కార వేదిక అని ప్రజలు ఆనందపడ్డారు. కానీ వారి ఆనందం అంతలోనే మాయమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. వెలగపూడిలో సచివాలయం ఏర్పాటు చేశాక ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య దళారి వ్యవస్థ పుట్టుకొచ్చింది. ఏ చిన్న పని కావాలన్నా దళారులు ఉండి తీరాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సచివాలయం ప్రారంభమైన నాటి నుంచి దళారులు అందరినీ పలకరిస్తూ హడావిడి చేస్తూ తమ పని కానిచ్చేస్తున్నారు. అన్ని ఛాంబర్లలో వీరు తిరిగేస్తారు. ఏ అమాత్యుల పేషీలో పని జరగలన్నా సునాయాసంగా చేసుకుపోతుంటారు. అంతా తమకే తెలుసు అనేలా వ్యవహరిస్తారు.

నమ్మబలికిస్తూ నడుచుకుపోతూ..

వెలగపూడి సచివాలయంలో అడుగుపెడుతున్న దళారులు అత్యంత హంగు ఆర్భాటాల నడుమ హడావిడి చేస్తున్నారు. ఖద్దరు చొక్కా, చేతికి ధగధగ మెరిసే ఉంగరాలు, పక్కన ముగ్గరు లేదా నలుగురు అనుచరులు. ఇంకేముంది సదరు బడాబాబులు ఆ చివరి నుంచి ఈ చివరి వరకు అన్ని బ్లాక్‌లలో తిరిగేస్తూ తమ దర్పం చూపిస్తుంటారు. ఏ మంత్రికి ముఖ్య అనుచరుడో, అధికార పార్టీలో కీలక నేతనో అనిపించే విధంగా ఆర్భాటం చూపిస్తుంటారు. ఏ బ్లాక్‌లో అడుగు పెట్టాలన్న నిబంధనలు పాటించడం తప్పనిసరి. కానీ దళారులకు అవేవీ వర్తించవు. ఐదవ బ్లాక్ నుంచి సీఎం ఉండే మొదటి బ్లాక్ వరకు ఈ దళారులు ఇష్టానుసారంగా తిరిగేస్తుంటారు. అడుగడుగునా తనిఖీల పేరిట సామాన్యులను ఇబ్బంది పెట్టే సచివాలయ భద్రతా అధికారులు మాత్రం వీరి పట్ల చూసీచూడనట్లు వ్యవహరించటం గమనించదగ్గ విషయం. సాధారణంగా సచివాలయంలోకి వెళ్లాలంటే పాసులు రాయించుకొని వెళ్లక తప్పని పరిస్థితి. గుంపులుగానో, ఎక్కువ మంది వెళ్లాలంటేనో మంత్రుల సిఫార్సులు తప్పని పరిస్థితి. ఈక్రమంలో అందరి చేత హాయ్ చెప్పించుకుంటూ, నమస్కారాలు పెట్టించుకుంటూ తిరిగే దళారులు రంగంలో దిగుతారు. మీ పని మేము చేయిస్తామంటూ ముగ్గులోకి దించి బేరసారాలు మొదలుపెడతారు. దళారుల ధైర్యానికి కారణం ఏదో ఒక ఛాంబర్‌లో విధులు నిర్వహిస్తూ వీరి పనులు చక్కబెట్టే వ్యక్తులు వీరికి తెలిసి ఉండటం. అయితే దళారులు పనులు చక్క బెట్టేందుకు సచివాలయంలోని క్యాంటీన్ వేదికగా నిలుస్తోంది. ఉదయం 10 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండింటి వరకు క్యాంటీన్ కిక్కిరిసి ఉంటుంది. మిగిలిన సమయంలో చాలా వరకు ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో దళారులు క్యాంటీన్‌లో తిష్ట వేసి గంటల తరబడి మంతనాలు చేస్తూ ఓ చక్కని స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

భద్రత పరిస్థితేంటి..?

సచివాలయంలో నిత్యం ఎంతోమంది రాకపోకలతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఏదో ఒక గుర్తింపు కార్డు లేదా సిఫార్సుతోనో వచ్చే వారి సంఖ్య ఎక్కువ ఉంటుంది. అయితే దళారులు మాత్రం సీఎం కొలువై ఉండే మొదటి బ్లాక్‌లో సైతం ఇష్టానుసారంగా సంచరిస్తారు. సీఎంతోపాటుగా ఐ.పీఆర్ కార్యాలయం ఉన్న మొదటి బ్లాక్ పూర్తి తనిఖీల అనంతరంగానీ అనుమతించని పరిస్థితి ఉంది. దళారులు మాత్రం నేరుగా వెళ్లి వచ్చేస్తూ ఉంటారు. కొన్ని సమయాల్లో కొందరు వ్యక్తులు ఐ.పీఆర్ సిబ్బందిమంటూ సరిగా సమాధానం కూడా ఇవ్వకుండా వెళ్లిపోతుంటారు.

గత కొద్ది రోజుల క్రితం ఇదే ఐ.పీఆర్ పేరు చెప్పి సైన్ బోర్డులు తయారు చేసే ఓ వ్యక్తి దర్జాగా సీఎం ఉన్న బ్లాక్‌లోకి వెళ్ళటం చర్చనీయాంశమైంది. అయితే అదే భద్రతా సిబ్బంది ఓ ఇంటెలిజెన్స్ అధికారిని అనుమతుల పేరిట ఇబ్బందులకు గురి చేయటం ఆయన తీవ్ర మనస్థాపంతో అక్కడ నుంచి వెళ్లిపోవడం జరిగింది. వాహనాలను సైతం సచివాలయంలోకి అనుమతించే క్రమంలో కొన్ని సమయాల్లో దళారులు తమ పలుకుబడిని ఉపయోగిస్తున్నట్లు సమాచారం. దళారుల బారిన పడి ఇప్పటికే ఉద్యోగాల పేరుతో మోసపోయిన యువకులు ఫిర్యాదు చేయటంతో సాక్షాత్తూ రాజధాని ప్రధాన ప్రాంతమైన తుళ్లూరులోనే దళారులను అరెస్ట్ చేసిన సంఘటన చోటు చేసుకుంది. అయితే ప్రభుత్వానికి, అమాత్యులకి ఏ విధమైన ఇబ్బందులూ తలెత్తక ముందే చర్యలు చేపడితే మంచిదనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారుల హెచ్చరికలతో సచివాలయ భద్రతా సిబ్బంది దిద్దుబాటు చర్యలలో ఉన్నట్లు సమాచారం.



మేధాశక్తికి టెక్నాలజీని జోడిస్తే దేశంలో

పేదరికమే ఉండదు : సీఎం

విశాలాంధ్ర, మంగళగిరి : మేధాశక్తికి టెక్నాలజీని జోడిస్తే దేశంలో పేదరికం అనేదే ఉండదని, మానవజీవితం ఆనందంగా వుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆవరణలో జనవరి 5 నుంచి ప్రారంభమైన అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం పూజలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం వల్ల ఒక శక్తి ఉద్భవిస్తుందని, ఆ శక్తి కొత్త రాష్ట్రానికి ఎంతగానో అవసరమన్నారు. దేశంలో ఇప్పటి వరకు 42 అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞాలు జరిగాయని, ప్రస్తుతం అమరావతిలో 43వ మహాయజ్ఞం జరిగిందన్నారు. ప్రకృతిని గౌరవించడంతో పాటు దానిలో మనమంతా భాగస్వాములు కావాల్సిన అవసరం వుందని, వ్యవసాయదారులను గౌరవించాలనే ఉద్దేశ్యంతో ఏరువాక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నేడు ఏ కంపెనీలు చూసినా మన దేశానికి చెందిన వారే ఉన్నత స్థానాల్లో వున్నారని, అందుకు గూగుల్ మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉదాహరణగా చెప్పుకోవచ్చునన్నారు. మన సంపదను, మేధోశక్తిని ఉపయోగించుకోవడంతో పాటు టెక్నాలజీని కూడా అనుసంధానం చేసుకుని ముందుకు సాగినట్లయితే మానవజీవితం ఆనందంగా వుండటంతో పాటు పేదరికం అనేది ఉండదన్నారు. అమరావతి నిర్మాణానికి తాను ఒక సంకల్పం చేశానని, ప్రపంచంలో అయిదు అద్భుత నగరాల్లో అమరావతి ఒకటిగా ఉండాలనేది తన సంకల్పం అన్నారు. అటువంటి సంకల్పానికి అశ్వమేధ గాయత్రీ మహా యజ్ఞం ఎంతో దోహదం చేస్తుందని, తాను ఇక్కడకు రావడం తన పూర్వజన్మ సుకృతంగానూ, అదృష్టంగానూ భావిస్తున్నానని చెప్పారు. సౌత్ ఇండియా కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తే వారికి కావాల్సిన భూమిని ఇచ్చేందుకు తాను సిద్ధమని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, జిల్లా కలెక్టర్ కోనా శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

'గే' ప్రిన్స్ ఔదార్యం

15 ఎకరాలలో భవనాల నిర్మాణం



సూరత్: ఆయన గుజరాత్‌లోని రాజపిప్లా మహారాజా కుటుంబీకుడు. ఆయన పేరు మన్వేందర్ సింగ్ గోహిల్. సమాజం చిన్న చూపే చూసే 'గే' (స్వలింగ సంపర్కులు)ల కోసం సొంత స్థలం 15 ఎకరాలలో అనేక భవనాలను నిర్మించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం మరికొన్ని భవనాలను నిర్మించే పనిలో ఉన్నారు. బహుశా ఈ రాజకుటుంబీకుడి వారసుడిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. గేల కోసం 'ది లక్ష్య ట్రస్టు' అనే సంస్థను ఏర్పాటుచేసి దాని ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాను గే అని చెప్పుకునేందుకు ఎంత మాత్రం వెనుకాడలేదు. 2006లో బహిరంగంగానే తాను గే అని ప్రకటించారు. గే లకు సహాయం చేసేందుకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల పైన ప్రజలకు అవగాహన కల్పించేందుకు ట్రస్టును స్థాపించారు. స్వలింగ సంపర్కుల పట్ల సమాజం నిరాదరణ చూపుతుండగా ఈ సంబంధాన్ని కలిగి ఉన్నవారు శిక్షార్హులని దేశ చట్టం చెబుతోంది. స్వలింగ సంపర్కుల మధ్య లైంగిక సంబంధం ప్రకృతి విరుద్ధమని శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 పేర్కొంటోంది. కుటుంబాలు వదిలేసినప్పటికీ వారికి భద్రత, ధైర్యం కల్పించేందుకే తాను ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు గోహిల్ తెలిపారు. గేలు ఎదుర్కొన్న సమస్యలనే తాను ఎదుర్కొన్నానని అన్నారు. తనలాంటి వారికి సామాజిక, ఆర్థిక సహాయాన్ని అందించడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. అనేక టెలివిజన్ కార్యక్రమాలలోనూ ఆయన పాల్గొని తన లక్ష్యాలను వివరించారు.

సిమెంట్ కార్మికులకు కనీసం వేతనం రూ.40 వేలు

ఆల్ ఇండియా సిమెంట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) డిమాండు



విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా సిమెంట్ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనంగా రూ.40 వేలు చెల్లించాలని ఆల్ ఇండియా సిమెంట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండు చేశారు. ఆదివారం విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో ఏఐటీయూసీ నూతన కార్యాలయంలో సోమవారం తొలిగా ఆల్ ఇండియా సిమెంట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ హెచ్.మహదేవన్ అధ్యక్షతన జరిగింది. చత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుండి సెంచరీ సిమెంట్, అల్ట్రా సిమెంట్, అంబూజి, ఇండియా సిమెంట్, సీసీఐ, మలబార్ కేరళ, బిర్లా వైట్, పెన్నా తదితర సిమెంట్ ఫ్యాక్టరీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాయ కులంతా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ గత సిమెంట్ వేతన ఒప్పందం 2014 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చిందన్నారు. కానీ సిమెంట్ కంపెనీ యాజమాన్యాలు ఆ ఒప్పందాన్ని యథాతథంగా అమలు చేయకుండా ఒప్పందాన్ని నీరు గారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్మినెంట్ ఉద్యోగస్తుల కన్నా మూడింతలు ఎక్కువగా ఉన్న కాంట్రాక్టు కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయకుండా తీవ్రమైన నష్టాన్ని కలగజేశాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2018 ఏప్రిల్ నుండి కొత్త వేతన ఒప్పందం అమలులోకి రావాల్సి ఉందన్నారు. దీనికి ముందుగా ఫెడరేషన్ తరపున చార్టర్ ఆఫ్ డిమాండ్స్ తయారు చేసి సిమెంట్ తయారీ యాజమాన్యంకు (సీఎంఏ)కు సమర్పించాల్సి ఉందని తెలిపారు. 4 సంవత్సరాల క్రితం కర్నాటక రాష్ట్రంలో మహాసభ జరిగిందని, ఈసారి మహాసభ ఏప్రిల్ తరువాత నిర్వహించాలని తెలియజేస్తూ, ఇటీవల జరిగిన యూనియన్ కార్యకలాపాల నివేదికను వివరించారు. చర్చల అనంతరం ఆల్ ఇండియా సిమెంట్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు మహదేవన్ తాను రూపొందించిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌పై చర్చలో పాల్గొన్న సభ్యుల ప్రతిపాదనలు, డిమాండ్స్‌ను పరిగణనలోకి తీసుకుని ఫిబ్రవరి మాసంలో సీఎంఏకి సమర్పిస్తామని వివరణ ఇచ్చారు. ఏప్రిల్ తరువాత జరిగే మహాసభను తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో జరపాలని సూచించింది. ప్రతిపాదనలైన చాప్టర్ ఆఫ్ డిమాండ్స్, మహాసభల నిర్వహణ, ఇతర రాష్ట్రాల్లోని సిమెంట్ రంగంలో మన నిర్మాణ విస్తరణపై తీసుకోవాల్సిన చర్యల గురించి మహదేవన్ ఇచ్చిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో సుబ్రహ్మణ్యం, శివన్న, విలాస్, వెంకటరెడ్డి, శరణప్ప, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమికి అనూహ్య స్పందన : పరకాల



విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రంలో గత ఏడు రోజులుగా జరుగుతున్న జన్మభూమి - మా ఊరు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ చెప్పారు. సచివాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడురోజులు ఈ కార్యక్రమానికి వచ్చిన వినతులు, సమస్యలు, పరిష్కారాల వివరాలను మీడియాకు వెల్లడించారు. మొదటి ఆరు రోజులకు గాను గ్రామసభలు 56,473 నిర్వహించగా, వినతులు 6,96,656 వచ్చాయని, 36,18,754 మంది ప్రజలు పాల్గొన్నారన్నారు. 1,14,098 రేషన్ కార్డులు పంపిణీ చేశామని, 64,999 నూతన పింఛన్లు మంజూరు చేశామన్నారు. 11,060 హెల్త్ క్యాంపులు నిర్వహించగా 8,41,858 మంది రోగులు నమోదు చేసుకున్నారన్నారు. 29,346 మందికి కళ్ళజోళ్ళ పంపిణీ చేయటం జరిగిందని, 1,32,687 బహుమతులు, పురస్కారాలు అందజేశామన్నారు. 8వ రోజు వినతులు 32,005 వచ్చాయని, 1,64,139 మంది ప్రజలు పాల్గొన్నారన్నారు. 5,724 రేషన్ కార్డులు పంపిణీ చేశామని, 3,488 నూతన పింఛన్లు మంజూరు చేశామన్నారు. 495 హెల్త్ క్యాంపులు నిర్వహించామని, 1,252 మందికి కళ్ళజోళ్ళ పంపిణీ, 1686 మందికి ఇళ్ళ స్థలాలు, 2660 మందికి పనిముట్లు, 657 వెటర్నరీ క్యాంపులు నిర్వహించామన్నారు. 6689 బహుమతులు, పురస్కారాలు అందజేశామన్నారు.

రైల్వే ప్రాజెక్టుల పర్యవేక్షణకు డ్రోన్లు

న్యూఢిల్లీ : రైల్వే ప్రాజెక్టుల పర్యవేక్షణకు డ్రోన్లు ఉపయోగించనున్నామని సోమవారం అధికారులు తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో అధికారులు పర్యవేక్షించడం కష్టతరంగా మారడంతో డ్రోనులను ప్రవేశపెడుతున్నా మని, రైల్వే ట్రాకులు, మౌలిక సదుపాయాల పనుల కోసం యూఏవీ,నేత్ర కెమేరాలను వీటిద్వారా ఉపయోగిస్తామన్నారు. జోనల్ రైల్వే అధికారులకు కెమేరాల కొనుగోళ్లపై సూచనలు జారీ చేశామని, మానవరహిత ఏరియల్ వాహనాలు లేదా డ్రోనులు ప్రాజెక్టు పర్యవేక్షణతోపాటు రెస్క్యూ ఆపరేషన్లలో కూడా ఇవి సాయమందిస్తాయని ఒక ప్రకటన పేర్కొంది. రైల్వే ట్రాకుల నిర్వహణ, నాన్-ఇంటర్‌లాకింగ్, ఉత్సవాల్లో క్రౌండ్ మేనేజ్‌మెంట్, భద్రతలను కూడా పర్యవేక్షిస్తాయి. డ్రోన్ అంటే ఎగిరే రోబో అని వాటిని రిమోట్ ద్వారా నియంత్రించి జీపిఎస్ వ్యవస్థకు అనుసంధానం చేస్తారని అధికారులు వెల్లడించారు.


ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్
- మోదవలస దళితులకు మద్దతుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా



విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : దళితులు, అట్టడుగు వర్గాల ప్రజలపై రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల దాడులు పెచ్చుమీరిపోతున్నాయని, వీటికి అడ్డుకట్టపడకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ హెచ్చరించారు. విజయనగరం జిల్లాలోని మోదవలసలో అధికార పార్టీ నాయకుల చేతిలో దాడికి గురైన బాధితులను జిల్లా కేంద్రాస్పత్రిలో సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు వివిధ దళిత, ప్రజా సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద రాస్తారోకో, ధర్నా చేసి నిరసన తెలిపారు. ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులపై దాడులు ఎక్కువైపోయాయని విమర్శించారు. వివిధ సంఘటనల్లో అధికార పార్టీ నాయకులే ఈ దాడులకు సూత్రధారులుగా ఉండటం గమనార్హమని పేర్కొన్నారు. గరగపర్రు, జెర్రిపోతుల పాలెం తదితర సంఘటనలు మరువకముందే మోదవలసలో దాడులు చోటుచేసుకోవడమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేదంటే, దీని వెనుక అధికార పార్టీ హస్తం ఉందని స్పష్టమవుతోంద న్నారు. సీపీఐ, సీపీఎం తదితర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు మాత్రమే బాధితులకు అండగా నిలిచాయ న్నారు. బాధితులకు పూర్తిగా న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. డిహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ దళితులపై దాడి జరిగితే తక్షణమే జిల్లా కలెక్టర్, ఎస్పీలు పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇప్పించాలని చట్టం ఉన్నప్పటికీ, విజయనగరం జిల్లా యంత్రాంగం పట్టించుకోలేదని విమర్శించారు. ధర్నాలో పాల్గొన్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఏ.విమల మాట్లాడుతూ మోదవలసలో మహిళలు, బాలింతలపై దాడికి పాల్పడ్డ అధికార పార్టీ నాయకులపై అట్రాసిటీ చట్టంతోపాటు, నిర్భయ చట్టం కింద కూడా కేసులు పెట్టాలని డిమాండు చేశారు. డిహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒమ్మి రమణ, గోక రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మి అప్పలరాజుదొర, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బాయి రమణమ్మ, సహాయ కార్యదర్శి తుమ్మి లక్ష్మిరాజ్, వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి.జైహింద్‌కుమార్, కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, వివిధ దళిత, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై విపక్షాల ఐక్యత



ఎన్నికల్లో ప్రస్తుతం వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్

న్యూఢిల్లీ: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎం)కు బదులు బ్యాలెట్ పత్రాలనే ఉపయోగించాలని, లేదంటే అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటు రసీదు వచ్చే ఈవీఎంలను ఉపయోగించాలని ఎన్డీయే ఏతర ప్రతిపక్ష పార్టీలన్నీ డిమాండు చేస్తున్నాయి. అవి తమ డిమాండ్‌ను సాధించేందుకు ఏకమవుతున్నాయి కూడా. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) విజయం సాధించడానికి కారణం ఈవీఎంలను ట్యాంపర్ చేయడమేనని ప్రతిపక్షాలు ఆరోపించడం, పాటిదార్ల ఉద్యమ నాయకుడు హార్ధిక్ పటేల్ దీనిపై పెద్ద ఎత్తున గొడవ చేసిన విషయం తెల్సిందే. ఈ ఏడాది ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మళ్లీ ఈవీఎంల అంశం ముందుకు వచ్చింది. ఈ అంశంపై చర్చించేందుకు సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పిలుపు నిచ్చిన విషయం తెలిసిందే. ఆ పార్టీ నాయకుడు జనేశ్వర్ మిశ్రా నివాసంలో జరిగిన సమావేశానికి బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి మినహా అందరు హాజరు కావడం విశేషం. ఈవీఎంలకు వ్యతిరేకంగా మొట్టమొదట ఆందోళన నిర్వహించినదీ మాయావతియేనని, ఈ అంశంపై మున్ముందు జరిగే సమావేశాలకు ఆమె తప్ప కుండా హాజరు అవతారని ఆమె పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్ దళ్, సీపీఐ, సీపీఎం పార్టీలు హాజరయ్యాయి. దేశవ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో దశల వారిగా ఓటుకు రసీదు వచ్చే యంత్రాలను ఉపయోగిస్తామని, అందులో భాగంగా ముందుగా ప్రతి నియోజకవర్గంలో ఐదు శాతం పోలింగ్ కేంద్రాల్లో వీటిని అమలు చేస్తామని ఎన్నికల కమిషన్ ఇదివరకే ప్రకటించింది. అయితే ఇటీవల జరిగిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక్క పోలింగ్ కేంద్రంలో మాత్రమే అమలు చేయగలిగింది. ఈ నేపథ్యంలో బ్యాలెట్ పత్రాల అంశం డిమాండ్ ముందుకు వచ్చింది. ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఈ అంశాన్ని సమగ్రంగా చర్చించేందుకు మరో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎన్డీయే ఏతర ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఫిబ్రవరిలో జరగనున్న త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలు ఉపయోగించినట్లయితే అన్నింటికీ ఓటు రసీదు వచ్చే పద్ధతి ఉండాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు డిమాండు చేస్తున్నాయి.

అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు అన్నీ అడ్డంకులే...

- ఇప్పటికి రాని జాతీయ రహదారి నెంబర్....
- అది నుంచి కేంద్రం అనాసక్తి....
- మోడీ భేటీలో బాబు ప్రస్తావించే అవకాశం...



విశాలాంధ్ర అమరావతి : రాజధానికి రాయలసీమకు నడుమ నిర్మించ తలపెట్టిన రహదారికి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. అన్ని వైపుల నుంచి రాజధాని అమరావతికి అద్భుత రహదారులు నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇన్నర్, ఔటర్ రహదారులను తీర్చిదిద్దే ప్రణాళికకు భూసమీకరణ అతి పెద్ద సమస్యగా మారింది. ప్రధానంగా రాయలసీమ వాసులకి రాజధానిని చేరువ చేసే అమరావతి ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి ఇప్పుడప్పుడే అడ్డంకులు తొలిగేలా లేదు. 6,4 లైన్లగా నిర్మిస్తున్న ఈ రహదారి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులేస్తోంది. భూసేకరణకు అయ్యే వ్యయాన్ని కేంద్రప్రభుత్వం భరించే అంశం చిక్కు ముడిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ రహదారి ముందుకు సాగకపోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

రహదారి నిర్మాణ ప్రణాళిక : అనంతపురం నుంచి అమరావతి వరకు నిర్మిస్తున్న రహదారి 395 కిలోమీటర్ల మేర ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. అనంతపురం నుంచి గిద్దలూరు వరకు 4 వరుసలుగా ఈ రహదారి ఉండనుంది. అక్కడి నుంచి 6 వరుసలుగా ఈ రహదారి నిర్మాణం జరగనుంది. దీని నిర్మాణానికి రూ. 24 వేల కోట్ల ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. దీనికోసం 8562 హెక్టార్ల భూమితో పాటుగా ,838 హెక్టార్ల అటవీ భూమి సేకరించాల్సి ఉండగా, భూసేకరణకు 2 వేల కోట్ల పైనే ఖర్చవుతుందని సర్కార్ అంచనా వేస్తోంది, ఆ వ్యయాన్ని జాతీయ రహదారిగా ప్రకటిస్తే కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. అందులో భాగంగానే జాతీయ రహదారుల చట్టాన్ని అనుసరించి రెవెన్యూ శాఖ భూసేకరణను పూర్తి చేసింది. నేటికి అనంతపురం - అమరావతి నేషనల్ హైవేకి జాతీయ రహదారుల చట్టం ప్రకారం కేటా యించాల్సిన నెంబర్ కేటాయించ కపోవటంతో రహదారి నిర్మాణాన్ని వెనక్కి నెట్టినట్లయింది. ఒకసారి నెంబర్‌ని ప్రకటిస్తే రహదారి నిర్మాణం వ్యయమంతా కేంద్రమే భరించాల్సి ఉండటంతో పనులలో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. భారత్ మాల ప్రాజెక్టులో చేర్చాలనే కేంద్ర రహదారుల శాఖ ఆలోచనతో మరిన్ని ఇక్కట్లు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒక రాష్ట్రానికి ఒక ఆర్థిక సంవత్సరంలో వంద కిలో మీటర్ల చొప్పున రెండు మార్గాలకి మించి నిధులు ఇచ్చే పరిస్థితి లేదు. అందులో భాగంగానే అనంతపురం - అమరావతి ఎక్స్ ప్రెస్ రహదారి ఏడాదికి 200 కిలోమీటర్ల ఇచ్చినా కనీసం మూడు సంవత్సరాలు పైబడి నిర్మాణం కొనసాగుతుంది. కర్నూలు, కడపల నుంచి వచ్చి కలిసే మార్గాలు మొత్తం కలిపి ఈ రోడ్డు 557 కి.మీ వరకు విస్తరించనుంది. ఈ క్రమంలో అమరావతి ఎక్స్ ప్రెస్ నిర్మాణం జరుకోవాలంటే మరిన్ని అడ్డంకులు అధిగమించాల్సి ఉంది. అటవీ భూముల మళ్లింపు మరో ఇబ్బందికరమైన అంశంగా మారింది. వీటికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి. నల్లమల , శిరువెళ్ల, గానుగ పెంట, బేతంచెర్ల, పాణ్యం, ఉప్పు మాగులూరు, తదితర రక్షిత అటవీ ప్రాంతాల మీదగా అమరావతి ఎక్స్‌ప్రెస్ నిర్మితం కానుంది. నల్లమల అటవీ ప్రాంతంలో పుల్లులు సంచరించే అభయారణ్యం ఉండటంతో అటవీ వన్య ప్రాణుల చట్టం ప్రకారం కీలక అనుమతులు పొందాల్సి ఉంది.

విభేదాలతో వెనుకంజ : పలు అభివృద్ధి పనుల విషయంలో రాష్ట్రానికి , కేంద్రానికి నడుమ విబేధాలు రావటంతో అమరావతి ఎక్స్ ప్రెస్ పై పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుందని సమాచారం. పులుల జాతులు అంతరించి పోతున్న తరుణంలో నల్లమల అటవీ ప్రాంతం, అభయారణ్యం ప్రాంతాలకు నష్టం కలిగే పరిణామాలను కేంద్రం హర్షించటంలేదని అటవీ శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. రాజధాని నిర్మాణం తర్వాత రహదారుల పై దృష్టి సారించవచ్చు అనే ఆలోచనలో కూడా కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అనంతపురం - అమరావతి ఎక్స్ ప్రెస్ రహదారికి ఎన్. హెచ్ నెంబర్ కేటాయించకుండా తాత్సారం చేస్తోందన్న వాదనలు ఉన్నాయి. ఈ నెల 12న ప్రధాని మోడీతో ముఖ్యమంత్రి భేటీలో ఈ రహదారి అంశం కూడా చంద్రబాబు ప్రస్తావించే అవకాశం ఉందని సమాచారం.

విశాలాంధ్ర

క్రీడలు

భారత్‌కు ఫిలాండర్ షాక్

- కేప్‌టౌన్ టెస్టులో టీమిండియా ఓటమి
- 72 పరుగుల తేడాతో ప్రొటీస్ విజయం
- బౌలర్లు రాణించినా.. కొంపముంచిన టాప్‌ఆర్డర్

అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడంలో కోహ్లిసేన చతికిలపడింది. స్వల్పమైన లక్ష్యాన్ని ఛేదించడంలో తడబడి, వికెట్లు సమర్పించుకుంది. గెలుస్తామనుకున్న మ్యాచ్‌ను టాప్‌ఆర్డర్ ముంచేసింది. దక్షిణాఫ్రికా బౌలర్ ఫిలాండర్ ధాటికి విలవిలలాడింది. కోహ్లి, అశ్విన్ మినహా మిగతావారెవరూ రాణించకపోవడంతో ఓటమి తప్పలేదు.



కేప్‌టౌన్ : భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 72 పరుగుల తేడాతో విజయం సాధించింది. 208 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో టీమిండియా బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. దక్షిణాఫ్రికా బౌలర్ ఫిలాండర్ 6 వికెట్లు తీసి ప్రొటీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఒకరోజు మిగిలి ఉండగానే ఆట ముగిసింది. మూడో రోజు ఆటంతా వర్షార్పణం కావడంతో నాలుగో రోజు, సోమవారం దక్షిణాఫ్రికా 65/2తో ఆట ఆరంభించింది. క్రీజులో సంప్రదాయ ఆటగాడు ఆమ్లా (4), నైట్‌వాచ్‌మన్ రబాద (5) ఉన్నారు. ఆరంభం నుంచే షమి (3/39), అరంగేట్ర ఆటగాడు బుమ్రా (3/39), భువనేశ్వర్ కుమార్ (2/33) చురకత్తుల్లాంటి బంతులు సంధించారు. దీంతో సఫారీ బ్యాట్స్‌మెన్ బ్యాట్లు ఎత్తేశారు! జట్టు స్కోరు 66 వద్ద ఆమ్లా, 73 వద్ద రబాదను షమి పెవిలియన్ పంపించాడు. మరో 9 పరుగులకే సారథి డుప్లెసిస్ (0)ను ఐదో వికెట్‌గా బుమ్రా ఔట్ చేశాడు. కీపర్ బ్యాట్స్‌మన్ డికాక్ (0)నూ మైదానంలో నిలవనీయలేదు. మరో పది పరుగులకే 30.4వ బంతికి అతడిని వెనక్కి పంపించాడు. ఆ తర్వాత 3 పరుగులకే ఫిలాండర్ (0) షమి వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో ఏబీ డివిలియర్స్ (35, 50 బంతుల్లో 2x4, 2x6)కు తోడుగా నిలిచేవారే కరవయ్యారు. బుమ్రా బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదబోయిన అతడు చివరి వికెట్‌గా జట్టు స్కోరు 130 వద్ద పెవిలియన్ చేరాడు. అంతకు ముందు కేశవ్ మహరాజ్ (15), మోర్నీ మోర్కెల్ (2)ను భువి ఔట్ చేశాడు. చివరికి గాయపడ్డ డేల్ స్టెయిన్ (0) నాటౌట్‌గా నిలిచాడు.

అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో భారత్.. ఓపెనర్ల వికెట్లు చేజార్చుకుంది. స్వదేశంలో శ్రీలంక సిరీస్‌లో వీరోచిత ఫామ్ కనబరిచిన ఓపెనర్ శిఖర్ ధావన్ (16, 20 బంతుల్లో 2×4) ఔటయ్యాడు. ఇన్నింగ్స్ 7.5వ బంతిని మోర్కెల్ షార్ట్‌పిచ్‌లో వేశాడు. తలపైకి వచ్చిన బంతిని ఆడబోయి గల్లీలో క్రిస్‌మోరిస్ చేతికి చిక్కాడు. ఇక రెండు సార్లు సమీక్ష కోరి బతికిపోయిన మురళీ విజయ్ (13, 32 బంతుల్లో 2×4) ఫిలాండర్ వేసిన 8.5వ బంతికి ఔటయ్యాడు. అంతకు ముందు ఫిలాండర్ వేసిన 2.2, 6.5 బంతులకే విజయ్‌ను అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. చివరికి అతడి బౌలింగ్‌లోనే ఏబీడీకి క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. రెండు వికెట్లు చేజార్చుకున్న తరుణంలో నిలబడతాడని అనుకున్న ఛెతేశ్వర్ పుజారా (4, 13 బంతుల్లో) ఔటయ్యాడు. తప్పక ఆడాల్సిన బంతిని ఎదుర్కొని పెవిలియన్ చేరుకున్నాడు. సఫారీ బౌలర్ మోర్నీ మోర్కెల్ 12.2వ బంతిని కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌లో వేశాడు. ఆఫ్‌వికెట్ మీదుగా వేగంగా దూసుకొచ్చిన బంతిని పుజారా డిఫెన్స్ చేయబోయాడు. బ్యాట్ అంచుకు తాకిన బంతి నేరుగా వికెట్ కీపర్ డికాక్ చేతుల్లో పడింది. బ్యాట్స్‌మెన్ నిలదొక్కుకున్నాడని అనుకునే లోపే టీమిండియా సారథి విరాట్ కోహ్లి (28, 40 బంతుల్లో 4×4) పెవిలియన్ చేరుకున్నాడు. ఫిలాండర్ వేసిన 21.4వ బంతిని ఆడబోయి వికెట్ల ముందు దొరికిపోయాడు. బ్యాట్‌ను తాకని బంతి కోహ్లిప్యాడ్లను తాకింది.

సమీక్షలోనూ అతడిని అదృష్టం వరించలేదు! అప్పుడు జట్టు స్కోరు 71. ఆ తర్వాత 5 పరుగులకే రోహిత్ శర్మ (10, 30 బంతుల్లో) ఔటయ్యాడు. ఫిలాండర్ వేసిన 23.2వ బంతిని ఆడబోయి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో టీమిండియా 75కే 5 వికెట్లు చేజార్చుకుంది. అంతకుముందు రబాద వేసిన 22.3వ బంతికి రోహిత్‌కు ప్రమాదం తప్పింది. అతడు గాల్లోకి లేపిన బంతిని డీప్ స్క్వేర్‌లెగ్‌లో ఫీల్డర్ కేశవ్ మహరాజ్ కళ్లలోకి ఎండ పడటంతో సరిగ్గా పట్టుకోలేకపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో జట్టును గట్టెక్కించిన హార్దిక్ పాండ్య (1, 5 బంతుల్లో) జట్టు స్కోరు 77 వద్దే ఔటయ్యాడు. రబాడ వేసిన 24.1వ బంతికి డివిలియర్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం కొంచెం సేపు రవిచంద్రన్ అశ్విన్, భువనేశ్వర్ కుమార్‌లు దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. అడపాదడపా బౌండరీలు సాధిస్తూ ఓటమి అంతరాన్ని తగ్గించారు. అనూహ్యంగా అశ్విన్‌ను ఫిలాండర్ ఔట్ చేయబడంతో మరళా వికెట్ల పతనం ప్రారంభమైంది. అనంతరం క్రీజులోకి వచ్చిన షమీ, బూమ్రాలు ఎక్కువ సేపు నిలవలేకపోవడంతో, దక్షిణాఫ్రికా విజయం ఖాయమైంది. మూడు సిరీస్‌ల మ్యాచ్‌ల్లో భాగంగా రెండో టెస్టు ఈనెల 13 నుంచి సెంచూరియన్ వేదికగా జరగబోతోంది.

సాహా.. అరుదైన రికార్డు



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో భారత కీపర్ వృద్ధిమాన్ సహా ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో పది క్యాచ్‌లు అందుకున్న సాహా ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న భారత కీపర్‌గా రికార్డు సృష్టించ చాడు. అంతకు ముందు తొమ్మిది క్యాచ్‌లతో ఉన్న టీం ఇండియా మాజీ కెప్టెన్ ధోనీ రికార్డును ఈ మ్యాచ్‌లో సాహా అధిగమించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు క్యాచ్‌లు అందుకున్న సాహా రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు క్యాచ్‌లు అందుకున్నాడు.

30 నుంచి ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ : వరల్డ్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ సవరించిన షెడ్యూలును సోమవారం ప్రకటించింది. దాని ప్రకారం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 4 వరకూ న్యూఢిల్లీలో భారత ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు జరగనున్నది. వాస్తవంగా ఈ షెడ్యూలును మార్చి-ఏప్రిల్ స్లాట్‌లో ఏర్పాటు చేశారు. ఈ మ్యాచ్‌లన్నీ న్యూఢిల్లీలోని సిరీ ఫోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరుగుతాయి. 2017 బ్యాడ్మింటన్ గతిని మార్చిన సంవత్సరంగా చెప్పవచ్చు. ఆ ఏడాది ప్రధానంగా సైనా నెహ్వాల్, పీవీ సింధు పేర్లే వినబడ్డాయి. అయితే అనూహ్యంగా కిదాంబి శ్రీకాంత్ తెరపైకి దూసుకొచ్చాడు. భారీ విజయాలు సాధిస్తూ వరల్డ్ నెం.2 ర్యాంకుకు చేరుకున్నాడు.

ధోనీ... తలైవా అభిమాన క్రికెటర్

చెన్నై : ప్రస్తుతం ఎవర్ని అయినా మీ అభిమాన క్రికెటర్ ఎవరు అంటే వెంటనే చెప్పే పేరు విరాట్ కోహ్లి. మరి తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా తన అభిమాన క్రికెటర్ ఎవరంటే కోహ్లి పేరే చెప్తారా లేదంటే ఇంకొకరి పేరు చెప్తారా. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న రజనీకాంత్‌ను మీ అభిమాన క్రికెటర్ ఎవరని ప్రశ్నించారు. దీనికి ఆయన ఏమాత్రం ఆలోచించకుండా భారత్‌కు రెండు ప్రపంచకప్‌లు అందించిన మహేంద్ర సింగ్ ధోనీ అని సమాధానమిచ్చారు. అంతే ఒక్కసారిగా ఆ ప్రాంగణం అంతా ధోనీ పేరుతో మార్మోగిపోయింది. చెన్నై వాసులకు తలైవా, ధోనీ అంటే ఎంతిష్టమో ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ధోనీతో పాటు రైనా, జడేజాను అట్టి పెట్టుకున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం యాడ్ షూటింగ్‌లో భాగంగా దర్శకుడు శంకర్‌తో కలిసి పని చేసిన ధోనీ ఎక్కువగా రజనీ గురించే అడిగి తెలుసుకున్నారని ఓ ఇంటర్వ్యూలో చెప్పిన సంగతి తెలిసిందే.



హెచ్‌సీఏపై అజారుద్దీన్ ఫైర్

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ)పై మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తొలుత అజారుద్దీన్‌ను అనుమతించలేదు. దీంతో ఆయన సుమారు గంటకు పైగా బయటే నిల్చోవాల్సి వచ్చింది. దీనిపై నిరసన వ్యక్తం చేయడంతో ఆ తర్వాత అతన్ని అనుమతించారు. తాజాగా అజారుద్దీన్ తనను సర్వసభ్య సమావేశానికి అనుమతించకపోవడంపై మాట్లాడుతూ.. 'సుమారు గంటకు పైగా బయటే నిల్చున్నాను. నేను హైదరాబాద్ ఆటగాడిని. అలాగే టీమిండియాకు పదేళ్లు కెప్టెన్‌గా వ్యవహరించాను. క్రికెట్ గురించి తెలియనివాళ్లు హెచ్‌సీఏను నిర్వహిస్తున్నారు. కనీసం వీరు ఎప్పుడైనా వారి జీవితంలో బ్యాట్ లేదా బంతిని కూడా పట్టుకుని కూడా ఉండరు. అలాంటివారు క్రికెట్ సంఘాన్ని నిర్వహిస్తున్నారు. మీరంతా నా సభ్యత్వానికి మద్దతు తెలిపితే.. సమస్యలన్నింటిని నేను పరిష్కరిస్తాను' అని ఆయన తెలిపారు. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల కారణంగా బీసీసీఐ అజారుద్దీన్‌పై జీవితకాల నిషేధాన్ని విధించిన సంగతి తెలిసిందే.



ఐపీఎల్‌కు దక్షిణాఫ్రికా ఆతిథ్యం..?

న్యూఢిల్లీ : మరోసారి ఐపీఎల్ దేశం బయట నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐతే ఇది ఈ ఏడాది జరిగే సీజన్ కాదు వచ్చే ఏడాది. ఔను 2019 ఐపీఎల్ సీజన్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఇంతకీ ఎందుకో తెలుసా.. వచ్చే ఏడాది దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఐపీఎల్-12వ సీజన్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించాలని యోచిస్తున్నారు. ఇందుకు సఫారీ బోర్డుతో నిర్వాహకులు చర్చలు జరపగా సానుకూల స్పందన వచ్చినట్లు సమాచారం. 2009లోనూ ఎన్నికల కారణంగా ఐపీఎల్-3వ సీజన్‌కు దక్షిణాఫ్రికా ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఐపీఎల్-11వ సీజన్ ఏప్రిల్ 4న ప్రారంభమై మే 31తో ముగియనుంది. ఈ నెల 27, 28 తేదీల్లో ఆటగాళ్ల వేలం బెంగళూరులో జరగనుంది.

ఎర్రజెండా సాక్షిగా...

- ఘనంగా సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం
- పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన షమీమ్ ఫైజీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: భారత కమ్యునిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి సమావేశాలు విజయవాడలోని దాసరిభవన్‌లో సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతీయ స్థాయి నేతలతోపాటు 29 రాష్ట్రాల నుంచి రాష్ట్ర సమితి నుంచి ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. నగరానికి వచ్చిన అతిధులకు రాష్ట్ర సమితి నాయకులు స్వాగతం పలికారు. ఒకరినొకరు ఆత్మీకంగా పలుకరించుకొని క్షేమసమాచాలను అడిగి తెలుసుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కొందరు నాయకులు సంప్రదాయరీతిలో తెల్లని ధోవతులను ధరించారు. ఉదయం జాతీయ కార్యవర్గ సమావేశం జరగగా, సాయంత్రం 4 గంటలకు జాతీయ కార్యదర్శి షమీమ్ ఫైజీ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభమైన సమితి సమావేశాలకు ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షత వహించగా కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు అతుల్‌కుమార్ అంజన్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, అమరులైన కమ్యునిస్టు యోధులకు నేతలు 2 నిముషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనివార్యకారణాల వల్ల సమావేశాలకు హాజరు కాలేనివారి సందేశాలను, వారు పంపిన వివరాలను పార్టీ కార్యదర్శివర్గసభ్యురాలు అమర్‌జిత్‌కౌర్ చదివి వినిపించారు. సమావేశాల ప్రారంభానికి ముందు ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారుడు ఆర్ పిచ్చయ్య పలు విప్లవ, అభ్యుదయ గేయాలను ఆలపించారు. విరామ సమయంలో అగ్రనేతలు సురవరం సుధాకరరెడ్డి, డి రాజా, కె నారాయణ, రామేంద్రకుమార్, అతుల్‌కుమార్ అంజన్, పన్నీర్ రవీంద్రన్, నాగేంద్రనాథ్ ఓఝా, అమర్‌జిత్‌కౌర్ తదితరులు ఆయా రాష్ట్ర నేతలతో ముచ్చటించారు.



జెండాను ఆవిష్కరిస్తున్న షమీమ్ ఫైజీ
చిత్రంలో సురవరం సుధాకరరెడ్డి, నారాయణ, అతుల్ కుమార్ అంజాన్



భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయసమితి సమావేశాలకు హాజరైన మణిపూర్ కామ్రేడ్స్‌కు విశాలాంధ్ర దినపత్రిక కార్యాలయంలో వివిధ విభాగాలను చూపుతున్న విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి

నేడు ఎంపీలతో రైల్వే జీఎం సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ పార్లమెంటు సభ్యులతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ మంగళవారం సమావేశం కానున్నారు. సత్యనారాయణపురంలోని ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రెనింగ్ సెంటరు (ఈటీటీసీ) లో ఈ భేటీ జరగనుంది. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా రైల్వే ప్రాజెక్టులు, ఆయా రైల్వేస్టేషన్లలో అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్ల పరిధిలోని ఎంపీలను ఈ సమావేశాలకు ఆహ్వానించారు. ఎంపీలు అందచేసే వినతి పత్రాలను పరిశీలించిన అనంతరం వాటిని రైల్వే బోర్డుకు సమర్పిస్తారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.